సెప్టెంబర్
2022

సంపుటి :18 సంచిక : 4

197

వెల రూ. 15/-

MARXISTU


# మార్క్సిస్టు

సైద్ధాంతిక మాసపత్రిక

**ఈ సంచికలో........**

పార్లమెంటరీతత్వంపై పోరాడ్డమే
మల్లు స్వరాజ్యంకు నిజమైన నివాళి
దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం, ప్రజలకు ఆర్థిక విముక్తి లక్ష్యం
ఆటోమేషన్ ప్రభావాన్ని 'రోబో పన్ను' భర్తీ చేయగలదా?
మత మార్పిడుల సాకుతో హింసాకాండ
మునుగోడు ఉప ఎన్నిక ఎందుకొచ్చింది?
మౌర్య సామ్రాజ్యం : ఆర్థిక, సామాజిక,సాంస్కృతిక పరిస్థితులు
ఉచితాల పేరుతో సంక్షేమ పథకాలపై బిజెపి దాడి
ఉక్రెయిన్ యుద్ధం : తల్లకిందులవుతున్న అమెరికా అంచనాలు
స్వాతంత్ర్యోద్యమం - కమ్యూనిస్టులు

# పార్లమెంటరీతత్వంపై పోరాడ్డమే మల్లు స్వరాజ్యంకు నిజమైన నివాళి



రచయిత సిపిఐ(ఎం) మాజీ రాష్ట్ర కార్యదర్శి

**పెనుమల్లి మధు**

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం దేశ స్వాతంత్ర్యోద్యమం రోజుల్లో సాగిన మహత్తర రైతాంగ పోరాటం. 10 లక్షల ఎకరాల భూములను రైతులకు పంచిన పోరాటం అది. ఈ పోరాటంలో నాలుగు వేల మంది రైతులు ప్రాణాలను బలిదానం చేశారు. నీ బాంచన్ దొర... నీ కాల్మొక్త దొర.... అన్న నైజాం నిరంకుశ పాలనను ఎదిరించి రైతాంగం సాగించిన ఈ పోరాటంలో తుపాకీ బూని దళాల్లో పాల్గొన్నది మల్లు స్వరాజ్యం గారు. అందుకే ఆమె వీర వనిత అయింది.

జాతీయోద్యమ రోజుల్లో ప్రజా పోరాటాల ద్వారా కమ్యూనిస్టులు బలపడ్డారు. స్వాతంత్ర్యానంతరం కమ్యూనిస్టు పార్టీలో విభేదాలు, చీలికలు వచ్చినా కూడా పోరాటాలు నిర్వహించడం ద్వారా కమ్యూనిస్టులు ప్రజల్లో బలాన్ని పుంజుకున్నారు. 1957లో ఇ.ఎం.ఎస్.నంబూద్రిపాద్ నాయకత్వంలో కమ్యూనిస్టు పార్టీ తొలిసారిగా కేరళలో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 1967లో కేరళతో పాటు బెంగాల్‌లో వామపక్ష ప్రజాతంత్ర ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. అనంతరం త్రిపురలోను కమ్యూనిస్టులు ప్రభుత్వంలోకి వచ్చారు. కానీ 1990-91 నుండి సరళీకరణ ఆర్థిక విధానాల అమలు ప్రారంభమయ్యాక ప్రజల్లో ఏర్పడ్డ విభజనలు, వైవిధ్యం తీవ్రమై ప్రజా ఉద్యమాల్లో ఐక్యతను దెబ్బతీశాయి. ఒకవైపు కార్మికుల ఐక్యత, మరోవైపు రైతాంగ ఐక్యత విచ్ఛిన్నం చేయబడ్డాయి. 1964 నుండి 1990-91 వరకూ ఎన్నడూ ఎరుగనంతటి నిర్బంధాన్ని కమ్యూనిస్టులు ఎదుర్కోవలసి వచ్చింది. అయినా పార్టీ బలం పెరిగింది. కానీ 1991 అనంతరం బలహీనపడుతూ వచ్చింది. వీటన్నింటిలో స్వరాజ్యం గారు కమ్యూనిస్టు ఉద్యమానికి బాసటగా నిలిచారు.

అయితే ఇప్పుడు కమ్యూనిస్టు ఉద్యమం ఇంతగా బలహీనపడడానికి కారణాలు ఏమిటని ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కారణాలను 23వ అఖిలభారత పార్టీ మహాసభ విశ్లేషించింది. కర్తవ్యాలను విశదీకరించింది. కష్టజీవుల ఉద్యమాలను బలహీనపర్చిన ధోరణుల నేపథ్యంలో మల్లు స్వరాజ్యం గారి జీవితం, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం మనకు మార్గదర్శకం కావాలి. 1990 అనంతరం గ్లోబలైజేషన్ తెచ్చిన విభజనలు, చీలికలు ప్రజా ఉద్యమాలకు



ఆటంకం అయ్యాయి. ఈ పరిస్థితిని ఎదుర్కొనే క్రమంలో కమ్యూనిస్టు ఉద్యమంలో పార్లమెంటరీ ధోరణులు బలపడ్డాయి. ఈ ధోరణులే కమ్యూనిస్టు ప్రజా పలుకుబడి బలహీనపడ్డానికి కారణం. ఈ అంశాన్నే 23వ మహాసభ రాజకీయ నిర్మాణ నివేదికలో పేర్కొన్నది. అంతకుముందు అనేక సందర్భాల్లో ఈ ధోరణి ప్రమాదాన్ని గురించి చెప్పిన అంశాల్ని పరిగణలోనికి తీసుకున్నది.

23వ మహాసభ రాజకీయ తీర్మానం 2.168 పేరాలో ముందుగా పార్టీని బలపర్చుకోవడం అన్నింటికంటే ప్రథమ కర్తవ్యమని పేర్కొన్నది. పార్లమెంటరీతత్వాన్ని ఎదుర్కోవడం ద్వారా హిందూత్వాన్ని దాని బహుముఖ సంస్థలను ఎదుర్కోవడం, ప్రజల అన్ని జీవన రంగాల్లో స్థిరమైన రీతిలో కృషి జరగాలని పేర్కొన్నది. ప్రజల సాంస్కృతిక, జీవన రంగాలన్నింటిలో ఈ పని ఏకధాటిగా సాగాలని కోరింది. ఈ కర్తవ్యాల నిర్వహణే నేడు వీరవనిత మల్లు స్వరాజ్యంగారికి నిజమైన నివాళి అవుతుంది. ఈ సందర్భంగా కొన్ని ముఖ్యమైన అంశాలను మనం పరిగణలోనికి తీసుకోవాలి. కర్తవ్యోన్ముఖులం కావాలి.

**పార్లమెంటరీ తత్వం**

మన పార్టీ పెరుగుదలకు ప్రధానంగా ఆటంకం కలిగిస్తున్నది పార్టీలో ప్రబలిన పార్లమెంటరీతత్వ ధోరణులే. దీనివల్లే గడిచిన 20 సంవత్సరాల నుండి ప్రజాపునాది తరుగుతూ వస్తున్నదని పార్టీ పేర్కొన్నది.

ఈ ధోరణి గురించి కలకత్తా ప్లీనం నిర్దిష్టంగా పేర్కొని అధిగమించాలని కోరింది. ఈ విషయాన్ని 23వ పార్టీ మహాసభ పేర్కొన్నది. పార్లమెంటరీ స్థానాలకు, పదవులకు వ్యక్తులు పోటీ పడడం, పదవుల పట్ల వ్యామోహంగా మనం భావిస్తాం. కానీ పార్లమెంటరీతత్వం అంతకు మించి పార్టీని పీడిస్తుంది. అది పార్టీని కేవలం ఎన్నికల పనికి పరిమితం చేస్తుంది. ఎన్నికల్లో పోటీ చేయడం ద్వారానే పార్టీ పెరుగుతుందనే భ్రమ కలిగిస్తుంది. దీనివల్ల ప్రజా ఉద్యమాలు, పోరాటాలు, రాజకీయ సైద్ధాంతిక కృషి నిర్లక్ష్యం చేయబడతాయి. ప్రజాసంఘాల్లో పార్టీ కృషి ప్రాధాన్యతను పార్లమెంటరీతత్వం నిర్లక్ష్యం చేస్తుంది. పార్లమెంటరీతత్వం అనే ధోరణి పార్లమెంటరీ, పార్లమెంటరీయేతర కార్యకలాపాల జోడింపు ప్రాధాన్యతను గుర్తించదు. కొన్ని కీలకమైన కర్తవ్యాలు, ఉదాహరణకు దళితులపై సామాజిక అణచివేత లాంటి ధోరణులకు

(మిగతా 34వ పేజీలో)

## ఈ సంచికలో...


1. పార్లమెంటరీతత్వంపై పోరాడ్డమే మల్లు స్వరాజ్యంకు నిజమైన నివాళి
పెనుమల్లి మధు......... 2

2. దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం, ప్రజలకు ఆర్థిక విముక్తి లక్ష్యం
1926 గౌహతి కాంగ్రెస్ సమావేశాల్లో సిపిఐ ప్రవేశపెట్టిన ప్రణాళిక......... 4

3. ఆటోమేషన్ ప్రభావాన్ని 'రోబో పన్ను' భర్తీ చేయగలదా? సుజోయ్ చక్రవర్తి ..... 12

4. మత మార్పిడుల సాకుతో హింసాకాండ
బి.వి.రాఘవులు ..... 14

5. మునుగోడు ఉప ఎన్నిక ఎందుకొచ్చింది?
ఎస్.వీరయ్య.... 18

6. మౌర్య సామ్రాజ్యం : ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక పరిస్థితులు
ఎం.వి.ఎస్.శర్మ...... 21

7. ఉచితాల పేరుతో సంక్షేమ పథకాలపై బిజెపి దాడి ఎ.కోటిరెడ్డి ... 24

8. ఉక్రెయిన్ యుద్ధం : తల్లకిందులవుతున్న అమెరికా అంచనాలు ఐఎన్ఎన్..... 27

9. స్వాతంత్ర్యోద్యమం - కమ్యూనిస్టులు
పోతినేని సుదర్శనం..... 32



**సంపాదకుడు:**
**ఎస్.వెంకట్రావు**

**సంపాదక వర్గం:**
**పాటూరు రామయ్య**
**బి.వి.రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్.వీరయ్య**
**తెలకపల్లి రవి**

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: **బి.వి.రాఘవులు**
సంపాదకుడు : ఎస్.వెంకట్రావు
**ఫోన్: ఎడిటర్ : 94900 99333**

**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**మేనేజర్: కె.హరికిషోర్: 94900 99422**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visit cpi(m) site at : cpim.org


# రాష్ట్రాలూ కేంద్రం

'ఇండియా అంటే భారత దేశం, రాష్ట్రాల యూనియన్' అంటూ ప్రారంభమవుతుంది మన దేశ రాజ్యాంగం. అంటే 28 రాష్ట్రాలు, ఎనిమిది కేంద్ర పాలిత ప్రాంతాల సమాహారమే భారత దేశం. ఈ రాష్ట్రాలు లేకపోతే కేంద్రం లేదు. రాష్ట్రాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందినట్లు. అందుకే కేంద్రంలో ఏ ప్రభుత్వం ఉన్నా అది దేశాభివృద్ధిని కోరుకునేదైతే రాష్ట్రాల అభివృద్ధిని కాంక్షించాలి. దానికోసం పాటు పడాలి.

కానీ ఇప్పుడు కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం సరిగ్గా దీనికి వ్యతిరేక దిశలో నడుస్తోంది. రాజ్యాంగం ఎంతో స్పష్టంగా పేర్కొన్న సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీయడం ద్వారా మోడీ ప్రభుత్వం ఈ దేశ విచ్ఛిన్నానికి ప్రమాదకరమైన బాటలు వేస్తోంది. ఒకే దేశం, ఒకే సంస్కృతి అనే ఆర్ఎస్ఎస్ నినాదం ఆధారంగా పనిచేస్తున్న మోడీ ప్రభుత్వం క్రమంగా ఒకే పన్ను, ఒకే విద్యావిధానం, ఒకే ఎన్నికలు...వగైరా నినాదాలతో రాష్ట్రాల ఉనికినే దెబ్బతీసే చర్యలకు పూనుకుంటున్నది.

ఇటీవలి కాలంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన అనేక చట్టాలు వాస్తవానికి రాష్ట్రాల పరిధిలోనివి. కానీ రాష్ట్రాలతో కనీసం సంప్రదించకుండా కేంద్రం ఈ చట్టాలు తెచ్చింది. వ్యవసాయం రాష్ట్రాల పరిధిలోని అంశం అయినా రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదించకుండా పార్లమెంటులో మూడు నల్ల వ్యవసాయ చట్టాలు చేసింది. దేశం మొత్తంగా రైతాంగం ఎదురుతిరిగి, కార్మికవర్గ సహకారంతో ఈ చట్టాలను వెనక్కు కొట్టగలిగారు. 44 కార్మిక చట్టాలను యజమానులకు అనుకూలమైన నాలుగు కోడ్‌లుగా మార్చేసింది. దానికి వ్యతిరేకంగా కార్మికవర్గం దేశ వ్యాపిత ఆందోళన చేపట్టింది. జిఎస్‌టిని రాష్ట్రాల అభిమతానికి భిన్నంగా వాటిపై రుద్దడమే కాకుండా వసూలు చేసిన పన్నులో రాష్ట్రాలకు రావలసిన వాటా ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతోంది.

నూతన విద్యా విధానం, విద్యుత్ చట్టం మొదలైన వాటిని రాష్ట్రాల అభీష్టానికి భిన్నంగా వాటిపై బలవంతంగా రుద్దుతోంది. ఇప్పుడు ఒకే దేశం, ఒకే ఎన్నికలు పేరుతో కేంద్రంలోనూ, రాష్ట్రాల్లోనూ ఒకేసారి ఎన్నికలు జరిపిస్తానంటోంది. దీని వల్ల ఎన్నికల్లో ఆయా రాష్ట్రాల ప్రత్యేక సమస్యలకు, ప్రజల ఆకాంక్షలకు ప్రాధాన్యత లేకుండా పోతుంది. దేశమంతటిని ఒకే సెంటిమెంటుతో కదిలించి ఓట్లు గుంజుకోడానికి కేంద్రంలో అధికారం చెలాయిస్తున్న బిజెపికి అవకాశం చేజిక్కించడానికే ఈ నినాదం తీసుకువచ్చాన్న దాంట్లో సందేహాలకు తావులేదు.

ఇవన్నీ ఒకెత్తు అయితే రాజకీయంగా అన్ని రాష్ట్రాలనూ తన గుప్పెట్లో పెట్టుకోడానికి మోడీ ప్రభుత్వం సిగ్గూ ఎగ్గూ లేకుండా చేస్తున్న ప్రయత్నాలు మరో ఎత్తు. ప్రతిపక్ష పార్టీల పాలనలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలను పడగొట్టి దొడ్డిదారిన రాష్ట్రాల్లో అధికారం గుంజుకునే విషయంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం నాటి కాంగ్రెస్ పార్టీకన్నా రెండాకులు ఎక్కువే చదివింది. డబ్బు, కేంద్ర ఏజెన్సీలను దుర్వినియోగ పరచడం, ప్రలోభాలు ఒకటేమిటి అన్ని రకాల అనైతిక చర్యల ద్వారా అది ఎన్నికైన రాష్ట్రాలను కూలగొట్టి తన పార్టీ ప్రభుత్వాలను ఏర్పాటు చేస్తోంది. మధ్యప్రదేశ్, గోవా, రాజస్తాన్, కర్నాటకల్లో చేసింది ఇప్పుడు ఢిల్లీ, చత్తీష్‌ఘర్‌లలో అవే ప్రయత్నాలు చేస్తోంది. తన మాట వినని రాష్ట్ర ప్రభుత్వాలపై కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పుతోంది. నయానో, భయానో రాష్ట్రాలను లొంగదీసుకోడానికి అనేక కుటిల ప్రయత్నాలు చేస్తోంది. గవర్నర్లను కేంద్ర ఏజెంట్ల స్థాయికి దిగజార్చేసింది.

కేంద్రంలో పూర్తి మెజారిటీ ఉన్నప్పటికీ నరేంద్ర మోడీ ప్రభుత్వం ఎందుకిలా చేస్తోంది. ఎందుకంటే మోడీ వెనుకనుండి నడిపిస్తున్న కార్పొరేట్ శక్తులకు దేశంలోని ఆర్థిక, రాజకీయ అధికారం అంతా ఒక్క చోట ఉంటేనే లాభం. అందుకే అవి రాష్ట్రాల స్వయంప్రతిపత్తిని అంగీకరించవు. ఇంకోవైపు బిజెపి వెనుకనున్న ఆర్ఎస్ఎస్ తన బ్రాహ్మణాధిక్య మనువాద పాలనను ఈ దేశంపై రుద్దాలనుకుంటోంది. దేశంలో వివిధ రాష్ట్రాలు తమతమత ప్రత్యేకతలు కాపాడుకుంటూ ఉండే ఆర్ఎస్ఎస్‌కు ఆ పనిచేయడం సాధ్యం కాదు. అందువల్లనే మోడీ ప్రభుత్వం సమాఖ్య స్ఫూర్తిపై కత్తికట్టింది. ఈ ధోరణులు ముదిరితే దేశ సమైక్యత విచ్ఛిన్నం అవుతుంది. ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో ప్రభుత్వాలు మోడీ ప్రభుత్వ పెత్తనంపై తిరుగుబాటు చేస్తున్నాయి. అయితే రాష్ట్రాలకు హక్కులు, వనరులు కావాలన్నది ప్రజా ఉద్యమంగా మారాలి. వామపక్ష ప్రజాతంత్ర శక్తులు ఈ ఉద్యమానికి నాయకత్వం వహించాలి.

# దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం, ప్రజలకు ఆర్థిక విముక్తి లక్ష్యం

## (1926లో గౌహతిలో జరిగిన అఖిల భారత జాతీయ కాంగ్రెస్ సమావేశాల్లో భారత కమ్యూనిస్టు పార్టీ ప్రవేశపెట్టిన ప్రణాళిక)

**(భారత దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్య కావాలన్న నినాదాన్ని జాతీయోద్యమంలో మొట్టమొదట లేవనెత్తింది. కమ్యూనిస్టులే. కాంగ్రెస్ పార్టీ డొమీనియన్ ప్రతిపత్తి కావాలనీ, చట్టసభల్లో దేశీయులకు మరింత ఎక్కువ ప్రాతినిధ్యం కావాలనీ కోరుతున్న సమయంలో 1921లో అహమ్మదాబాద్ కాంగ్రెస్‌లో దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని కమ్యూనిస్టు పార్టీ సభ్యులు తీర్మానం ప్రవేశ పెట్టారు. దానిపై చర్చ జరిగినప్పటికీ కాంగ్రెస్ అంగీకరించకపోవడంతో అది వీగిపోయింది. అయినప్పటికీ కమ్యూనిస్టులు పట్టువిడవ కుండా దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలి, ప్రజలకు ఆర్థిక విముక్తి కావాలని నినదించారు. ఈ మహత్తర లక్ష్యంతోనే స్వాతంత్రోద్యమంలో కమ్యూనిస్టులు పాల్గొన్నారు. 1926లో గౌహతిలో జరిగిన కాంగ్రెస్ సమావేశాల్లో కమ్యూనిస్టులు ప్రవేశ పెట్టిన ప్రణాళిక పూర్తి పాఠాన్ని మార్క్సిస్టు పాఠకులకు అందజేస్తున్నాం....సంపాదకుడు)**

భారత జాతీయ కాంగ్రెస్ ఈ వార్షిక మహాసభల కాలానికి జాతీయ ఉద్యమంలో చాలా నిరుత్సాహపూరిత వాతావరణం నెలకొన్నట్లు స్పష్టమౌతున్నది. 1920-21నాటి పరిస్థితితో పోల్చినపుడు యెంతో పెద్ద మార్పు కన్పిస్తున్నది. నాడు ప్రజలందరూ భారత జాతీయ కాంగ్రెస్ చుట్టూ ఉత్సాహపూరితంగా సమీకృత మయ్యేవారు. జాతీయోద్యమ పోరుకు సాహసోపేతంగా నాయకత్వం వహిస్తున్నదిగా ఆ సంస్థను చూసేవారు.

నేడు జాతీయ కాంగ్రెస్ పేరుకే మనుగడ సాగిస్తున్నది. సాగిలపడిన ఆ సంస్థను వశపరచుకునేందుకు విరుద్ధమైన పలు రాజకీయ ముఠాలు పోటీపడుతున్నాయి. జాతీయవాదం, నిజమైన స్వేచ్ఛ కోసం జరుగుతున్న సాహసోపేత పోరాటం పొంగులువారుతున్న మతోన్మాద సంద్రంలో మునిగిపోతున్నది. అల్పమైన లాంఛనాలపై గొడవలు పడుతున్న అసాధారణ లక్షణాలు దేశ రాజకీయ జీవితంలో కన్పిస్తున్నాయి. అర డజనుకు మించిన రాజకీయ కూటములు పరస్పరం దూషించుకుంటున్నాయి. భారత జాతికి తామే సిసలైన ప్రతినిధులుగా ప్రకటించుకుంటున్నాయి. కానీ జాతికి ఎదురౌతున్న ప్రాణాధార సమస్యలపై యే వొక్కరూ స్పందించరు. చట్ట సభలో ఆధిక్యతను సాధించటమే వారి ఏకైక లక్ష్యంగా మారింది.

ఈ నకిలీ పార్లమెంటరీ వ్యవస్థల దుర్బలత్వాన్ని గుర్తించినవారు కూడా వాటిలో ప్రవేశించేందుకు పిచ్చిగా ప్రయత్నిస్తున్నారు. అలాంటి శక్తి హీనమైన, ప్రాతినిధ్యంలేని చట్టసభల మార్గాన్ని గుడ్డిగా అనుసరించినంత మాత్రానే జాతి స్వాతంత్ర్య సాధనకు మార్గం లభించబోదని వారు మరచిపోతున్నారు. ఆ మహోన్నత పోరులో మహా అయితే అవి సహాయకరమైనవిగా మాత్రమే ఉపకరించగల్గుతాయి.

### చట్ట సభలు ప్రజలకు ప్రాతినిధ్యం వహించజాలవు

ప్రస్తుత చట్ట సభలను తమ అధీనంలోకి తెచ్చుకోవటమే జాతీయవాద పార్టీల ఆది, అంతపు కార్యక్రమంగా మారింది. ప్రజలకు ప్రాతినిధ్యం వహించ నందునే ఆ సభలు శక్తి హీనమైనాయి. అందుకే అవి ప్రజల చైతన్యాన్ని తగు విధంగా వ్యక్తీకరించే సాధనాలుగా ఉపకరించటం లేదు. తొలి రెండు సంవత్సరాల అనుభవం ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నది. ఆ సంస్థలను ముక్కలు చేసే లక్ష్యంతోనే స్వరాజ్య పార్టీ కౌన్సిళ్లలోకి ప్రవేశించింది. కానీ వాస్తవంగా జరిగిందేమిటి ? నమ్మక ద్రోహం, నకిలీ పార్లమెంటరీతత్వం ఆ పార్టీనే ముక్కలు చేసింది.

1919 సంస్కరణల ద్వారా ఈ చట్టసభలు స్థాపించబడ్డాయి. పరిస్థితులు పట్టపగలంత స్పష్టంగా వున్నప్పటికీ, ఆ చట్టసభల ప్రజా ప్రాతినిధ్యరహిత స్వభావంపై మరి కొంత వివరణ నివ్వటం ఉపయోగకరంగా ఉంటుంది. మన దేశపు పార్లమెంటరీ వ్యవస్థ హీనస్థితిలో ఉంది. అది మొత్తం జాతీయ ఉద్యమాన్ని నాశనంచేసింది. అందుకే ఈ సత్యాన్ని పదేపదే వుటంకించాల్సిన అవసరముంది.

నేటి బ్రిటీష్ భారత జనాభా 22.15 కోట్లు. వారిలో కేవలం 50 లక్షల మంది మాత్రమే అర్హతగల ఓటర్లు ఉన్నట్లు 'సౌత్‌బ్రొ' కమిటీ నివేదిక తెల్పుతున్నది. 1919 సంస్కరణల ఫలితంగా నాటికి మొత్తం దేశ జనాభాలో 2.2 శాతమే ఓటు హక్కు కలిగి వున్నారు. అంటే ఈ అల్ప సంఖ్యాకులకు మాత్రమే కౌన్సిల్ ప్రాతినిధ్యం వహిస్తున్నది. జనాభాలో అత్యధిక సంఖ్యాకులైన 97.8 శాతం ఓటు హక్కుకు అనర్హులైనారు. ఫలితంగా అలాంటివారు చట్టసభల ద్వారా తమ అభిప్రాయాలను వ్యక్తం చేసేందుకు అవకాశమే లేదు.

జాతీయోద్యమ కార్యక్రమము, విధానాలు ప్రధానంగా ఈ చట్టసభల సంబంధిత కార్యాచరణలకే పరిమితమౌతున్నాయి. అలాంటపుడు మన జాతీయోద్యమం చాలా సంకుచితమైన సామాజిక పునాదిపై నిర్మించబడటం లేదా? చట్ట సభల్లో ఉన్న స్థానాల ఆధారంగానే జాతీయ పార్టీలు

తమ మనుగడను ప్రకటిస్తున్నాయి. మరి అలాంటి పార్టీలు బలమైన సామ్రాజ్యవాద శక్తిని కుదిపేయగలవని వూహించగలమా? అయినప్పటికీ అత్యధిక ప్రజలకు ప్రాతినిధ్యం లేని చట్ట సభలే జాతీయ రాజకీయాలకు కేంద్రంగా మారాయి. అందుకే నేటి జాతీయ పార్టీల నాయకత్వంలోని జాతీయోద్యమం అత్యధిక ప్రజా సమూహాల నుండి విడివడి పోతున్నది. స్వాతంత్ర్య సాధన కోసం పోరాడాలన్న పట్టుదల కానీ, శక్తిగానీ దానికి లేవు. గుట్టుచప్పుడు కాకుండా సామ్రాజ్య వాదంతో రాజీపడాలన్న సాధారణ కోర్కె మాత్రమే వ్యక్తమౌతున్నది. పరస్పర నిందారోపణలు, బిగ్గరైన దేశభక్తియుత నిరసనలు ప్రస్తుత పరిస్థితిని అవసరమైన విధంగా మార్చలేవు.

**“ జాతీయోద్యమ కార్యక్రమము, విధానాలు ప్రధానంగా ఈ చట్టసభల సంబంధిత కార్యాచరణలకే పరిమితమౌతున్నాయి. అలాంటపుడు మన జాతీయోద్యమం చాలా సంకుచితమైన సామాజిక పునాదిపై నిర్మించబడటం లేదా? చట్ట సభల్లో ఉన్న స్థానాల ఆధారంగానే జాతీయ పార్టీలు తమ మనుగడను ప్రకటిస్తున్నాయి. మరి అలాంటి పార్టీలు బలమైన సామ్రాజ్యవాద శక్తిని కుదిపేయగలవని వూహించగలమా ? ”**

### జాతీయవాద పార్టీల్లో మౌలికమైన తేడాలు లేవు

కౌన్సిళ్లలో అత్యధికులకు 'ప్రాతినిధ్యం' లేకపోవటంపై జాతీయవాద విమర్శలు చాలా అరుదుగానే ఉన్నాయి. జాతీయ కాంగ్రెస్‌గాని, ఇతర పార్టీలు గానీ సార్వత్రిక ఓటు హక్కు కోసం కౌన్సిల్ లోపల గాని, వెలుపల గానీ యేవిధమైన ప్రచారాన్ని నిర్వహించటం లేదు. కౌన్సిళ్లకు పరిమిత అధికారాలను ప్రధానం చేయటానికి వ్యతిరేకంగా ఆరంభంలో కాంగ్రెస్ కొన్ని సార్లు సంస్కరించబడిన కౌన్సిళ్లను బహిష్కరించింది. అంతేగాని వారి నిరసన 'ప్రాతినిధ్య లేమి' సమస్యపై మాత్రం కాదు. చట్ట సభల్లో ప్రాతినిధ్యాన్ని జనాభాలో కేవలం 2.2 శాతానికే పరిమితం చేయటానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని జాతీయవాదం సార్వత్రికంగా డిమాండు చేస్తున్నది. ఈ డిమాండు ద్వారా వారు 'స్వయం పాలన' గురించి ఆలోచిస్తున్నట్లున్నది. బ్రిటీష్ సామ్రాజ్యవాదుల రాజకీయ ఆధిపత్యాన్ని, ఆర్థిక దోపిడిని ప్రజలు సహించి, భరించే వాతావరణం కొనసాగాలంటే, చట్ట సభల్లో ప్రాతినిధ్యం అతి కొద్దిమంది స్థానిక ఉన్నత, మధ్య తరగతి వర్గాలకే పరిమితం కావాలి. అందుకు అలాంటి ఓటు హక్కు విధానాన్ని కొనసాగించటం అనివార్యమౌతుంది.

జాతీయోద్యమాన్ని సంపూర్ణంగా కుళ్లబెట్టే ప్రక్రియకు 1925 కొండ గుర్తుగా నిలుస్తుంది. జాతీయ కాంగ్రెస్ శత్రు ముఠాలుగా విడిపోయింది. ఈ ముఠాల మధ్య మౌలిక తేడాలు అతి స్వల్పంగానైనా లేవు. బ్రిటీష్ సామ్రాజ్యం పరిధిలోనే 'స్వయం పాలన' అమలు జరగాలన్న ప్రణాళికే వారందరికీ ఆమోదయోగ్యంగా వుంది. సాంప్రదాయ వాదులైన స్వరాజ్యపార్టీ నాయకులకు, వారి ప్రత్యర్థులకు మధ్య నెలకొన్న తీవ్రమైన వైరుధ్యం పరిస్థితిని గందరగోళ పరుస్తున్నది. లాంఛనాల కోసం తాము చేస్తున్న పోరాటపు మాయా స్వభావాన్ని గమనించటంలో స్వరాజ్య పార్టీ శ్రేణులు, వారి అనుచరులు విఫలమైనారు. 'ఏ షరతుపై అధికారాన్ని కైవశం చేసుకోవాలి ?' అన్న యేకైక అంశానికే వారి మధ్య తేడాలన్నీ పరిమిత మైనాయి. ప్రస్తుత రాజ్యాంగాన్ని వ్యతిరేకిస్తూ కేవలం మూడు సంవత్సరాల క్రితమే వారు అధికార పదవులను త్యజించారు. కానీ యిపుడు అదే రాజ్యాంగానికి లోబడి అవే అధికారాలను చేపట్టేందుకు వారికి ఎలాంటి నియమమూ అడ్డు రాలేదు.

సెప్టెంబరు 15న మాలవ్యాతో చర్చలు జరిపినపుడు మోతీలాల్ నెహ్రూ యిలా ప్రకటించాడు : "కాన్పూరు మహాసభ ఆమోదించిన తీర్మానంలోని సాధారణ నియమాలకు, విధానానికి తప్పక కట్టుబడి ఉండాలి." కానీ చర్చలు విఫలమైన రెండు రోజుల తర్వాత స్వరాజ్య పార్టీ కేంద్ర పత్రిక సంపాదకీయం ఇలా ఉటంకించింది : అనంతరం జరిగిన ఎన్నికల ఫలితాలు, కాన్పూరు మహాసభ రూపొందించిన విధాన ప్రకటనను మార్చాలని దేశ ప్రజలు కోరుతున్నట్లు నిర్ద్వంద్వంగా స్పష్టం చేస్తున్నాయి. అవసరమైతే దేశ ఎన్నికల ఫలితాల వెలుగులో నూతన విధానాన్ని రూపొందించే ప్రతిపాదనలతో కాంగ్రెస్ పార్టీ నాయకత్వంతో స్వరాజ్యపార్టీ కలుస్తుంది." -( ఫార్వర్డ్, సెప్టెంబరు 10)

అలాంటపుడు ఈ రెండు పార్టీల మధ్య మౌలికమైన తేడా ఎక్కడ? జనాభాలో 2.2 శాతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఓటర్ల తరపున విధానాలను, నియమాలను మార్చేందుకు యిరు పార్టీలూ సిద్ధమైనాయి. ఓటు హక్కులేని 97.88 శాతం ప్రజల అభిప్రాయాలను అతిక్రమించి, అణుమాత్రమైన అల్ప సంఖ్యాకులకు అనుకూలంగా పనిచేసేందుకు యిరు పార్టీలూ తయారైనాయి. ఎన్నికలకు ముందు సామ్రాజ్యవాదులతో చేసుకున్న వొప్పందానికి అనుగుణంగానే నూతన విధానాలు, నియమాలను స్వతంత్రులు ప్రకటించారు. ఇదంతా సమయోచితంగానే కోరుతున్నట్లు స్వరాజ్ పార్టీ తెల్పింది. ఈ రచనచేసే నాటికి ఎన్నికల ఫలితాలు పూర్తిగా వెలువడలేదు. ఈ ఎన్నికల్లో స్వరాజ్ పార్టీ తమ పునాదిని కోల్పోతుందని ముందస్తు అంచనాలు తెల్పుతున్నాయి. తమ పాత ఎత్తుగడలను పునరావృతం చేసేందుకు వీలుగా వారికి స్వతంత్రంగా ఎక్కడా ఆధిక్యత సమకూరబోదు. అందుకే వారు కాన్పూరు మహాసభ నిర్ణయాలను తిరగదోడేందుకు గౌహతి మహాసభల దరిచేరతారు. అల్ప సంఖ్యాకులైన వున్నత, మధ్యతరగతి వర్గాల ఆదేశాల మేరకు ఒక రాజీ విధానాన్ని రూపొందించేలా జాతీయ కాంగ్రెస్‌ను పురికొల్పేందుకే వారి ప్రయత్నమంతా ఉద్దేశించబడింది.

జాతీయ కాంగ్రెస్ అధికారం గురించి నొక్కి చెప్పవలసి ఉంది. గౌహతి మహాసభలో బూర్జువా నాయకుల వోనపూరిత రాజకీయాలను విచ్ఛిన్నం చేయగల్గితేనే, అది భారత ప్రజానీకపు అత్యున్నత విభాగంగా తన స్థానాన్ని తిరిగి పొందగల్గుతుంది. విప్లవకర జాతీయవాదపు వేదిక వైపు తన శ్రేణులను సమీకరించటం ద్వారా మాత్రమే జాతీయ కాంగ్రెస్ ఆ స్థాయికి చేరటం సాధ్యమౌతుంది.

### స్వరాజ్ పార్టీలోని అంతర్గత వైరుధ్యాలు

బూర్జువా శక్తులు ఒకరి తర్వాత ఒకరు స్వరాజ్ పార్టీ నుండి బైటపడుతున్నారు. కానీ దురదృష్టవశాత్తూ యిప్పటికీ ఆ పార్టీ నాయకత్వంలోని ప్రధాన భాగమంతా బూర్జువాలే. విద్రోహ పూరితమైన సబర్మతీ వొప్పందాన్ని తిరస్కరించటం ద్వారా ఆ పార్టీని

> “ స్వరాజ్ పార్టీలోని నాయకత్వానికి, శ్రేణులకు మధ్య నెలకొన్న వైరుధ్యమే నిరంతరం దాన్ని వెంటాడుతున్న బలహీనతకు మూలం. పెట్టుబడిదారులు, భూ యాజమాన్య వర్గాల ప్రయోజనాలకు అనుగుణంగా ఆ పార్టీ ప్రణాళిక, విధానాలు నిర్దేశించబడుతున్నాయి. కానీ ఆ పార్టీ సభ్యులు, అనుచరుల్లో అత్య ధికులు సమాజంలోని యితర తరగతులకు చెందిన వారు. ”

కాపాడింది ప్రతిపక్షమైన వామపక్షమే. బెంగాల్లో ఈ విషయాన్ని స్పష్టంగా గమనించవచ్చు. అయినప్పటికీ తన సంస్థలోని బూర్జువా నాయకత్వంపై బహిరంగ తిరుగుబాటుకు ఆ పార్టీ సిద్ధంగా లేదు. పైగా తిరుగుబాటుకు అశక్తతను వ్యక్తం చేస్తున్నది. సామ్రాజ్యవాదంతో కుమ్మక్కయ్యేందుకు ప్రయత్నిస్తున్న బూర్జువాలతో ఆ పార్టీ పూర్తిగా తెగతెంపులు చేసుకోవాలి. అపుడు మాత్రమే అది ప్రజల పార్టీగా మారగలదు. జాతీయ స్వాతంత్ర పోరాటంలో నాయకుడిగా ఎదగగలదు.

స్వరాజ్ పార్టీలోని నాయకత్వానికి, శ్రేణులకు మధ్య నెలకొన్న వైరుధ్యమే నిరంతరం దాన్ని వెంటాడుతున్న బలహీనతకు మూలం. పెట్టుబడిదారులు, భూ యాజమాన్య వర్గాల ప్రయోజనాలకు అనుగుణంగా ఆ పార్టీ ప్రణాళిక, విధానాలు నిర్దేశించబడుతున్నాయి. కానీ ఆ పార్టీ సభ్యులు, అనుచరుల్లో అత్యధికులు సమాజంలోని యితర తరగతులకు చెందినవారు. తన విప్లవకర అనుచర బృందాన్ని యేమార్చేందుకు ఆ పార్టీ కొన్ని సంకేతాలను అందిస్తున్నది. కాలం గడిచేకొద్దీ ఈ విధమైన అర్ధంకాని సంజ్ఞలే బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి, దేశంలోని స్థానిక వున్నత వర్గాలకు మధ్య జరుగుతున్న హానికరమైన ఒప్పందాలకు వ్యతిరేకంగా మారతాయి. స్వరాజ్ పార్టీ విడిపోయేందుకు సిద్ధమౌతున్నది. తన పెటీ బూర్జువా అనుచరగణం నుండి అది పూర్తిగా బైటపడాలి. ఉన్నత, మధ్య తరగతి వర్గాల ఓట్లను కోల్పోయేందుకు సిద్ధంకావాలి. కేవలం పార్లమెంటరీ విజయాలపై మాత్రమే ఆధారపడి, తన మనుగడపై పందెం కాయాలనుకునే పార్టీకి రెండవ మార్గం చివరకు ప్రాణాంతకంగా మారుతుంది.

ప్రజలతో సంబంధాన్ని నెలకొల్పే క్రమానికి అనుసంధాన కర్తలుగా తోడ్పడుతున్న పెటీ బూర్జువా తరగతులు స్వరాజ్ పార్టీకి దేశవ్యాపిత ప్రాధాన్యతను సమకూర్చాయి. కానీ వారిలో అత్యధికులు ఆ పార్టీకి ఓటు వేయటం లేదు. విప్లవ పోరాటానికి నాయకత్వం వహించాలని కోరుకునే పార్టీకి ప్రజా సమూహాలతో సజీవ సంబంధాలు ప్రాణాధారమైనవి. పార్లమెంటరీ కార్యకలాపాలపై మాత్రమే ఆధారపడే పార్టీ దేశం కంటే వోటర్లకే అధిక ప్రాధాన్యతనిస్తుంది. ప్రస్తుత వోటర్ల వర్గ పొందిక, తమ ఓటు కావాలనుకునే పార్టీ యేదైనా పెట్టుబడిదారులు, భూస్వాముల ప్రయోజనాలను పరిరక్షించేందుకు అంకితం కావాలని డిమాండు చేస్తున్నది. వారి ప్రయోజనాలు, దేశ ప్రయోజనాలతో విభేదిస్తుంటే రెండవ దాన్ని మోసగిస్తుంది.

ఎన్నికలైన వెంటనే ఒక కీలకమైన సమస్య వివాదాస్పదమైన పెను తుఫానుగా విజృంభించింది. అప్పటికే స్వరాజ్ పార్టీ కేంద్ర నాయకత్వ స్థానంలోని బూర్జువా నాయకత్వం ఆ సమస్యపై స్పష్టంగా మాట్లాడవలసి వచ్చింది. తమను నమ్మకంగా అనుసరిస్తున్న దిగువ మధ్యతరగతి వర్గాన్ని వారు అకస్మాత్తుగా వదిలేస్తారా ? ప్రజలకు నమ్మక ద్రోహంచేసి బహిరంగంగా పెట్టుబడిదారులు, భూ యాజమాన్య వర్గాలకు ప్రతినిధులుగా మారి వారి పక్షాన మాట్లాడుతారా ? ఈ ప్రశ్నలకు వారు సూటిగా సమాధానం చెప్పకుండా దాటేశారు. ఒక విధమైన కుతంత్రము, లాంఛనాల పేర చీలికలు సృష్టింటం ద్వారా వారు పార్టీనే కాదు, దేశాన్ని కూడా మోసగించారు. ఓటర్ల నిర్ణయంపై పార్టీ భవిష్యత్తు ఆధారపడి వుంటుందని నొక్కి చెప్పటం ద్వారా ప్రజల సార్వభౌమత్వాన్ని వుల్లంఘించారు. వారు స్వరాజ్ పార్టీతోపాటు జాతీయ కాంగ్రెస్ పార్టీని కూడా ఓటు హక్కుగల అల్ప సంఖ్యాకుల ప్రయోజనాల కోసం ఉపయోగపడే సాధనాలుగా మార్చేసి మోసం చేశారు. అందుకు వారికి బ్రిటీష్‌వారి అండదండలు, ఆశీర్వాదాలు సంపూర్తిగా లభించాయి.

### ప్రణాళికను మార్చితీరాలి

ఒక నూతన ప్రణాళికను తయారుచేసుకుంటే తప్ప స్వరాజ్ పార్టీ ప్రాణాంతకమైన బూర్జువాల ప్రభావం నుండి తననుతాను కాపాడుకో లేదు. ఆ నూతన ప్రణాళిక ప్రజా ప్రయోజనాలను ప్రతిబింబించాలి. జాతీయ స్వాతంత్ర్య సాధనకు వుపకరించే సమరశీల ప్రజా కార్యాచరణను అందించగల్గాలి. తద్వారా ఆ ప్రణాళిక నాయకత్వాన్ని ఒక అగ్ని పరీక్షలో నిల్పుతుంది. దానితో నాయకత్వం ఆ ప్రణాళికను అమోదించాలి. తద్వారా పార్టీని తమ జేబు సంస్థగా మార్చుకుని, రహస్యంగా బూర్జువా శిబిరంలోకి చేరాలనుకుంటున్న వారు మోసపూరితంగా యేర్పరచుకున్న బ్రిడ్జిని తగులబెట్టాలి లేదా గత కాలపు తమ ఆరాధ్య నాయకుల అడుగుజాడల్లోనే పార్టీ నుండి బైటకి పోవాలి. స్వరాజ్ పార్టీ ప్రణాళిక ప్రధానంగా బూర్జువా జాతీయవాద ప్రణాళికగానే ఉంది. అక్షరాలా అది అస్పష్టంగా ఉంది. గయ మహాసభలో దాని విశాల నియమాలను రూపొందించేటపుడు చిత్తరంజన్ దాస్ (సిఆర్ దాస్) యిలా చెప్పారు : ''స్వరాజ్యం అనిర్వచనీయమైనది. అదేదో ఒక నిర్దిష్టమైన వ్యవస్థకు సంబంధించిన ప్రభుత్వంగా గందరగోళ పడరాదు. స్వరాజ్యం అంటే జాతీయ మనోభావాల సహజ వ్యక్తీకరణగా రూపొందాలి. జాతి చరిత్ర అంతటినీ అందులో పొందుపరచి తీరాలి."

ఈ ప్రకటన హాస్యాస్పదంగా ఉన్నప్పటికీ ఎంతో భావగర్భితమైనది. చిత్తరంజన్ దాస్ గనుక స్వరాజ్య నినాదం నిర్వచించబడిన సంక్లిష్ట కాలంలో వున్నట్లైతే, జాతీయోద్యమంలో అత్యుత్తమ శక్తులను అతడు తన వెంట తీసుకెళ్లగల్గేవాడు కాదు. స్వరాజ్యమనేది అనిర్వచనీయమైన అధిభౌతిక విభాగంగా గయ మహాసభలో ప్రవచించంబడింది. కానీ అందుకు పూర్తి భిన్నంగా రెండున్నర సంవత్సరాల్లోనే నిర్దిష్టమైన 'భౌతికపరమైన ప్రభుత్వ వ్యవస్థ' గురించిన అంశానికి ప్రాధాన్యత సమకూరింది. 'స్వరాజ్యం అంటే – బ్రిటీష్ సామ్రాజ్యంలోనే అధినివేశ ప్రతిపత్తి'గా ఫరీద్‌పూర్ మహాసభలో నాయకుడు నిర్వచించాడు. ఆ పార్టీ నాయకత్వ ఆరాధనకు గుర్రై మేధోపరంగా శక్తిహీనమౌతున్నది. " బ్రిటీష్ సామ్రాజ్యం పొలిమేరల్లోనే భారత్‌కు గౌరవప్రదమైన స్థానం ఎలా సాధ్యమౌతుంది? అది సహజసిద్ధమైన జాతీయ మనోభిప్రాయపు జాతీయ వ్యక్తీకరణ ఎలా అవుతుంది ?" అంటూ

నాయకులను ప్రశ్నించలేని స్థితి ఆ పార్టీలో నెలకొంది.

'అధినివేశ ప్రతిపత్తి' (డొమినియన్ స్టేటస్) అనేది జాతీయ మనోభావపు వ్యక్తీకరణ కాదు. అది జాతీయ బూర్జువాల ప్రయోజనాలకు అనుగుణమైనది. అధినివేశ ప్రతిపత్తి గురించి ఫరీద్‌పూర్ వుపన్యాసంలో సి.ఆర్.దాస్ ఇలా చెప్పారు :" అది, 1. భౌతిక ప్రయోజనాలను తెస్తుంది. 2.సంపూర్ణ రక్షణను అందిస్తుంది. 3. స్వరాజ్యానికి సంబంధించిన సకల అంశాలను సమకూర్చుతుంది."

ఎవరి భౌతిక ప్రయోజనాలను అధినివేశ ప్రతిపత్తి సమకూర్చగలదు? కేవలం భారతీయ బూర్జువాలకు మాత్రమే. సామ్రాజ్యవాదంతో చేసుకునే ఒప్పందంతో భారత్‌లో పెట్టుబడిదారీ విధాన అభివృద్ధికి మాత్రమే హామీ లభిస్తుంది. ఎంతోకొంత వున్నదాన్ని రక్షించుకోవాలనుకునే వారికి మాత్రమే దాచుకునేందుకు రక్షణ అవసరమౌతుంది. వారే పెట్టుబడిదారులు, భూ యాజమాన్య వర్గాలు. ఒక వేళ కార్మికులు, కర్షక ప్రజానీకంతో కూడిన జాతీయ విప్లవం సంభవిస్తే తమ ఆస్తులను ఆక్రమించుకుంటారని వారు భయపడుతున్నారు. శ్రామికులను దోచుకుని బతుకుతూ, అభివృద్ధి చెందుతున్న భారత సమాజంలోని వర్గాల దృష్టిలో జాతీయ స్వాతంత్ర్యమంటే తమ దోపిడీని పెంచుకునేందుకు యెల్లలులేని స్వేచ్ఛ పొందడమే. ప్రజల తిరుగుబాటుకున్న అవకాశాలను వమ్ముచేసేందుకు వారు బ్రిటీష్ సామ్రాజ్యవాదుల రక్షణ కోరుతున్నారు. అధి నివేశ ప్రతిపత్తి అర్థం యిదే. భారత బూర్జువాలకు భౌతిక ప్రయోజనాలు, దోపిడీ వర్గాలకు హక్కులు, విశేష అధికారాలు కల్పించటం – ఇవే వారి స్వరాజ్యం ప్రధాన అంశాలు. అలాంటి స్వరాజ్యాన్ని సాధించాలని స్వరాజ్ పార్టీ వ్యవస్థాపకుడు కోరుతున్నాడు.

"గౌహతిలో కాంగ్రెస్ సమావేశం నాటికి నెలకొన్న పరిస్థితి ఇది. దేశంలో ఒకవైపున 2.2 శాతం ఓటు హక్కుగల వారున్నారు. 97.8 శాతం ఓటు హక్కుకు నోచుకోక అణగారిన, దోపిడీకి గురౌతున్నవారు వేరొక వైపున ఉన్నారు. ఈ రెండు వర్గాల్లో - ఏ పక్షాన నిలవాలో ఆ పార్టీ యెంపిక చేసుకోవాలి. రెండు శాతం సంపన్నులకు లోబడి సేవలు చేస్తూనే "98 శాతానికి స్వరాజ్యం కావాలి" అంటూ గావు కేకలు పెట్టే మోస పూరిత విధానం యింకెంతో కాలం చెల్లదు."

స్వరాజ్ పార్టీ వ్యవస్థాపకునిచే గయలో దాని ప్రణాళిక రేఖామాత్రంగా రూపొందింది. అనంతరం ఫరీద్‌పూర్‌లో సవివరంగా ప్రతిపాదించబడిన ఆ ప్రణాళిక ఆ పార్టీ మనుగడలో ఉన్నంత వరకూ అమలౌతుంది. తమ ప్రణాళిక యితర జాతీయవాద పార్టీల ప్రణాళికల కంటే మౌలికంగా భిన్నమైనదని ఆ పార్టీ చెప్పు కోజాలదు. ఉన్నత వర్గాల రక్షణకు అంకితమైన యితర పార్టీల మార్గాన్నే స్వరాజ్ పార్టీ కూడా తప్పక అనుసరించాలి. అధినివేశ ప్రతిపత్తి కావాలని కేవలం విజ్ఞప్తులు చేయటం, కేకలేయటంతోటే సామ్రాజ్యవాదం దాన్ని మంజూరు చేయదు. దానికొక సుదీర్ఘమైన శిక్షణా కాలం ఉంటుంది. ఆ కాలంలో సంస్కరణల అమలుకు సామ్రాజ్యవాదులకు సహకరిస్తూ సేవచేయాలి. మరికొన్ని దఫాలు రాజకీయ, ఆర్థిక రాయితీలు పొందే అర్హతను సాధించేందుకు అవసరమైన శిక్షణా కాలాన్ని పూర్తిచేసేందుకు జాతీయవాద బూర్జువాలు తహతహలాడుతున్నారు.

గౌహతిలో కాంగ్రెస్ సమావేశం నాటికి నెలకొన్న పరిస్థితి ఇది. దేశంలో ఒకవైపున 2.2 శాతం ఓటు హక్కుగలవారున్నారు. 97.8 శాతం ఓటు హక్కుకు నోచుకోక అణగారిన, దోపిడీకి గురౌతున్నవారు వేరొక వైపున ఉన్నారు. ఈ రెండు వర్గాల్లో – ఏ పక్షాన నిలవాలో ఆ పార్టీ యెంపిక చేసుకోవాలి. రెండు శాతం సంపన్నులకు లోబడి సేవలు చేస్తూనే; " 98 శాతానికి స్వరాజ్యం కావాలి'' అంటూ గావు కేకలు పెట్టే మోసపూరిత విధానం యింకెంతో కాలం చెల్లదు. జాతీయోద్యమం శిధిలం కాకుండా, జాతీయ కాంగ్రెస్ పేరు ప్రతిష్టలు మంటగలిసి పోకుండా వుండాలంటే పై విధానానికి స్వస్తి చెప్పాలి.

'ఫార్వర్డ్' పత్రికలో పైన ఉటంకించిన అభిప్రాయానికి అనుగుణంగానే స్వరాజ్ పార్టీ నాయకులు వక్రీకరణలతో పలు ప్రకటనలు చేశారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే కాంగ్రెస్‌పై వత్తిడిచేసి విధానపరమైన మార్పులను సాధించాలని వారు నిర్ణయించారు. అందుకోసమే వారి ప్రకటనలు వుద్దేశించ బడినాయి. కౌన్సిల్‌లో తమ బలాన్ని పెంచుకోవాలన్న వారి కోర్కె నెరవేరేది కాదు. కనీసం ప్రస్తుత బలం నిలబడినా వారికి అంగీకారమే. గత రెండు సంవత్సరాల్లో యెదురైన అపజయాలు పునరావృతం కారాదు. ఎన్నికల్లో అపజయం యెదురైతే వారు తమ విధానాన్ని మార్చుకుంటారు. విచ్ఛిన్నకరమైన తమ లొంగుబాటు, రాజీ విధానాల పట్ల కాంగ్రెస్ విధించిన ఆంక్షలను ఎత్తేయాలని వారు కోరుతున్నారు.

ఒక పద్ధతిని అవలంబించటం ద్వారా మాత్రమే కాంగ్రెస్ తనకుతాను రక్షించుకోగల్గుతుంది. అల్ప సంఖ్యాకులైన సంపన్న వర్గాల కోసం జాతీయ ప్రయోజనాలను కాలదన్నే ప్రణాళికను, విధానాలను కాంగ్రెస్ తిరస్కరించాలి. ముందుగా జాతీయ స్వాతంత్ర్య ప్రజాస్వామ్య ప్రణాళికను ఆమోదించాలి. బూర్జువా జాతీయవాదపు విచ్ఛిన్నకర విధానాలను విసర్జించాలి. నకిలీ పార్లమెంటరీతత్వం స్థానంలో సమరశీలమైన కార్యాచరణను చేపట్టాలి. లొంగుబాటు, రాజీ విధానాలను వదిలేయాలి. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సాహసోపేతంగా పోరాడేందుకు అనుకూలమైన విధానాలను అనుసరించాలి. నమ్మకద్రోహులైన బూర్జువా నాయకత్వం నుండి కాంగ్రెస్ విముక్తికావాలి. స్ఫూర్తివంతమైన గణతంత్ర విధానాల ప్రభావంలోకి ఆ పార్టీని రప్పించాలి.

### మత సంఘర్షణలు

గత సంవత్సరాల్లో దేశంలో విధ్వంసాలను సృష్టిస్తున్న మత సంఘర్షణలను నివారించాలి. ప్రజల పక్షాన పనిచేసే పార్టీ మాత్రమే దానికి పరిష్కారం చూపగల్గుతుంది. ఇక్కడ కూడా ప్రజల పార్టీ ఒక పరిష్కారాన్ని కనుగొంటుంది. ఉన్నత వర్గాలు తమ ప్రత్యేక హక్కులు, సౌకర్యాల కోసం పోరాడుతున్నారు. కానీ హిందూ, ముస్లిం రెండు సామాజిక తరగతుల ప్రజానీకానికి మధ్య ఒక ముఖ్యమైన అంశం ఉమ్మడిగా ఉంది. వారిరువురూ ఒకే ఫ్యాక్టరీలో చెమటోడుస్తున్నారు. ఒకే భూమిలో పక్క పక్కనే శ్రమిస్తున్నారు. భూస్వామి, వడ్డీ వ్యాపారి, సామ్రాజ్యవాదుల ఏజంట్లచే సమానంగా దోచుకోబడుతున్నారు. ముస్లిం కార్మికులకు అదే మతస్థుడైన యజమాని అదనంగా చెల్లించేదేమీ లేదు. ఒక హిందూ భూస్వామి ముస్లిం కౌలు రైతు కంటే తన

**“ భారత దేశంలో హిందూ, ముస్లింల మధ్య నెలకొన్న పరస్పర అపనమ్మకానికి ఒక చారిత్రక నేపథ్యముంది. అందుకే మతోన్మాద సమస్యను జాతీయ మైనారిటీల సమస్యగానే పరిగణించాలి. జాతీయ మైనారిటీల రక్షణ అంశం జాతీయ వేదికలో ఒక ముఖ్యమైన భాగంగా ఉంటుంది. జాతీయో ద్యమం అలాంటి రక్షణకు హామీ యివ్వకుంటే, దాన్ని అందించే అవకాశాన్ని సామ్రాజ్యవాదం వినియోగించుకుంటుంది. తద్వారా మన జాతి గుండెల్లో నేరుగా గునపాలు దించుతుంది. ”**

మతస్థుడైన కౌలు రైతు నుండి తక్కువ కౌలు తీసుకోవటం లేదు.

దోపిడీకి గురౌతున్న దిగువ స్థాయి ఉద్యోగులు, చిరువ్యాపారులు, చేతివృత్తిదారులు వగైరా మధ్యతరగతి వర్గాలకు కూడా ఇదే నియమం వర్తిస్తుంది. అందరికీ వర్తించే సాధారణ దోపిడీ, రెండు సామాజిక తరగతులనూ కలిపి ముడివేస్తున్నది. అందుకే 98శాతం ప్రజలంతా మత సంఘర్షణల్లో పాల్గొనేందుకు అవకాశం లేదు. తమ ఆర్థిక ప్రయోజనాలపైనే చైతన్యవంతులయ్యేందుకు వారికి సహకరించాలి. తమ ఉమ్మడి శత్రువుకు, దోపిడీ శక్తులకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడేలా వారిని నడపాలి. మత సంఘర్షలను రెచ్చగొట్టే మోసపూరిత విధానాలు గురించి పునాది వర్గాలను తట్టిలేపాలి. ఈ పనిని రాత్రికిరాత్రే పూర్తిచేయలేమన్నది నిజం. కానీ జాతీయోద్యమ మూలాలను తినేసే మతోన్మాద కేన్సర్‌కు మరో నివారణా చర్య లేనేలేదు.

జాతీయోద్యమం కుప్పకూలటం మత సంఘర్షణలు చెలరేగేందుకు ప్రేరణనిచ్చింది. సమరశీల ప్రజా కార్యాచరణ ప్రణాళిక ఆధారంగా పునర్నిర్మాణమైన జాతీయోద్యమం మాత్రమే మత ఘర్షణలకు అడ్డుకట్ట వేయగలదు. సహాయ నిరాకరణ, ఖిలాఫత్ ఉద్యమాలు ప్రజల రాజకీయ చైతన్యాన్ని మసకబార్చి మతోన్మాదాన్ని వేగవంతం చేశాయి. తీవ్రమైన ఈ లోపాన్ని సరిచేసేందుకు జాతీయోద్యమాన్ని దృఢమైన లౌకిక పునాదిపైన ప్రతిష్ఠించాలి. తక్షణ ఆర్థిక కోర్కెల నినాదాలతో జాతీయవాద పతాకం వెనుక ప్రజలను సమీకరించాలి. భూమిపై హక్కు, భూమి అద్దె, వినిమయ చార్జీలు, ధరలు, వేతనాలు, పని పరిస్థితులు, ప్రాథమిక విద్య వంటివే ప్రధాన ఆందోళనాంశాలు కావాలి. నిత్య జీవనానికి కీలకమైన యిలాంటి అంశాలన్నింటా ప్రజల్లో రేకెత్తే ఆసక్తిని చాలా సులభంగా గుర్తించవచ్చు. ఈ దిశలో జరిగే ఆందోళనలతో మతోన్మాద వుద్రిక్తతలకు అడ్డుకట్ట వేయగలం. దానితోపాటు జాతీయోద్యమానికి దృఢమైన పునాదిని నిర్మించేందుకు భద్రమైన హామీనిస్తాయి.

ఏది యేమైనా ప్రజాస్వామిక నియమాలు జాతీయ మైనారిటీల ప్రయోజనాలకు వ్యతిరేకంగా పనిచేయటం లేదు. భారత దేశంలో హిందూ, ముస్లింల మధ్య నెలకొన్న పరస్పర అపనమ్మకానికి ఒక చారిత్రక నేపథ్యముంది. అందుకే మతోన్మాద సమస్యను జాతీయ మైనారిటీల సమస్యగానే పరిగణించాలి. జాతీయ మైనారిటీల రక్షణ అంశం జాతీయ వేదికలో ఒక ముఖ్యమైన భాగంగా ఉంటుంది. జాతీయోద్యమం అలాంటి రక్షణకు హామీ యివ్వకుంటే, దాన్ని అందించే అవకాశాన్ని సామ్రాజ్యవాదం వినియోగించుకుంటుంది. తద్వారా మన జాతి గుండెల్లో నేరుగా గునపాలు దించుతుంది.

పలువురు గుర్తింపు గల హిందూ జాతీయవాద నాయకుల ప్రకటనలు, ప్రవర్తన ముస్లింలలో అనుమానాలు రేకెత్తేందుకు కారణాలుగా ఉన్నాయి. వేరొక వైపు కొందరు ముస్లిం నాయకులు ప్రదర్శిస్తున్న 'సరిహద్దుకు ఆవలి దేశభక్తి' హిందూ దురహంకారుల విష ప్రచారానికి ఊతమిస్తున్నది. ఇరు వైపులా నెలకొన్న అవాంఛనీయ ధోరణులను అరికట్టాలి. ఆర్థిక ప్రయోజనాల సాధన కోసం ప్రజలను సమీకరిచంటం ద్వారా మాత్రమే మతోన్మాదానికి వ్యతిరేకంగా గట్టి హామీ సమకూరుతుంది. ఊహాజనితమైన, తరచూ కృత్రిమంగా సృష్టించబడుతున్న మతోన్మాదంతో శ్రామికవర్గ శ్రేణుల్లో లోతైన విభజన ఏర్పడుతున్నది.

**జాతీయ ప్రయోజనము, వర్గ ప్రయోజనము**

మత ఘర్షణలు పదే పదే ప్రకోపించ టంతో జాతీయవాద ఉద్యమానికి అపార నష్టం కల్గుతున్నది. జాతీయోద్యమం నాయకుల మధ్య తమతమ వర్గ ప్రయోజనాల కోసం జరుగుతున్న వివాదాలే ఆ వుద్యమం కుళ్లిపోవటాని ప్రధాన కారణం. ఇతర పెట్టుబడిదారీ సమాజాల వలే భారతీయ సమాజం వర్గాలపరంగా చీలిపోయింది.

బ్రిటీష్ సామ్రాజ్యవాదంతో భారతీయ సమాజంలోని విభిన్న వర్గాల సంబంధాలు వొకేలా లేవు. విదేశీ శక్తి దేశాన్ని అణచేసింది. దోచేసింది. ఆ అణచివేత ప్రభావం దేశ ప్రజానీకంపై సమానంగా పడలేదు. ఆ దోపిడీ లక్ష్యం మొత్తం ప్రజానీకమే. కానీ తమ శ్రమశక్తితో సర్వ సంపదలనూ ఉత్పత్తిచేస్తున్న వర్గాలపైన మాత్రమే దోపిడీ కేంద్రీకరిస్తున్నది. దేశ ప్రజానీకంలో కార్మికులు, కర్షకులు 90 శాతంగా ఉన్నారు. భారతీయ సమాజంలోని ఉన్నత వర్గాలకు, సామ్రాజ్యవాదులకు మధ్య కేవలం దోచుకోవటం వద్ద మాత్రమే వైరం ఉన్నది. స్థానిక భూస్వాములు, పెట్టుబడిదారులు కూడా ఉత్పాదక ప్రజానీకాన్ని ఫణంగా పెట్టి జీవిస్తున్నారు. కానీ వారికి శ్రామిక వర్గాలను దోచుకునే శక్తిని పెంచుకునేందుకు వుపకరించే 'షరతులు లేని ఆర్థిక అభివృద్ధి'ని సామ్రాజ్యవాదుల గుత్తేదారు విధానం అనుమతించటం లేదు. భారతీయ కార్మికులు, కర్షకుల వుత్పత్తుల విలువలో సింహ భాగం సామ్రాజ్యవాదుల జేబుల్లోకి పోతున్నది. పెద్ద మొత్తంగా లేని 'మధ్యవర్తి వాటా'ను పొందేందుకు మాత్రమే భారత బూర్జువా వర్గాలను అనుమతిస్తున్నారు. కాలగమనంలో దోపిడీలో ఈ స్వల్ప భాగంతో భారత బూర్జువా వర్గాలు అసంతృప్తికి గురౌతారు. వారు మొదట భారత శ్రామిక శక్తిలో నిరవధికంగా పెరిగే వాటాను కోరుతారు. అంతిమంగా మొత్తం వనరులపై తమకే హక్కు కావాలంటారు. భారత బూర్జువా వర్గం దేశంపై గుత్తాధిపత్యం తమకే దక్కాలని ఆశపడుతున్నది. కానీ సామ్రాజ్యవాదపు గుత్తాధిపత్యాన్ని సవాలు చేయకుండా వారి ఆకాంక్షలు నెరవేరబోవు. వారు తమంతట తాముగా ఆ పని చేయలేరు. ప్రజలందరి విప్లవ కార్యాచరణ ద్వారా మినహా విదేశీ ఆధిపత్యం నుండి భారత్ విముక్తి కాలేదు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకమైన ఆ ప్రజా తిరుగుబాటు జాతీయ బూర్జువాల విజ్ఞాపనలతో ఆవిర్భవించదు. అందుకు స్వీయ కారణాలున్నాయి. దోపిడీకి వ్యతిరేకంగా విస్తారమైన ప్రజారాసులు తిరుగుబాటు బావుటాను ఎగరేస్తాయి. ఆ ఆయుధం మాత్రమే దేశంపై సామ్రాజ్యవాదుల పట్టును

చేధించగల్గుతుంది. దేశంపై ఏకఛత్రాధిపత్యం నెరపాలని కోరుతున్న జాతీయ బూర్జువాలు ఆ శక్తివంతమైన ఆయుధాన్ని ఉపయోగించే సాహసం చేయలేకున్నారు. తమ వర్గ ప్రయోజనాల కోసం, దేశ ప్రయోజనాలను అంటే, 98 శాతం ప్రజల ప్రయోజనాలను ఫణంగా పెడుతున్నారు. దేశంపై సంపూర్ణాధిపత్యం సాధించటంలో విజయం సాధించాలన్న వారి ప్రయత్నాలు దేశాన్ని ప్రమాదపుటంచుల్లోకి నెట్టే అవకాశం ఉంది. భారత ప్రజానీకాన్ని ఉమ్మడిగా దోచుకునేందుకు వీలుగా జాతీయవాద బూర్జువాలు సామ్రాజ్యవాదంతో ఒక అవగాహనకు రావచ్చు.

సామ్రాజ్యవాదులు అలాంటి వొప్పందానికి యెందుకొస్తారు? అందుకు పలు కారణాలున్నాయి. ఒకటి. ప్రపంచంలో నెలకొన్న సార్వత్రిక పెట్టుబడిదారీ సంక్షోభంతో సామ్రాజ్యవాదపు పునాది బలహీనపడింది. అది ఎంతగా బలహీనపడిందంటే తన సనాతన సాంప్రదాయ విధానమైన వలసవాదాన్ని పున:సమీక్షించుకోక తప్పని పరిస్థితి యేర్పడింది. రెండు. జపాన్, అమెరికా, జర్మనీ తదితరుల దాడికి భారత మార్కెట్లు గురయ్యాయి. భారత్‌లో చౌక శ్రమ ద్వారా తయారౌతున్న సరకులతో మాత్రమే ఈ చొరబాటుదారులతో పోటీపడగల్గుతారు. అందుకే సామ్రాజ్యవాదుల పెట్టుబడితో భారత్‌ను పారిశ్రామికవంతం చేసే విధానాన్ని బ్రిటన్ చేపట్టింది. మూడు. బ్రిటన్‌లో 'పోగుబడుతున్న పెట్టుబడి' (ఎక్యుములేషన్ ఆఫ్ క్యాపిటల్) తగ్గిపోతున్నది. అందుకే భారత్‌ను పారిశ్రామికవంతం చేయాలన్న పథకం అమలుకు అవసరమైన పెట్టుబడిని బ్రిటన్ సమకూర్చ లేకపోతున్నది. కాబట్టి భారతీయ పెట్టుబడిని రంగంలోకి తేక తప్పని పరిస్థితి వారికి యేర్పడింది. నాలుగు. మొదటి ప్రపంచ యుద్ధానంతరం జాతీయోద్యమంలో ప్రజా భాగస్వామ్యం క్రమంగా పెరుగుతున్నది. ఆ వత్తిడిని తట్టుకునేందుకు స్థానిక విశాల ప్రజా శ్రేణులను తమ వైపు తిప్పుకోవలసిన అవసరం సామ్రాజ్యవాదులకు వచ్చింది.

ఒక విదేశీ శక్తి కొన్ని స్థానిక శక్తుల అండదండలు లేకుండా పరాయి దేశాన్ని దీర్ఘకాలం పాటు పాలించ లేదు. ఏ ప్రభుత్వమైనా స్థిరంగా వుండాలంటే దానికి ఒక సామాజిక పునాది సమకూరాలి. మొదటి ప్రపంచ యుద్ధం వరకూ భారత్‌లోని బ్రిటీష్ ప్రభుత్వానికి రెండు సామాజిక అంశాలు అండగా నిలిచాయి. అవి భూ యజమాన్య వర్గము, రైతాంగము. అవి రెండూ కలసి మొత్తం ప్రజానీకంలో అత్యధికంగా ఉంటాయి. ఆ విధంగా సామ్రాజ్యవాదం నికరమైన సామాజిక పునాదిని కల్గివుండేది. కానీ ఈ రెండు సామాజిక శక్తులూ ఒకే పద్ధతిలో బ్రిటీష్ ప్రభుత్వాన్ని బలపరచ లేదు. భూ యాజమాన్య వర్గం ఒక సానుకూలమైన, చైతన్యపూరిత మద్దతును సమకూర్చింది. రైతాంగం తన వుదాసీనమైన విశ్వసనీయతకు అనుగుణంగా, చైతన్యరహితమైన మద్దతును అందించింది. యుద్ధం తర్వాత పరిస్థితి మారింది. రైతాంగపు వుదాసీన విశ్వసనీయత చెదిరింది. దాని స్థానంలో కుతకుత ఉడుకుతున్న తిరుగుబాటు చోటుచేసుకుంది. ఆ ధోరణి తరచుగా వ్యక్తమౌతున్నది. అందువల్ల ఇపుడు సామ్రాజ్యవాదపు వునాది తీవ్రంగా కదిలిపోతున్నది. ఆ పునాదిని ప్రభావితం చేసేందుకు వారు ఒక నూతన మిత్రుణ్ణి తోడుచేసుకోవాలి. ఆ నూతన మిత్రుడే జాతీయవాద బూర్జువా( బ్యాంకర్లు, వ్యాపారులు, ఉత్పత్తిదారులు, ఉన్నతస్థాయి అధికారులు, ఆ వర్గాలతో సన్నిహిత సంబంధాలున్న వృత్తిదారులు) వర్గం. యుద్ధానంతర సంవత్సరాల్లో జాతీయోద్యమం విప్లవకర దిశగా సాగింది. జాతీయవాద బూర్జువాలు భావిసూచకమైన అనేక అవకాశాలను వమ్ముచేశారు. వారు సురక్షితమైన మార్గంలో ప్రయాణించాలని నిర్ణయించుకున్నారు. అందుకోసం భారత ప్రజానీకాన్ని దోపిడీచేయటంలో సామ్రాజ్యవాదానికి జూనియర్ భాగస్వామిగా ఉండటానికి అంగీకరించారు.

బూర్జువాల ఫిరాయింపు జాతీయోద్యమం పై ప్రభావాన్ని చూపింది. రాజీలు, లొంగుబాట్లే వారి విధానంగా మారాయి. 1922 నుండి ప్రజలు చేస్తున్న త్యాగాలను తమ వర్గ ప్రయోజనాల సాధనకు మెట్లుగా మార్చుకో సాగారు. నూతన అసెంబ్లీ, కౌన్సిల్ సమావేశాలతో ఆ మార్పు చివరి మెట్టుకు చేరుకుంటుంది. అది యే రూపం తీసుకుంటుందనేది అంత ముఖ్యం కాదు. ఇప్పటికీ బ్రిటీష్ సార్వభౌమత్వం పట్ల వారి వ్యతిరేకత బూటకంగానే సాగుతున్నది. బూర్జువాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీలు సామ్రాజ్యవాదాన్ని ప్రతిఘటించటాన్ని వదిలేస్తాయి. అవి బ్రిటీష్ ప్రభుత్వానికి గౌరవప్రదమైన లేదా బాధ్యతాయుతమైన సహకారాన్ని అందిస్తాయి

### ఏం చేయాలి?

సామ్రాజ్యవాదానికి, స్థానిక బూర్జువా వర్గానికి మధ్య వైరం సయోధ్యగా మారటంతోనే జాతీయ విప్లవ పునాది లక్ష్యం తుడిచిపెట్టు కుపోదు. భారత ప్రజానీకానికి స్వాతంత్ర్యం ఆవశ్యకతను జాతీయవాద బూర్జువాల పాక్షిక ప్రయోజనాలు నిర్ణయించలేవు. సామ్రాజ్యవాదము, స్థానిక బూర్జువాల మధ్య కుదిరే వొప్పందం రాజకీయ ఆధిపత్యమూ, ఆర్థిక దోపిడీల నుండి భారత ప్రజానీకాన్ని విముక్తి చేయలేవు. మన జనాభాలో 98 శాతానికి ఎలాంటి రాజకీయ హక్కులూ లేవు. తమ వాటా తగ్గిపోయే వోతాదులో స్థానిక పెట్టుబడిదారులకు సామ్రాజ్యవాదులు ఆర్థిక రాయితీలు యివ్వటం లేదు. ఇవ్వబోరు. స్థానిక పెట్టుబడిదారులు, సామ్రాజ్యవాదుల కోసం చేస్తున్న వుత్పత్తికి మించి, తమ పెట్టుబడికి ఎక్కువ విలువను అందించేలా వుత్పత్తిని పెంచాలని శ్రామికులపై వత్తిడి చేస్తారు. తమ దోపిడీని పెంచుతారు. ఇలాంటి పరిస్థితుల్లో జాతీయ స్వాతంత్ర్యం కోసం పోరాటాన్ని కొనసాగించి తీరాలి. ఆ ఉద్యమం ప్రజా ఉద్యమంగా మారాలి. అత్యధిక ప్రజానీకపు ప్రయోజనాలను ప్రతిబింబించే ప్రణాళికతో అది సాగాలి. ఆ ప్రణాళిక అన్ని రకాల అస్పష్టతలు, ద్వంద్వార్థాల ధోరణి నుండి బైటపడాలి. స్వరాజ్యవాదుల ప్రణాళిక ఆ కోవలోనే ఉంది.

ప్రత్యేకంగా వ్యవసాయ సమస్యపై

**“ సామ్రాజ్యవాదానికి, స్థానిక బూర్జువా వర్గానికి మధ్య వైరం సయోధ్యగా మారటంతోనే జాతీయ విప్లవ పునాది లక్ష్యం తుడిచిపెట్టు కుపోదు. భారత ప్రజానీకానికి స్వాతంత్ర్యం ఆవశ్యకతను జాతీయవాద బూర్జువాల పాక్షిక ప్రయోజనాలు నిర్ణయించలేవు. సామ్రాజ్యవాదము, స్థానిక బూర్జువాల మధ్య కుదిరే వొప్పందం రాజకీయ ఆధిపత్యమూ, ఆర్థిక దోపిడీల నుండి భారత ప్రజానీకాన్ని విముక్తి చేయలేవు. ”**

**❝ ప్రజలకు సంపూర్ణ స్వేచ్ఛ ఉండాలి. దాని కోసం పోరాడేందుకు ఒక ప్రజల పార్టీ ఉండాలి. అపుడు జాతీయ స్వాతంత్ర్యమనేది పెద్ద సమస్య కాదు. ప్రజలు వర్తమాన పరిస్థితుల్లో ఆర్థిక, రాజకీయ హక్కులను కోల్పోయారు. ఆ హక్కులను సాధించలేని జాతీయ స్వాతంత్ర్య పోరాటానికి విలువ లేదు. జాతీయ స్వాతంత్ర్యానికి నిర్దిష్ట రూప కల్పన చేయటమంటే, ఒక గణతంత్ర రాజ్యాన్ని యేర్పరచటమే. అలాంటి రాజ్యం అభివృద్ధిచెందిన ప్రజాస్వామిక సూత్రాలపై ఆధారపడి నడవాలి. ❞**

జాతీయోద్యమ వైఖరి స్పష్టంగా ఉండాలి. జనాభాలో కర్షకుల సంఖ్య 70 శాతానికి పైబడి వుంది. వర్తమాన భారతీయ సమాజంలో యిదొక ముఖ్యమైన ఆర్థికాంశము. జాతీయ విముక్తి వుద్యమంలో అదొక నిర్ణయాత్మక పాత్రను పోషించగలదు. కర్షక వర్గం కోసం జరిపే పోరాటాన్ని జాతీయోద్యమం ఒక ప్రధాన కర్తవ్యంగా స్వీకరించాలి. సామ్రాజ్యవాదం కర్షకుల విశ్వాసాన్ని తిరిగి పొందేందుకు నేర్పుగా ప్రయత్నిస్తున్నది. గత సంవత్సరాల్లో అనేక ప్రాంతాల్లో కౌలుదారీ సంస్కరణ చట్టాలను అమలుచేయాలని భూ యాజమాన్య వర్గంపై వత్తిడిచేసింది. 1919–21లో సంభవించిన తీవ్రమైన వ్యవసాయ కల్లోలాలతో ప్రారంభమైన ఆందోళనకరమైన పరిస్థితులను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు సామ్రాజ్యవాదులు ప్రయత్నిస్తున్నారు. కర్షకుల విశ్వాసం తిరిగి పొందేందుకు ప్రభుత్వం తీసుకున్న తదుపరి చర్య వ్యవసాయంపై రాయల్ కమీషన్ నియామకం. ఇలాంటి చర్యల వుద్దేశ్యం రైతాంగాన్ని మోసగించటానికే తప్ప వారిని ఆదుకునేందుకు కాదని చెప్పనవసరం లేదు. భారతదేశం నుండి సామ్రాజ్యవాదులు పొందే లాభంలో రైతాంగాన్ని అమానుషంగా దోపిడీచేసి పోగేసుకున్న మొత్తమే ప్రధానంగా ఉంది. కర్షకుల విశ్వాసం పొందేందుకు సామ్రాజ్యవాదులు చేస్తున్న మోసపూరితమైన కుట్రలను విఫలం చేయాలి. అందుకు జాతీయోద్యమం యికపై సమరశీలమైన వ్యవసాయ ప్రణాళికతో ముందుకు రావాలి. తద్వారా ప్రభుత్వ ప్రతిపాదిత సంస్కరణల గుట్టును రట్టుచేయాలి.

1923 యెన్నికల వేళ స్వరాజ్ పార్టీ విడుదలచేసిన ప్రణాళికలో ఇలా పేర్కొంది : “కౌలుదారులకు న్యాయం చేసేందుకే పార్టీ కట్టుబడివున్నదనేది నిజం. కానీ తద్వారా భూస్వాములకు అన్యాయం జరిగితే, ఆ న్యాయం నాణ్యత చాలా బలహీన పడుతుంది.”

కర్షక ప్రజానీకపు చురుకైన మద్దతు పొందాలంటే పైన ఉటంకించిన వినాశకరమైన అంశం నుండి జాతీయోద్యమం విముక్తి కావాలి. భూ యాజమాన్య పెద్దమనుషుల ఓట్లు కోసం ఆరాటపడే పార్టీలకు అలాంటి ప్రణాళిక అవసరమౌతుంది. కానీ స్వాతంత్ర్యం కోసం జరిగే పోరాటంలో ప్రజారాసులకు నాయకత్వం వహించాలని కోరుకునే పార్టీకి అలాంటి ప్రణాళిక అపారమైన హానిచేస్తుంది. భూ యజమానుల గౌరవప్రదమైన స్థానాన్ని కదపకూడదన్న భావన రైతాంగానికి తీవ్రమైన అన్యాయం చేస్తుంది. భూ యజమానుల వర్గమనేది రైతాంగం రక్తం పీల్చే సామాజిక పరాన్నభుక్కు వంటిది. దాదాపు సగానికి పైగా దేశంలో నేడు భూస్వాములే ప్రభుత్వంగా ఉన్నారు. న్యాయ ప్రవర్తనా నియమావళి అక్కడ కూడా వర్తించాలి. కర్షకులకు సంబంధించి స్వరాజ్యవాదుల ప్రణాళిక పరాన్నభుక్కులైన భూస్వాములను కాపాడుతుంది. అంతేగాక సామ్రాజ్యవాదులకు యెల్లలులేని ఆశాపూరిత జీవితాన్ని అందిస్తుంది. జాతీయోద్యమపు వ్యవసాయ ప్రణాళిక రైతాంగపు ప్రయోజనాలను కాపాడాలి. రైతాంగాన్ని రాక్షసంగా దోచుకునే అన్ని రకాల స్వదేశీ, విదేశీ యేజన్సీలకు వ్యతిరేకంగా ఆ ప్రణాళికను యెక్కుపెట్టాలి.

**జాతీయోద్యమ ప్రణాళిక :**

ఒక్క ప్రజల పార్టీ నాయకత్వంలో మాత్రమే, జాతీయ స్వాతంత్ర్యోద్యమం విజయం సాధిస్తుంది. స్పష్టంగా నిర్వచించబడిన అలాంటి ప్రణాళికను అనుసరించి ఆ పార్టీ పనిచేయాలి. లేకుంటే జాతీయోద్యమం చుక్కాని లేని నావలా గిలగిలా కొట్టుకుంటుంది. జాతీయోద్యమ లక్ష్యం యేమిటో అనేక సంవత్సరాలపాటు నాయకత్వం సూటిగా దేశ ప్రజలకు తేల్చి చెప్పలేదు. స్వరాజ్యమంటే ‘సర్వస్వం’ అంటూ నిర్వచించారు. కానీ జాతీయ స్వాతంత్ర్యమంటే యేమిటి ? జాతీయోద్యమం లక్ష్యం దేశ స్వాతంత్ర్యాన్ని సాధించటం కాకుంటే, అలాంటి వుద్యమానికి అర్థమేలేదు. జాతీయ స్వాతంత్ర్యం – దానికదే చాలా స్పష్టమైన వ్యక్తీకరణ. దానికి యేవిధమైన న్యాయపరమైన, రాజ్యాంగపరమైన వ్యాఖ్యానమూ అవసరం లేదు. అంటే తమ స్వంత ప్రభుత్వాన్ని యేర్పాటు చేసుకునేందుకు, తన స్వీయ రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక తదితర అంశాలను నిర్వహించుకునేందుకు ప్రజలకు స్వేచ్ఛ వుంటుందని దాని అర్థం. జాతీయవాద ప్రణాళికలోని ఈ ప్రాథమికమైన అంశాన్ని యింత వరకూ స్పష్టంగానూ, సమగ్రంగానూ దేశం ముందుంచలేదు. జాతీయోద్యమాన్ని పునర్నిర్మించే క్రమంలో మొదటి చర్యగా ఈ కర్తవ్యాన్ని చేపట్టాలి. జాతీయవాదులు నాయకత్వ స్థానాలను చేపట్టేందుకున్న షరతులపై వివాదాలు రేకెత్తితే ప్రధాన సమస్య గందరగోళంలో పడుతుంది. నేడు మనుగడలోని అన్ని జాతీయవాద పార్టీలు ‘అధినివేశ ప్రతిపత్తి’ ప్రణాళికకు కట్టుబడి ఉన్నాయి. ఆ పార్టీలు ఇప్పటి వరకూ దాన్ని కూడా అత్యవసరమైన అంశంగా డిమాండు చేయలేదు. మెజారిటీ ప్రజలకు ప్రాతినిధ్యంలేని వర్తమాన చట్టసభ అత్యంత సమరశీలమైన శక్తులను శాంతింపచేసే బాధ్యతను చేపట్టి ఉండవచ్చు. కానీ అది జాతీయ స్వాతంత్ర్యానికి ఉద్దేశించిన పోరాటం కాదు. అదొక నిరర్థకమైన చర్య. అలాచేయటం అంటే దేశాన్ని స్పష్టంగా మోసం చేయటమే.

ప్రజలకు సంపూర్ణమైన, షరతులులేని స్వేచ్ఛ ఉండాలి. అలాంటి స్వేచ్ఛను డిమాండు చేసేందుకు, దాని కోసం పోరాడేందుకు ఒక ప్రజల పార్టీ ఉండాలి. అపుడు జాతీయ స్వాతంత్ర్యమనేది పెద్ద సమస్య కాదు. ప్రజలు వర్తమాన పరిస్థితుల్లో ఆర్థిక, రాజకీయ హక్కులను కోల్పోయారు. ఆ హక్కులను సాధించలేని జాతీయ స్వాతంత్ర్య పోరాటానికి విలువ లేదు. జాతీయ స్వాతంత్ర్యానికి నిర్దిష్ట రూపకల్పన చేయటమంటే, ఒక గణతంత్ర రాజ్యాన్ని యేర్పరచటమే. అలాంటి రాజ్యం అభివృద్ధిచెందిన ప్రజాస్వామిక సూత్రాలపై ఆధారపడి నడవాలి.

సార్వత్రిక వయోజన (స్త్రీ, పురుషుల) వోటు హక్కుతో యెన్నికైన ఒక జాతీయ అసెంబ్లీ మాత్రమే ప్రజల అత్యున్నత విభాగమౌతుంది. అపుడు అన్ని రకాల కులము, వర్గాల

హోదాలు రద్దుచేయబడతాయి. దేశం పరిపూర్ణంగా ప్రజాస్వామ్యయుతమౌతుంది. జాతీయ స్వాతంత్ర్యంతో ప్రజలకు మరింత నిర్దిష్టమైన అవకాశాలు సమకూర్చాలి. అది ప్రజల తక్షణ ఆర్థిక సమస్యలను పరిష్కరించాలి. వారికి వున్నత ప్రమాణాలు గల జీవితానికి హామీనివ్వాలి.

జాతీయ స్వాతంత్ర్యం కోసం క్రింది నియమావళిని అమలుచేయాలి : దున్నేవారికే భూమి చెందుతుంది. భూమి నుండి తమ కష్టంతో సముపార్జించని ఆదాయంతో పరాన్నభుక్కు వర్గాలు విలాసవంతమైన జీవితం గడుపుతున్నారు. అలాంటివారి స్వార్థ ప్రయోజనాలను వమ్ముచేయాలి. భూ యాజమాన్య వర్గం జేబుల్లో అపారమైన సిరి, సంపదలు పొంగిపొర్లుతున్నాయి. రైతాంగాన్ని భారాల నుండి విముక్తి చేసేందుకు వాటిని మరలించాలి. భూమి కౌలును గణనీయంగా తగ్గించాలి. చాలీచాలని ఆదాయాలతో, ఆర్థికంగా గిట్టుబాటుకాని భూముల్లో సేద్యం చేస్తున్న పేద రైతులను కౌలు నుండి పూర్తిగా మినహాయించాలి. వడ్డీ వ్యాపారుల దురాగతాల నుండి రైతాంగాన్ని కాపాడాలి. జాతీయ ప్రభుత్వం విస్తారంగా వ్యవసాయ రుణాలను అందించటం ద్వారా రైతాంగాన్ని ఆదుకోవాలి. ఉచిత ప్రాథమిక విద్యను అందించటం, వ్యవసాయంలో యంత్రాలను ప్రవేశపెట్టడం ద్వారా రైతాంగపు సాంస్కృతిక స్థాయిని పెంచాలి.

**పారిశ్రామిక కార్మికులకు**

ఎనిమిది గంటల పని, కనీస జీవన వేతనాలను జాతీయ ప్రభుత్వం గ్యారంటీ చేయాలి. సౌలభ్యమైన పని పరిస్థితులు, గృహవసతి కల్పనకు హామీనిచ్చే చట్టం చేయాలి. నిరుద్యోగ కార్మికుల బాధ్యతను ప్రభుత్వమే స్వీకరించాలి.

రైల్వేలు, జల మార్గాలు, టెలీగ్రాఫ్ వంటి ప్రజా వినియోగ సంస్థలు జాతి సంపదగా మారాలి. వాటిని ప్రైవేటు లాభాల కోసం కాకుండా, ప్రజల వుపయోగార్థం నిర్వహించాలి. కార్మికుల (మరియు కర్షకులు) ఐక్యతకు, వారి ప్రయోజనాల పరిరక్షణకు సమ్మె హక్కుకు పూర్తి స్వేచ్ఛ ఉండాలి. మతము, ఆరాధనా స్వాతంత్ర్యాలకు పూర్తి స్వేచ్ఛ కావాలి. జాతీయ, మతపరమైన అల్పసంఖ్యాక (మైనారిటీ) ప్రజానీకం స్వయం ప్రతిపత్తి హక్కును అనుభవించగల్గాలి.

> **“ రైల్వేలు, జల మార్గాలు, టెలీగ్రాఫ్ వంటి ప్రజా వినియోగ సంస్థలు జాతి సంపదగా మారాలి. వాటిని ప్రైవేటు లాభాల కోసం కాకుండా, ప్రజల వుపయోగార్థం నిర్వహించాలి. కార్మికుల (మరియు కర్షకులు) ఐక్యతకు, వారి ప్రయోజనాల పరిరక్షణకు సమ్మె హక్కుకు పూర్తి స్వేచ్ఛ ఉండాలి. మతము, ఆరాధనా స్వాతంత్ర్యాలకు పూర్తి స్వేచ్ఛ కావాలి. జాతీయ, మతపరమైన అల్పసంఖ్యాక (మైనారిటీ) ప్రజానీకం స్వయం ప్రతిపత్తి హక్కును అనుభవించగల్గాలి. ”**

ఇవి ప్రణాళికలోని ప్రధానమైన అంశాలు. అవి అత్యధిక ప్రజానీకాన్ని ఐక్యం చేస్తాయి. ఈ ప్రణాళిక వారిని అబేధ్యమైన కార్యాచరణకు పురిగొల్పుతుంది. జాతీయవాద బూర్జువాల ప్రణాళిక పెట్టుబడిదారులు, భూ యాజమాన్య వర్గాల ప్రయోజనాలను కాపాడుతుంది. అది దేశానికి ద్రోహం చేసింది. బూర్జువాలు నమ్మకద్రోహానికి పాల్పడి, పిరికితనంతో వ్యవహరించినప్పటికీ, దేశం తనకు తాను తట్టుకుని నిలబడాలి. స్వాతంత్ర్య సాధన దిశలో సాగిపోవాలి. వంచకులైన బూర్జువా రాజకీయవేత్తల ప్రభావం నుండి జాతీయ కాంగ్రెస్‌ను విముక్తిచేయాలి. స్వాతంత్ర్యం కోసం నిజాయితీతోను, సాహసోపేతంగాను పోరాడాలనుకునేవారు ప్రజల ప్రతినిధులుగా ఎదగాలి. జాతీయ విముక్తి పోరాటాన్ని నడపాలని కోరుకుంటున్న పార్టీ ప్రజల పార్టీగా మారాలి. ఆ పార్టీ ప్రాతినిధ్యంలేని అత్యధికుల ప్రతినిధిగా మారాలి. అంతేతప్ప కేవలం కొద్దిమంది అదృష్టవంతులకు ప్రతినిధి కారాదు. ప్రస్తుత కౌన్సిల్ హాళ్లు ప్రజల పార్టీ కార్యాచరణ క్షేత్రాలుగా చాలా పరిమితంగా ఉన్నాయి. అవి ప్రజల పార్టీ కార్యాచరణకు అనుగుణమైన స్థాయిలో విస్తృతం కావాలి.

ప్రతి అంశంలోనూ జాతీయ స్వాతంత్ర్యము, సంపూర్ణంగా ప్రజాస్వామ్యీకరణ చెందిన జాతీయ జన జీవనము – ఇవి జాతీయ వేదిక ప్రధాన అంశాలుగా మారాలి. ఈ ప్రణాళికను సాధించేందుకు సాగాల్సిన సమరాన్ని క్రింది నినాదంతో కొనసాగించాలి. “ భూమి, రొట్టె, విద్య.”.... ఇదే ఆ రణన్నినాదం.

**(అనువాదం: వై సిద్ధయ్య)**

**‘మార్క్సిస్టు’కు మీ సందేహాలు రాయండి!**

‘మార్క్సిస్టు’ సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి, పిన్ : 522501, గుంటూరు జిల్లా.**

**సెల్: 9490099333** email: venkataraosankarapu@gmail.com

# ఆటోమేషన్ ప్రభావాన్ని 'రోబో పన్ను' భర్తీ చేయగలదా?

**సుజోయ్ చక్రవర్తి**

చాలా పారిశ్రామిక దేశాలు, చైనా, భారతదేశం వంటి మధ్యతరగతి దిగ్గజాల స్థూల జాతీయోత్పత్తి గత దశాబ్దంగా దిగజారుతుండడం, నిరుద్యోగం పెరుగుతుండడం చూస్తూనే ఉన్నాము. 2008 లో ఏర్పడ్డ ఆర్థిక సంక్షోభం, కరోనా మహమ్మారి ఈ పరిస్థితి వేగాన్ని మరింత పెంచాయి. గతకొన్ని దశాబ్దాలుగా ఈ ఆర్థిక వ్యవస్థలలో సంచలనాత్మక, వ్యవస్థీకృత మార్పులు జరుగుతూ ఈ దశకు చేరుకున్నాయి. ఎరిక్ బ్రింజాల్ఫ్ సన్, ఆంద్రూ మాక్ ఏ ఫి తమ పుస్తకం 'రెండో యాంత్రిక యుగం '(ది సెకండ్ మెషిన్ ఏజ్)లో స్వయం చాలక యంత్రాలు, రోబోలు, "తెలివైన" సాఫ్ట్‌వేర్‌లతో భవిష్యత్తులో నైపుణ్యం లేని పనివారి అవసరం ఉండదని హెచ్చరించారు.

ఈ విధంగా లాభాపేక్షే ధ్యేయంగా నడిచే పారిశ్రామికపెట్టుబడి సంచయనం 1857 లోనే కార్ల్‌మార్క్స్ దృష్టి నుండి తప్పించుకోలేదు. పెట్టుబడిదారీ విధానంలోనే యంత్రాలను ఎప్పటికప్పుడు నవీకరించడం జరుగుతూ, చివరికి ఉత్పత్తులలో కార్మికుల వ్యక్తిగత శ్రమవిలువ అత్యల్పంగా ఉంటుందని, వారికి చెల్లించాల్సిన ధరకూడా ఏమీ ఉండదని చెప్పారు ("ఫ్రాగ్మెంట్స్ ఆన్ మెషిన్స్). కార్ట్ వొన్నెగుట్ అనే ఒక వ్యంగ్య రచయిత యాంత్రీకరణ యుగంలో మనిషి అవసరం ఉండబోదని 1952లో ప్లేయర్ పియానో అనే నవలలో వ్రాసారు. అందులో వాద్యకారులు లేని పియానో వాయిద్యాల శబ్దాలు, యంత్రాలచేత నియంత్రించబడుతున్న వాయిద్య సంగీతాలు షాపింగ్ మాల్స్‌లో వినిపిస్తాయని వ్యంగ్యోక్తులు విసిరారు.

అయితే ఇదేమీ కొత్తకాదు. స్పిన్నింగ్ జెన్నీ, ఆవిరి యంత్రం, కంప్యూటర్ చిప్స్ వంటి ఆవిష్కరణలు వచ్చిన సమయాలలో కూడా వ్యవస్థాగతంగా నిరుద్యోగంలో పెద్ద ఎత్తున మార్పులు చోటుచేసుకుని, ఆయా కాలాలలో వేలాది మంది కార్మికులు తమ పనులు కోల్పోయారు. 18 వ శతాబ్దపు చివరి దశాబ్దాలలో పారిశ్రామిక విప్లవం జరిగిన తరువాత, అంతకు ముందటి అర్ధ శతాబ్దం కన్నా కార్మికుల వేతనాలు సగానికి సగం పడి పోయాయి. అటువంటప్పుడు భవిష్యత్తులో డేటా ఎంట్రీ ఆపరేటర్లు, వినిమయ సేవలు చేయడంలో నైపుణ్యం గలవారు, షాపులలో పనిచేసేవారు, ఆఫీసులలో బంట్రోతులుగా పనిచేసేవారి పరిస్థితి ఏమిటి? అదీ ఇటువంటి పనులు ఎక్కువమంది చేసే భారతదేశం వంటి దేశంలో వారి భవిష్యత్తు ఎలా ఉండబోతోంది? సమస్యకి సమాధానం కనిపిస్తూనే ఉందికదా అని ఆశావాదులు అంటారు. పనివారు తమ నైపుణ్యాలను పెంచుకోవడం, కొత్త కొత్త రంగాలలో శిక్షణ పొందడం, వేర్వేరు ఉద్యోగాలు వెతుక్కోవడం వంటివి అమెరికా, పశ్చిమ యూరప్ దేశాలలో సాధ్యం కావచ్చు. అక్కడ సమాజంలో ఆర్థిక వనరులు పుష్కలంగా ఉండడం వలన నైపుణ్యాన్ని, ఉత్పాదకతను పెంచుకోవడం, లాభసాటి ఉద్యోగాలు సంపాదించుకోవడం సాధ్యపడవచ్చు. కానీ ఎంతటి ఆశావాదులైన ఆర్థిక శాస్త్రవేత్తలు కూడా ఈ అభివృద్ధి చెందిన దేశాలలో సహితం, ఇలా మార్పులకు గురైనవారు ఇప్పుడు ఏ పరిస్థితులలో ఉన్నారో తెలుసుకోడానికి సరైన గణాంకాలు అందుబాటులో లేవని అంటున్నారు.

బెనర్జీ, డ్యూఫ్లో (2019) ప్రకారం, చిన్న చిన్న పనులు చేసే యంత్రాల వలన పనులను నియంత్రించే నైపుణ్యం గల అధికారులను నియమించుకోవడం బాగా తగ్గిపోయింది. యాంత్రీకరణ పెరగడం వలన నైపుణ్యంగల, నైపుణ్యం లేని పనులకు కూడా ఆదాయాలు పెరిగి ఉద్యోగాల డిమాండ్ పెరుగుతుందని వాదిస్తున్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, ఇతర నైపుణ్యాలు కల పనివారు ధనవంతులవుతారు. అందువలన వారు ఇళ్లలో పనిచేసేవారిని అధికంగా నియమించుకుంటారు. ఉద్యోగులను క్లరికల్, పాలనా పరమైన ఉద్యోగాల నుండి తొలగించటానికి కృత్రిమ మేధ దారితీస్తుంది. శారీరక శ్రమ చేయవలసిన తక్కువ నైపుణ్యంగల పనులలోకి, ఉదాహరణకి ఆహారం సరఫరా చేయడం, శుభ్రపరచడం, సెక్యూరిటీ గార్డులుగా పనిచేయడం వంటి ఉద్యోగాలలోకి మరవలసి వస్తుంది. ఇది ఆర్థిక, సామాజిక అసమానతలను మరింతగా పెంచుతుంది.

### వినాశకర ప్రభావం

అభివృద్ధి చెందిన దేశాలలో కార్మికులను తొలగించే స్వయం చాలక యాంత్రీకరణ ప్రభావం 1990ల నుండి విశేషంగా కనపడుతుండగా, అభివృద్ధి చెందుతున్న దేశాలలో అతి తక్కువ కాలం నుండి కనిపిస్తుంది. ఈ దేశాలలో ఇప్పటికే నికర ఉత్పత్తి, పెట్టుబడుల (పెట్టుబడులు, కార్మికుల శ్రమ) నిష్పత్తి తక్కువగా ఉండడం వలన స్వయం చాలకత (ఆటోమేషన్)ని ఖర్చులు తగ్గించుకోడానికి వ్యాపార వర్గాలు ఆహ్వానిస్తాయి. తక్కువ నైపుణ్యం గల పనివారిని నియమించునే బదులు కచ్చితంగా పనిచేసే యంత్రాలను ఉపయోగించుకోడానికి వారు మొగ్గుచూపుతారు. యంత్రాలు జీతాలు పెంచమని అడగవు. పనివారికి ఇచ్చే ఆరోగ్య సదుపాయాల స్థానంలో యంత్రాల నిర్వహణ ఖర్చులు వార్షిక కాంట్రాక్టు పద్ధతిలో పెట్టుకోవచ్చు.

భారతదేశంలో ఇప్పటికే ఈ విధానాల ఫలితాలు చూచాయగా కనిపిస్తూనే ఉన్నాయి. ఉద్యోగుల వేతనాలు ఇవ్వడానికి పరిశ్రమలలో సాఫ్ట్‌వేర్‌ని ఉపయోగించడం వలన ఇదివరకు నియమించినంత మంది ఉద్యోగులను నియమించవలసిన అవసరం కలగడం లేదు. 2021 లో ఎన్ఎఎస్ఎస్‌సిఒఎం ప్రకటించిన గణాంకాల ప్రకారం భారతదేశంలోని సాఫ్ట్‌వేర్ కంపెనీలు 2022 నాటికి ముప్పై లక్షలమంది

ఉద్యోగులను తొలగించే ప్రయత్నాలు చేస్తున్నాయి. అంటే దీని వలన ఆ సంస్థలు తమ వార్షిక వేతనాల బిల్లులలో 10,000 కోట్ల డాలర్లను ఆదా చేసుకోవాలని భావిస్తున్నాయి. సాఫ్ట్‌వేర్, ఐటి, ఐటి సంబంధిత పరిశ్రమలలో ఉద్యోగుల తొలగింపు ఎక్కువగా ఉంటుందనేది నిర్వివాదాంశం.

సాంప్రదాయక పరిశ్రమలలో సాంకేతిక మార్పులను అమలు చేయడం ఖర్చుతో కూడుకున్నదిగా ఉండటం వలన కాస్త నెమ్మదిగా ఉంటుంది. అందువలన చాలామంది వ్యాపారులు అర్ 2 –డి 2 ల కన్నా పాత పద్ధతులకే కట్టుబడి ఉండవచ్చు. పైగా వాటి నిర్వహణా వ్యయాలు అధికంగా ఉంటాయి. అయితే రాబోయే కాలంలో ఆటోమొబైల్, జౌళి పరిశ్రమలలో యాంత్రీకరణ ఎక్కువగా జరిగే అవకాశాలు ఉన్నాయి.

“ అందువలన సమీప భవిష్యత్తులో ఆటోమేషన్ వలన చాలామంది ఉద్యోగాలు కోల్పోవటం వలన వస్తువుల సాధారణ డిమాండ్ తగ్గే అవకాశాలు మెండుగా ఉన్నాయి. అలాగే మంచి విద్య, ఆరోగ్యం కూడా ప్రజలకు దూరమయే అవకాశాలు ఉన్నాయి. కాలం గడిచేకొద్దీ ఆటోమేషన్ వలన పోగుపడిన సంపద వినిమయ మార్కెట్లు లేక ఆవిరవుతుంది. అంతేకాదు పెద్ద ఎత్తున నిరుద్యోగం పెరిగి అనేక ఇతర ఆర్థిక, సామాజిక పతనాలు మొదలవుతాయి. ”

### సామాజిక, ఆర్థిక పతనాలు

కార్మికులను తొలగిస్తే ఏమవుతుంది? అసలే నైపుణ్యం తక్కువగా ఉన్న మూడో ప్రపంచ దేశాలలో తొలగించబడిన కార్మికులను నైపుణ్యం అక్కరలేని పనులకు తప్ప మిగిలిన పనులకు వీరిని ఎవరు నియోగించుకుంటారు? ఆ పనులు చేయడం వీరికి ఇష్టం ఉండకపోవచ్చు. 1990లలో అమెరికా, పశ్చిమ యూరప్ దేశాలలో కంప్యూటర్‌ల వాడకం పెరిగిన తరువాత తొలగించబడిన ఉద్యోగులకు కొత్తగా ఉద్యోగాలు దొరకడం చాలా కష్టమయింది. అందువలన సమీప భవిష్యత్తులో ఆటోమేషన్ వలన చాలామంది ఉద్యోగాలు కోల్పోవటం వలన వస్తువుల సాధారణ డిమాండ్ తగ్గే అవకాశాలు మెండుగా ఉన్నాయి. అలాగే మంచి విద్య, ఆరోగ్యం కూడా ప్రజలకు దూరమయే అవకాశాలు ఉన్నాయి. కాలం గడిచేకొద్దీ ఆటోమేషన్ వలన పోగుపడిన సంపద వినిమయ మార్కెట్లు లేక ఆవిరవుతుంది. అంతేకాదు పెద్ద ఎత్తున నిరుద్యోగం పెరిగి అనేక ఇతర ఆర్థిక, సామాజిక పతనాలు మొదలవుతాయి. మొదటిగా అసమానతలు తీవ్రంగా పెరగటం వలన నేరాలు పెరుగుతాయి. అందువలన ప్రభుత్వాలు తమ వనరులలో అధిక భాగాన్ని శాంతి–భద్రతలను కాపాడటానికి, పరిపాలనను సక్రమంగా నిర్వహించడానికి వినియోగించవలసి ఉంటుంది. రెండోది ఆదాయాలు లేని కుటుంబాలు ప్రభుత్వ ఆరోగ్య రక్షణపై ఆధారపడడంతో ప్రభుత్వాలకు భారంగా మారనున్నాయి. నిరుపేదలు, నిరుద్యోగుల జీవితాలను, పని పరిస్థితులను వాతావరణ మార్పులు తీవ్రంగా ప్రభావితం చేసి బతుకులు భారం చేస్తాయి.

### ఖరీదయిన వ్యవహారం

ఇంతటి భయంకరమైన ప్రభావాలు ఉన్నప్పటికీ ఈ విషయాలు ఎందుకు చర్చకు రావడం లేదు? సాంకేతికాభివృద్ధి మానవ సంస్కృతిలో పురోగమనంగా భావించబడుతుంది కాబట్టి దానికి ఆశావాదులు చేర్చే ట్రికిల్ డౌన్ సిద్ధాంతం (ధనవంతులు పెరిగితే వారి పంచన పేదవారు బ్రతకొచ్చుననే సిద్ధాంతం) తోడయితే ఇంకా చెప్పేదేముంది! మనం ఏమి చేయకుండా నిశ్చింతగా కూచుని ఉంటాము. ఈ లోగా రోబోలు అతి వినయంగా మన పనులు చేసుకుపోతూ ఉంటాయి.

సాధారణ ఆర్థిక వ్యవస్థలలో ఉత్పత్తిలో కార్మికుల భాగస్వామ్యాన్ని, ఇతర భౌతిక పెట్టుబడుల నుండి వేరు చేసి చూడకపోవడం ఈ మౌనం వెనుక ఉన్న రెండో కారణం. నిజానికి పెట్టుబడిదారీ వ్యవస్థలో ఒక యూనిట్ పెట్టుబడి సమర్థవంతంగా అత్యధిక ఉత్పాదకతనిచ్చే చోటికే నిరాఘాటంగా చేరుతుంది. అందువలన పెట్టుబడిదారీ వ్యవస్థలో వివిధ రకాలైన పెట్టుబడులు తమకి అవసరమైన శ్రమ యూనిట్లను తరలించుకు పోతుంటాయి. ఇతర యూనిట్లు వారి వారి ఉత్పత్తుల వాడకానికి ఉపయోగకరంగా ఉన్నవాటిని స్వీకరిస్తుంటారు. ఇటువంటి వ్యవస్థలో కొంతమంది కార్మికులు అత్యధిక వేతనాలకు నియమించబడి, అత్యధిక సంఖ్యాకులు అతి తక్కువ వేతనాలకు నియమించబడినా సైద్ధాంతిక సమర్థతకు ఏమాత్రం భంగం వాటిల్లదు. అందువలన సాంకేతిక పరిజ్ఞానం తీవ్రమైన మార్పులకు లోనయి, నైపుణ్యం లేని కార్మికులు ఉత్పత్తికి అనవసరంగా మారిపోతున్నారు. అయితే కొంతకాలానికి అందులో కొంతమంది కొత్త మార్పులకు అలవాటు పడవచ్చు. తిరిగి నియామకాలు పొందవచ్చు. అయితే ప్రశ్నల్లా ఎంతకాలానికి వారు తిరిగి ఉద్యోగాలు పొందగలరన్నదే. తొలగించబడి నిరుద్యోగులుగా ఉన్న కాలంలో వారి జీవనవ్యయం ఎంత? ప్రపంచ వ్యాప్తంగా ఉద్యోగాలు కోల్పోయిన కార్మికులు ఆందోళనకు, కుంగుబాటుకు, ఇతర మానసిక సమస్యలకు లోనవుతుంటారు.

సాంప్రదాయక ఆర్థికవ్యవస్థ ఆలోచనలలోగాని, ఆర్థిక సిద్ధాంతాలలోగాని, యాంత్రీకరణ వలన కలిగిన అసమానతలు ఏ విధమైన మానసిక సమస్యలకు దారితీస్తాయో, అవి పనిచేయడం పట్ల కార్మికులకు ఉన్న ఆసక్తిని ఏవిధంగా ప్రభావితం చేస్తాయో అంచనాలు లేవు. ఆందోళనలకు గురైన కార్మికులు తాగడానికి, మత్తు పదార్థాల వినియోగానికి బానిసలవడం వలన వారు ఇతర ఉత్పత్తి విధానాల వైపుకు మరలడం, సాధారణంగా కష్టమవుతుంది. పని, ఉద్యోగిత ఒక రకమైన జీవనశైలిని అలవరచుకునే విధంగా చేస్తుంది. అందువలన కూడా మారడం కష్టమవుతుంది. పైగా ఉద్యోగాలు పోయిన వారు కొత్తగా శిక్షణ పొందడం, నైపుణ్యాలు పెంచుకోవడానికి సరిపడా నిధులు సమకూర్చుకోలేరు. ప్రశ్నల్లా ఈ మార్పులకు అనువుగా శిక్షణ పొందేందుకు, నైపుణ్యం సంపాదించేందుకు అవసరమైన నిధులు సమకూర్చుకునేందుకు రాజకీయ మద్దత్తు ఎలా సంపాదించాలన్నదే.


### రోబో పన్ను ఒక పరిష్కార మార్గం

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వాడే పరిశ్రమలు అన్నీ 'రోబో పన్ను' కట్టాలన్నది ఒక పరిష్కారం. ఉత్పత్తి సమర్ధత బాగా పెరుగుతుందని అనుకుంటే తప్ప ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వాడకూడదు. కార్మికశక్తిని తగ్గించకూడదు. 2017లో యూరోపియన్ యూనియన్ పార్లమెంటు దీనిని గురించి చర్చించింది. అయితే ఇది అమలు కాలేదు. అదే ఏడాది దక్షిణ కొరియా ప్రభుత్వం స్వయం

(మిగతా 36వ పేజీలో)

# మత మార్పిడుల సాకుతో హింసాకాండ

**బి.వి.రాఘవులు**



రచయిత సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు

మత ఉద్వేగాలను, హింసాకాండను రెచ్చగొట్టడానికి సంఘపరివార్ మత మార్పిడులను మరొక సాధనంగా వినియోగించుకుంటున్నది. హిందువులను క్రైస్తవులు, ముస్లిములు బలవంతంగా, తప్పుడు పద్ధతుల్లో తమ తమ మతాల్లోకి మార్చుకుంటున్నారని, దీని మూలంగా హిందూమతం ప్రమాదంలో పడిపోతున్నదని, తమ నేలపైనే తాము మైనారిటీ మతంగా మారిపోతున్నామని గగ్గోలు పెడుతున్నది. గతంలో కూడ ముస్లిం పాలకులు హిందువులను బలవంతంగా మతమార్పిడి చేయించారని ఆరోపిస్తున్నది. నిజానికి ఇదంతా హిందూ మతాన్ని రక్షించడానికి కాదు. మత ప్రాతిపదికన సమీకరించే తన రాజకీయ చర్యలను సమర్థించుకోవడానికి ఇది ఒక సాకు మాత్రమే. చర్చిలపైన, క్రైస్తవ సన్యాసినులపైన, ఆ మత చిహ్నాలపైన దాడులు మతపరమైన ఆగ్రహంతో కాకుండా రాజకీయ లక్ష్యంతో చేస్తున్నవే.

భారతదేశంలోని ముస్లిములలో అత్యధికులు మూలవాసుల సమూహాల నుండి మార్చబడిన వారే. భారీస్థాయిలో బలవంతపు మత మార్పిడులు జరిగినట్లు దాఖలాలు దాదాపుగా లేవు. అక్కడక్కడ కొన్ని బలవంతపు మతమార్పిడులు జరిగి ఉండవచ్చు. కాని ముస్లిం సామ్రాజ్యాలు శతాబ్దాల తరబడి పాలించాయి, అపారమైన రాజకీయ శక్తిని కలిగి ఉన్నాయి. అయినప్పటికీ ముస్లిములు మైనారిటీలుగానే ఉన్నారు. అందుచేత అన్నీ బలవంతపు మార్పిడులే అని చెప్పలేము. పర్షియా, మధ్య ఆసియాలతో పోల్చుకున్నపుడు భారతదేశంలో ఇస్లాంమతంలోకి మార్పిడి పరిమితంగానే జరిగింది. ఎందువల్లనంటే భారతదేశానికి ఇస్లాంను పరిచయం చేసిన వారు కులవ్యవస్థలోకి చొచ్చుకు పోలేక పోయారు. ఇస్లాం మతంలోకి మారిన సమూహపు స్థాయి నిచ్చెనమెట్ల కులవ్యవస్థలో అంతకు ముందు మాదిరిగానే కొనసాగింది.

భారత ఉపఖండం అత్యధిక ప్రాంతంలో, ప్రత్యేకించి మధ్యయుగాలలో, కొంతమేరకు నేటికీ పెద్ద ఎత్తున మత సాంప్రదాయాలు విస్తరించాయి. అయితే ఆ విస్తరణ ఒక మతాన్ని దెబ్బతీయడం ద్వారా మాత్రం కాదు. అసంఖ్యాకమైన స్థానిక తెగలు, వాటి ఆచారాలు అలా మార్పు చెందాయి. గిరిజన జనాభా ఎక్కువ ఉన్న దేశ ఈశాన్య ప్రాంతంలోను, మధ్య భారతంలోని ప్రాంతాలలోను క్రైస్తవంలోకి మార్పిడులు అత్యధికంగా జరిగాయి. కేరళలో వ్యవసాయంలో బానిస వ్యవస్థ రద్దు కావటంతో బానిసలుగా పనిచేస్తున్నవారు ఇస్లాంను తమ సామాజిక విముక్తికి మార్గంగా భావించి, ఆ మతంలోకి మారిపోయారు.

బ్రిటిష్‌వారి విధానాల ప్రభావంతో 19వ శతాబ్దం చివరి భాగం నుండి భారత దేశంలోని హిందువులలో మత మార్పిడులు ఒక ఆందోళనాంశంగా మారాయి. అగ్రవర్ణ హిందువులలో తమ మతం భవితవ్యం పట్ల తలెత్తిన ఆందోళనను ఆర్య సమాజం చేపట్టిన శుద్ధి కార్యక్రమం ప్రతిబింబిస్తుంది. ఇప్పుడు సంఘపరివార్ అదే భావనను దూకుడుగా, హింసాత్మకంగా అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నది. మీనాక్షిపురంలో 1981 ఫిబ్రవరిలో వందలాది మంది దళితులు సామూహికంగా ఇస్లాం మతంలోకి మారటం ఒక దశాబ్దకాలానికి పైగా ముస్లిములను లక్ష్యంగా చేసుకోవటానికి ఆరంభంగా పనిచేసింది. ఆర్ఎస్ఎస్ 1990లలో మధ్య భారతంలోని గిరిజన ప్రాంతాలలో 'ఘర్ వాపసి' కార్యక్రమాన్ని దూకుడుగా చేపట్టింది.

తన మత విశ్వాసాన్ని మార్చుకుని నచ్చిన మతాన్ని ఎంచుకునే స్వేచ్ఛ లేదా మరే ఇతర స్వేచ్ఛ అయినా ప్రజాస్వామ్య భావనలో విడదీయరానిది. బలవంతంగా లేదా మోస పూరితంగా కాని మత మార్పిడికి పాల్పడితే అది స్వేచ్ఛ, సమానత్వ మూల సూత్రాలకు విరుద్ధం. రాజ్యాంగం 25(1) అధికరణంలోని ప్రాథమిక హక్కుల అధ్యాయం మత స్వేచ్ఛ గురించి ఇలా స్పష్టంగా పేర్కొంది, " భావప్రకటనా స్వేచ్ఛ, మతాన్ని బోధించే, ఆచరించే, ప్రచారం చేసుకునే హక్కు ప్రజలందరికీ సమానంగా ఉన్నాయి."

### డి. 370వ అధికరణం రద్దు: జమ్ము-కాశ్మీర్ రాష్ట్ర హోదా రద్దు

జమ్ము-కాశ్మీర్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించే రాజ్యాంగంలోని 370వ అధికరణాన్ని సంఘపరివార్ మొదటి నుండీ వ్యతిరేకిస్తున్నది. దాన్ని ఎప్పుడూ హిందూ-ముస్లిం సమస్యగానే చూపించేది. స్వయం ప్రతిపత్తి, ప్రత్యేక హోదా కోసం చేసే డిమాండు వేర్పాటువాదమని, అందువల్ల అది జాతి వ్యతిరేకమైనదని చెబుతుంది. ప్రత్యేక హోదాను రద్దు చేసి, మత ప్రాతిపదికన రాష్ట్రాన్ని మూడు ముక్కలు చేయాలని అది కోరుతుంది. ముస్లింల పట్ల వ్యతిరేకతను రెచ్చగొట్టడానికి ఈ కాలమంతటిలోను సంఘ పరివార్ ఈ అంశాన్ని వినియోగించుకున్నది. చివరికి మోడీ, షాల నాయకత్వంలోని బిజెపి కేంద్ర ప్రభుత్వం 2019 ఆగస్టులో 370వ అధికరణాన్ని రద్దు చేసింది.

### ఇ. ఉమ్మడి పౌరస్మృతి పేరుతో మహిళా హక్కులకు హాని

ముస్లిం పర్సనల్ లా ముస్లింలను బుజ్జగించే ఒక చర్య అని, అది లౌకికతత్వానికి విరుద్ధమని బిజెపి వాదిస్తుంది. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు (అధికరణం 44), "భారతదేశ భూభాగంమీది పౌరులు ప్రతిఒక్కరికి వర్తించే ఉమ్మడి పౌరస్మృతి కోసం చట్టం తెచ్చేందుకు రాజ్యం కృషిచేస్తుంది." అని చెప్పింది కాబట్టి ఉమ్మడి శిక్షాస్మృతి మాదిరిగానే ఉమ్మడి పౌరస్మృతిని కూడ తీసుకు రావాలని బిజెపి డిమాండ్ చేస్తుంది. ఉమ్మడి పౌరస్మృతి వాంఛనీయమే అయినప్పటికీ దాన్ని ఒక్కసారిగా తీసుకు రాలేము, దానికోసం ప్రజలను ఒక క్రమపద్ధతిలో చైతన్యవంతులను చేయాల్సిన అవసరం ఉంది. దీనికి సంబంధించిన అత్యధిక వివాదాల్లో స్త్రీల హక్కులు ఇమిడి ఉన్నాయి. అందుచేత ఉమ్మడి పౌరస్మృతిని

రూపొందించేటపుడు మహిళల అభిప్రాయాలను, ప్రయోజనాలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవలసిన అవసరం ఉంది.

### ఎఫ్. ముస్లింలు బుజ్జగించబడుతున్నారా, వివక్షకు గురిచేయబడుతున్నారా?

లౌకిక పార్టీలు ఓట్ల కోసం ముస్లింలను బుజ్జగిస్తున్నాయని సంఘ్ పరివార్ ఆరోపిస్తుంది. ముస్లిం పర్సనల్ లాను ముట్టుకోవడం లేదని విమర్శిస్తుంది. ముస్లిం మెజారిటీ ఉన్న జమ్ము కాశ్మీర్‌కు, ఆలీగఢ్ ముస్లిం యూనివర్శిటీకి, జామియా మిలియా యూనివర్శిటీకి ప్రత్యేక హోదా కల్పించారని, మైనారిటీ కమిషన్లను నియమిస్తున్నారని, ముస్లిములకు రిజర్వేషన్లు కల్పిస్తున్నారని, హాజ్ యాత్రికులకు సబ్సిడీలు ఇస్తున్నారని, ఇమాంలకు వేతనాలు, వక్ఫ్ బోర్డులకు గ్రాంట్లు మొదలైనవి ఇస్తున్నారని ఎత్తి చూపుతుంది. ఇవన్నీ ముస్లిములను బుజ్జగించే చర్యలేనని చెబుతుంది. షాబానో కేసు తర్వాత ముస్లిములను బుజ్జగిస్తున్నారన్న ప్రచారం మరింత తీవ్రమైంది. షాబానో అనే విడాకులు పొందిన ముస్లిం మహిళకు భరణం మంజూరు చేస్తూ సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చింది. ఆ తీర్పును వమ్ము చేయడానికి ప్రభుత్వం ముస్లిం మహిళల రక్షణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టింది.

ఉభయమతాలలోని మతోన్మాద శక్తులను బుజ్జగించే అవకాశవాద రాజకీయాలకు బూర్జువా రాజకీయ పార్టీలు అతీతం కానప్పటికీ, ముస్లీంలను బుజ్జగించే చర్యలు అని వీరు చెబుతున్నవి స్వాతంత్ర్యానంతర కాలంలో ముస్లీంలలోని విస్తారమైన సెక్షన్ల పరిస్థితిని ఏమీ మెరుగుపరచలేదు. ఛాందసవాద ముస్లిం నాయకత్వాన్ని బుజ్జగిస్తున్నప్పటికీ, మొత్తంగా ముస్లింలు వివక్షకు గురవుతూనే ఉన్నారు. ముస్లీంలలోని అత్యధికులు సమాజంలో అట్టడుగున ఉన్న సామాజిక, ఆర్థిక తరగతులకు చెందినవారిలో భాగంగా ఉండటం బుజ్జగింపుల ద్వారా ప్రయోజనాలు పొందుతున్నారని సంఘ్ పరివార్ చేస్తున్న ప్రచారాన్ని వమ్ము చేస్తున్నది.

ముస్లిముల విద్య, ఉద్యోగాలు, వృత్తులకు సంబంధించిన గణాంకాలు సంఘ్ ఆరోపణలు తప్పు అని నిరూపిస్తున్నాయి. ముస్లిముల స్థితిగతుల పరిశీలనకు నియమించిన కమిటీల నివేదికలన్నీ అభివృద్ధికి సంబంధించిన అన్ని సూచికల్లోను ముస్లింల వెనుకబాటుతనాన్ని గుర్తించాయి. గోపాల్ సింగ్ కమిటీ (1982), సచార్ కమిటీ (2006) బుజ్జగించడం మాట అటుంచి, ముస్లింల పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారిందని పేర్కొన్నాయి. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత, ప్రత్యేకించి మోడీ హయాంలో ముస్లింల పరిస్థితి మరింత క్షీణించింది, వారు మరింత అభద్రతకు గురి అవుతున్నారు.

❝ ఉద్యోగాలకు సంబంధించిన సమాచారం ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాల్లో ముస్లింలు అతి స్వల్పంగా ఉన్నారు. అత్యధిక ముస్లింలు చేతివృత్తులు, తత్సంబంధిత పనులకే పరిమిత మయ్యారు ముస్లిం చేతి వృత్తి కుటుంబాల కోసం ప్రభుత్వం చేసింది నామ మాత్రం. ప్రైవేటు రంగంలో ముస్లిములు ప్రాతినిధ్యం కూడ చాల తక్కువ. మొత్తంగా అత్యధిక ముస్లిముల పరిస్థితి దయనీయంగా ఉంది. చిన్న వ్యాపారాలు చేసుకునే వారిగాను, అసంఘటితరంగం లో పనిచేసే వారుగాను ఉన్న వారు రెక్కాడితే కాని డొక్కాడే పరిస్థితిలోనే ఉన్నారు. ❞

ఉద్యోగాలకు సంబంధించిన సమాచారం ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాల్లో ముస్లింలు అతి స్వల్పంగా ఉన్నారు. అత్యధిక ముస్లిములు చేతివృత్తులు, తత్సంబంధిత పనులకే పరిమితమయ్యారు ముస్లిం చేతి వృత్తి కుటుంబాల కోసం ప్రభుత్వం చేసింది నామమాత్రం. ప్రైవేటు రంగంలో ముస్లిములు ప్రాతినిధ్యం కూడ చాల తక్కువ. మొత్తంగా అత్యధిక ముస్లిముల పరిస్థితి దయనీయంగా ఉంది. చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వారిగాను, అసంఘటితరంగంలో పనిచేసే వారుగాను ఉన్న వారు రెక్కాడితే కాని డొక్కాడే పరిస్థితిలోనే ఉన్నారు.

ఆర్థికంగా వారు అతి బలహీనంగా ఉండటం, అలాంటి వారిపై మతోన్మాద దాడులు కూడ పెరగడం మొత్తంగా ముస్లిం మతస్తులలో ఒక అభద్రతా భావాన్ని వ్యాపింపచేశాయి. ప్రపంచ వ్యాపితంగా ముస్లిం వ్యతిరేకత, ఫలితంగా వారిలో పెరిగిన నిస్పృహ వారిపై ప్రతికూల ప్రభావం చూపాయి. వీటన్నింటి ఫలితంగా ముస్లింపేటలను వెలివాడలుగా చేసే పరిస్థితి దాపురించింది. వాస్తవ పరిస్థితి వారిని ఒక మూలకు నెట్టివేస్తున్నది. ఇది ముస్లిములలో ఛాందసవాద శక్తులు అభివృద్ధి చెందడానికి దోహదపడు తున్నది. ఈ పరిస్థితి ముస్లిములలో పురోగామి శక్తులు పనిచేయడాన్ని క్లిష్టతరం చేస్తున్నది.

ముస్లిం, క్రైస్తవ మైనారిటీలు ఏకాకులుగా చేయబడి, వివక్షకు, భౌతిక దాడులకు లక్ష్యంగా మారుతున్నారు. టెరరిస్టులతో సంబంధాల సాకుతో వారు విచక్షణారహితంగా అరెస్టులకు గురిచేయబడుతున్నారు కూడ.

అంతే కాకుండా హిందూ మతోన్మాదులు వారికి వ్యతిరేకంగా అనేక అపోహలను విస్తారంగా ప్రచారంలో పెడుతున్నారు. ఈ అపోహలు మత అల్లర్లకు ప్రాతిపదికను సిద్ధం చేస్తున్నాయి. ముస్లిము నివాసాలను వెలివాడలుగా చేయడానికి మతఘర్షణలు దారితీస్తున్నాయి. ముస్లిములు ఇతరులతో సంబంధాలు మాని తమకు తాముగా ఉండేలా తయారవుతున్నారు. సమానత్వ సమస్యలకన్నా, భద్రతవైపు అధికంగా వారు తమ దృష్టిని సారించాల్సిన పరిస్థితి వచ్చింది.

### జి. ముస్లింల చొరబాటు ఆరోపణ

సంఘ్, బిజెపిలు లేవనెత్తుతున్న మరొక సమస్య పొరుగుదేశాలయిన పాకిస్తాన్, బంగ్లాదేశ్‌ల నుండి అక్రమ వలసలు. సరిహద్దు రాష్ట్రాలయిన పశ్చిమ బెంగాల్, అస్సాం, త్రిపుర, ఇతర ఈశాన్య రాష్ట్రాలు, బీహారు, పంజాబు, రాజస్థాన్‌ల మీదుగా ముంబయి, ఢిల్లీ లాంటి పెద్ద నగరాలకు ముస్లిములు పెద్దఎత్తున వలసలు వస్తున్నారని అది ఆరోపిస్తుంది.

బంగ్లాదేశ్ విముక్తి పోరాట సమయంలో పెద్దఎత్తున వలసలు చోటుచేసుకున్నాయన్నది వాస్తవం. అయితే అలా వలస వచ్చింది ముస్లిములు మాత్రమే కాదు. పెద్ద సంఖ్యలో హిందువులు కూడ భారతదేశంలోకి ప్రవేశించారు. కాని బిజెపి, సంఘ్‌లు దీన్ని మొత్తంగా శరణార్థుల సమస్యగా చూడకుండా, తమ మతతత్వ ఎజెండాను ముందుకు తీసుకువెళ్ళేందుకు ఉపయోగించుకుంటున్నాయి. కొత్త రాష్ట్రాలకు తన ఎన్నికల పలుకుబడిని విస్తరించేందుకు ముస్లిం వ్యతిరేకతను ఒక అంశంగా చేసుకుంటున్నది. ఇప్పుడు కేంద్ర బిజెపి ప్రభుత్వం పౌరసత్వ సవరణ చట్టం తీసుకురావడం, ఎన్‌పిఆర్, ఎన్‌ఆర్‌సిల తయారీకి సన్నాహాలు చేయడం మతపరమైన విభజనను మరింత ముందుకు నెడుతుంది. ఇది రాజ్యాంగ లౌకిక పునాదిని దెబ్బతీయడమే.

### హెచ్. ముస్లిముల అపరిమిత సంతానోత్పత్తి నిజమా?

హిందువుల జనాభా కన్నా ముస్లిముల జనాభా అధిక వేగంతో పెరిగి పోతున్నదన్నది సంఘపరివార్ ముస్లిములకు వ్యతిరేకంగా పదే పదే చేస్తున్న ఆరోపణ. ఇది ఇలాగే కొనసాగితే

**"ఏ జన సముదాయం సంతానోత్పత్తి రేటు మారడం అయినా ఆ సముదాయపు సామాజిక, ఆర్థిక అభివృద్ధిపై ఆధారపడుతుం దని ఇస్లామిక్ దేశాలతో సహా, ప్రపంచ వ్యాపిత అనుభవాలు స్పష్టం చేస్తున్నాయి. భారతదేశం దీనికి మినహా యింపు కాదు. భారత దేశంలో హిందువుల, ముస్లిముల సంతానోత్పత్తి రేటులో వ్యత్యాసానికి కారణం ముస్లిముల కన్నా ముందుగా హిందువులు సంతానాన్ని పరిమితం చేసే చర్యలు తీసుకోవటమే కారణం."**

హిందువులు తమ స్వంత దేశంలోనే మైనారిటీలుగా మారిపోతారని చెబుతుంది.

హిందువులు, ముస్లిముల సంతానోత్పత్తి రేటులో ప్రస్తుత వ్యత్యాసం ఇలాగే సుదీర్ఘ కాలం కొనసాగినా ముస్లిం జనాభా హిందువుల జనాభాను అధిగమించడం అసాధ్యం అని జనాభా నిపుణులు చెబుతున్నారు. ఇప్పుడు 25 శాతం ముస్లిం జనాభా ఉన్న ప్రాంతాలలో సైతం ముస్లిముల జనాభా హిందువుల జనాభాను మించాలంటే 200 ఏళ్ళకు పైగా పడుతుంది. ఏ జన సముదాయం సంతానోత్పత్తి రేటు మారడం అయినా ఆ సముదాయపు సామాజిక, ఆర్థిక అభివృద్ధిపై ఆధారపడుతుందని ఇస్లామిక్ దేశాలతో సహా, ప్రపంచ వ్యాపిత అనుభవాలు స్పష్టం చేస్తున్నాయి. భారతదేశం దీనికి మినహాయింపు కాదు. భారత దేశంలో హిందువుల, ముస్లిముల సంతానోత్పత్తి రేటులో వ్యత్యాసానికి కారణం ముస్లిముల కన్నా ముందుగా హిందువులు సంతానాన్ని పరిమితం చేసే చర్యలు తీసుకోవటమే కారణం.

**ఐ. ముస్లిముల విధేయత పట్ల సందేహం**

భారతదేశం పట్ల ముస్లిముల విధేయతపై సందేహాన్ని లేవనెత్తడం ముస్లిములకు వ్యతిరేకంగా సంఘపరివార్ చేస్తున్న ప్రచారాలలో ఒకటి.

**జె. మతపరమైన హింస**

తన మతోన్మాద ప్రచారం, ఆందోళనల ద్వారా సంఘపరివార్ మైనారిటీల పట్ల భయాన్ని, సందేహాన్ని, ద్వేషాన్ని పెంచే వాతావరణాన్ని సృష్టిస్తుంది. దీని మూలంగా ఎక్కడన్నా చిన్న ఘటన జరిగినప్పటికీ అది సంఘపరివార్ యంత్రాంగం వ్యాప్తి చేసే పుకార్ల ద్వారా మతఘర్షణలకు దారితీసేదిగా తయారవుతుంది. ప్రజలను, ప్రత్యేకించి సమాజంలోని పేద తరగతుల జనాన్ని మతతత్వ పూరితం చేయడానికి మతహింస ఒక ముఖ్యమైన సాధనంగా తయారయింది. అది మతతత్వ భావనలను తీవ్రతరం చేస్తుంది, ప్రజలను మతాలవారీగా విడగొడుతుంది. లౌకిక, ఉదార వాద, మానవతా శక్తులు ప్రజల్లో బహిరంగంగా పనిచేసే జాగాను కుదించి వేస్తుంది.

స్వతంత్ర భారతదేశంలో వందలాది మతహింసా ఘటనలు జరిగాయి. వీటిలో వేలాది మంది చనిపోయారు. మతఘర్షణల్లో ప్రధాన బాధితులు మైనారిటీలే. గుజరాత్‌లో జరిగిన 2002 మారణకాండ ఇప్పటివరకు ఎన్నడూ లేనంత ముందస్తు ప్రణాళికతో జరిగిన అతి పెద్ద మత మారణ హోమం. దీనిలో 2000 మందికి పైగా చంపివేయబడ్డారని, ముస్లిం మహిళలు అత్యాచారాలకు, అవమానాలకు, హత్యలకు గురయ్యారని, ప్రత్యేకంగా ముస్లిం వ్యాపార సంస్థలను లక్ష్యంగా చేసుకొని తగలబెట్టారని, ముస్లిముల నివాసాలు ధ్వంసం చేయబడ్డాయని, 1,50,000 మందికి పైగా ముస్లిములు తమ ఇళ్ళను వదిలి వెళ్ళారని పలు నివేదికలు నమోదు చేశాయి.

**క. హింసా విధానం**

ఆరెస్సెస్ ఆరంభం నుండి తన రాజకీయాధికార ప్రయత్నంలో హింస అవసరాన్ని స్పష్టం చేసింది. సెమెటిక్ జాతి అయిన యూదులను నాజీ జర్మనీ ప్రక్షాళనం చేసిన తీరుపట్ల గోల్వాల్కర్ సంబరం చేసుకున్నాడు. హిందూత్వను మొట్టమొదట ప్రతిపాదించిన వారిలో ఒకడైన బిఎస్ మూన్జె(ఆరెస్సెస్ స్థాపకుడైన హెడ్గెవార్‌కు గురువు కూడ) ముసోలినీని కలుసుకోవడానికి, ఇటలీలో ఫాసిజం పద్ధతులను అధ్యయనం చేయడానికి ఆ దేశం వెళ్ళాడు. **'రాజకీయాలను హైందవీకరించాలి, హిందువులను సైనికీకరణ చేయాలి.'** చేయాలి అన్న సావర్కార్ నినాదం వారికి హింస, బలప్రయోగాల పట్ల ఎంతటి మోజు ఉందో స్పష్టం చేస్తుంది.

సమూహాలపై దాడులు చేసే మతోన్మాద హింసే కాకుండా, వ్యక్తులపై విద్వేషపూరిత నేరాలు కూడ రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. పశుమాంసం తినడం, గోవులను వధించడం, గోవులను తరలించడం – వీటిని హింసకు సాకులుగా వినియోగించుకుంటున్నారు. కొట్టిచంపడాలు సాధారణంగా మారాయి. హిందూత్వ పట్ల విమర్శనాత్మకంగా ఉండే వ్యక్తులను వేధిస్తున్నారు, సోషల్ మీడియాలో నిందా ప్రచారం చేస్తున్నారు, అవమానిస్తున్నారు, బెదిరిస్తున్నారు, చంపడం సైతం చేస్తున్నారు. దబోల్కర్, కాల్బుర్గి లను చంపడం, జెఎన్‌యులో ముసుగులు ధరించిన గూండాలు విద్యార్థులపై దాడి చేయడం దీనికి కొన్ని స్పష్టమైన ఉదాహరణలు.

బిజెపి ప్రభుత్వాలు ఈ నేరాలకు మద్దతిస్తున్నాయి. నేరస్తులను స్వేచ్ఛగా వదిలేస్తున్నాయి. ఈ నేరాలకు పాల్పడ్డ వారిని దేశభక్తులని బిజెపి నేతలు నిస్సిగ్గుగా పొగడు తున్నారు.

**ఎల్. పచ్చి కమ్యూనిస్టు వ్యతిరేకత, సామ్రాజ్యవాద అనుకూలత**

గాంధీజీ హత్య తర్వాత ప్రభుత్వం ఆరెస్సెస్‌ను నిషేధించింది. గోల్వాల్కర్‌ను జైల్లో పెట్టింది. తనను విడుదల చేయమని, తాను కమ్యూనిస్టు ప్రమాదాన్ని నిర్మూలించడానికి సహకరిస్తానని గోల్వాల్కర్ ప్రభుత్వాన్ని అర్థించాడు. ఆయన జైలు నుండి రాసిన లేఖలో ఇలా ఉంది, "కమ్యూనిస్టులు దేశానికి పెద్ద ప్రమాదం. ఈ ప్రమాదాన్ని నిర్మూలించడానికి ప్రభుత్వ అధికారాన్ని, ఆరెస్సెస్ యంత్రాంగాన్ని జతచేయవచ్చు." వలస పాలకులు, సామ్రాజ్యవాదులతో జతకట్టటానికి ఆరెస్సెస్ భావజాలం దారితీస్తున్నది. స్వాతంత్ర్యోద్యమ కాలంలో ఆరెస్సెస్ బ్రిటిష్ వారికి అనుకూలంగాను, స్వతంత్ర పోరాటానికి వ్యతిరేకంగాను పని చేసింది. వియత్నాంపై అమెరికా దురాక్రమణను గోల్వాల్కర్ సమర్థించాడు. ధర్మ బలగాలను అమెరికా నడిపిస్తున్నదని కీర్తించాడు. 2003లో ఆరెస్సెస్ అధినేత సుదర్శన్ ఇరాక్‌పై అమెరికా దాడిని స్వాగతించాడు. ఇప్పుడు మోడీ ప్రభుత్వం వ్యూహాత్మక ఒప్పందం కుదుర్చుకోవడం ద్వారా అమెరికా అడుగుల్లో అడుగు వేసి నడుస్తున్నది.

**ఎం. రాజ్యాంగం మూల సూత్రాలపై దాడి**

సంఘపరివార్‌కు మన రాజ్యాంగం అంటే ఇష్టం లేదు. ప్రత్యేకించి దాని ఉదారవాద, లౌకిక, ప్రజాతంత్ర స్వభావం, మైనారిటీలు, బలహీన వర్గాల హక్కులకు రక్షణ కల్పించే అంశాలు దానికి నచ్చవు. రాజ్యాంగం పట్ల తన వ్యతిరేకతను సంఘపరివార్ పదే పదే ఉద్ఘాటిస్తుంది. హిందూ ధర్మంపై ఆధార పడిన రాజ్యాంగమే తన లక్ష్యమని చెబుతూ ఉంటుంది.

గోల్వాల్కర్ తన పాంచజన్యం గ్రంథంలో ఇలా చెప్పాడు, "మన రాజ్యాంగం సంక్లిష్టమైనది, విభిన్నతలతో కూడినది, పలు

పాశ్చాత్యదేశాల రాజ్యాంగాల నుండి వివిధ అంశాలను గుదిగుచ్చడం ద్వారా తయారు చేయబడింది. ఇది మన స్వంతం అని చెప్పుకోవడానికి దానిలో ఏమీ లేదు. ఆదేశిక సూత్రాలలో ఇది మన జాతి కర్తవ్యం అని చెప్పే మాట ఒక్కటైనా ఉందా, జీవితంలో కీలకం ఇది అని ఎక్కడైనా చెబుతుందా?"

ఆరెస్సెస్ పత్రిక ఆర్గనైజర్‌లో గోల్వాల్కర్ మన రాజ్యాంగం గురించి ఇలా విమర్శ చేశాడు, " మన రాజ్యాంగంలో ప్రాచీన భారత దేశంలో రూపుదిద్దుకున్న విశిష్ట రాజ్యాంగ పరిణామాల ప్రస్తావన అనేదే లేదు. స్పార్టాకు చెందిన లైకర్గస్ కన్నా, పర్షియాకు చెందిన సోలన్ కన్నా ఎంతో ముందుగానే మనుధర్మ సూత్రాలు రచించబడినాయి. మనుస్మృతిలో పేర్కొనబడిన సూత్రాలు నేటికీ ప్రపంచ పాలకు లను సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తాయి, వాటి పట్ల స్వచ్ఛందంగానే విధేయతను, నిబద్ధతను ప్రదర్శించేలా చేస్తాయి. కాని మన రాజ్యాంగ పండితులకు ఇదంతా అర్థరహితంగా కనిపిస్తుంది."

భారత రాజ్యాంగానికి ప్రాతిపదిక అయిన ప్రాదేశిక జాతీయవాదం అనాగరికమైన దని గోల్వాల్కర్ వాదిస్తాడు. మన రాజ్యాంగం హిందూ తాత్వికతను పొందుపరుచుకోవాలి. ఒక ప్రదేశంలో నివసించే ప్రజలకు జాతీయ భావనను పరిమితం చేయడం తప్పు అని పేర్కొన్నాడు.

'భారత రాజ్యాంగం హిందూఏతరమై నది, దాని స్థానంలో హిందూ రాజ్యాంగాన్ని నెలకొల్పాలి' అని 1992లో జరిగిన విశ్వ హిందూపరిషత్ (విహెచ్‌పి) ధర్మ సంసద్ తీర్మానించింది. మనుస్మృతి ప్రజలందరికి న్యాయాన్ని ప్రసాదించిందని సంఘ్ విశ్వ సిస్తుంది. మను ధర్మసూత్రాలు భారత రాజ్యాంగం కన్నా ముఖ్యమైనవని అది భావిస్తుంది.

సంఘపరివార్ శక్తులు అవకాశం దొరికి నప్పుడల్లా రాజ్యాంగాన్ని ధ్వంసం చేయడానికి ప్రయత్నించాయి. 1998లో బిజెపి నాయకత్వం లో ఎన్‌డిఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినపుడు రాజ్యాంగాన్ని సమీక్షించడానికి వెంకట్రామయ్య కమిషన్‌ను నియమించింది. 2014 లో మోడి అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగ పీఠికలో లౌకిక, సోషలిస్టు పదాలు లేకుండా 2015 రిపబ్లిక్ డే నాడు ప్రభుత్వ వాణిజ్య ప్రకటన వెలువడింది. 2019 లో మోడి రెండవసారి అధికారం చేపట్టిన తర్వాత రాజ్యాంగంపై మరింత తీవ్రమైన దాడి జరుగుతున్నది. 370 వ అధికరణం (కాశ్మీర్) రద్దు చేయబడింది. పౌరసత్వాన్ని మతప్రాతిపది కన సవరించే పౌరసత్వ సవరణ చట్టం తీసుకు రాబడింది. ట్రిపుల్ తలాక్ బిల్లు ఆమోదించ బడింది. రాబోయే రోజుల్లో బిజెపి ప్రభుత్వం అధికరణం 25 (మత స్వేచ్ఛ), అధికరణం 30 (మైనారిటీలు విద్యాసంస్థలను ఏర్పాటు చేసుకోవడం గురించి) లాంటి ముఖ్యమైన వాటిని కూడ సవరించడానికి తీవ్రంగా ప్రయత్నించవచ్చు.

> **" ఫాసిస్టు తరహా పద్ధతుల్లో ప్రజాతంత్ర హక్కులను, భిన్నాభిప్రాయాన్ని అణగదొక్కే హిందూత్వ మతోన్మాద శక్తులు నియంతృత్వానికి ప్రధాన మూలంగా ఆవిర్భవించాయి. బిజెపి విధానాలను ఏమాత్రం విమర్శించినా వారిని జాతి వ్యతిరే కులుగాను, పాక్ అనుకూలురుగాను ముద్రవేస్తున్నారు. భిన్నాభిప్రాయాన్ని వ్యక్తం చేసే వారిపై రాజద్రోహ నేరాన్ని మోపడం సర్వసాధారణం అయిపోయింది. "**

గతంలో అధ్యక్ష తరహా పాలన అనే తన భావనను ముందుకు తీసుకు వచ్చింది. ఇప్పుడు ఏక సమయంలో పార్లమెంటు, అసెంబ్లీలకు ఎన్నికలు జరపాలనే తన ప్రతిపాదనకు మద్దతు సమీకరించుకునేందుకు ప్రయత్నిస్తున్నది.

న్యాయవ్యవస్థ, ఎన్నికల కమిషన్, సిబిఐ, ఇడి, ఆర్‌బిఐ మొదలైన రాజ్యాంగ అధికార వ్యవస్థలు హిందూత్వ ఎజెండాకు అనుగుణంగా వ్యవహరించాలన్న వత్తిడికి గురవుతున్నాయి. పరిపాలనా క్రమంలో పార్లమెంటు అంతకంతకు పక్కన పెట్టబడుతున్నది.

ప్రజాస్వామ్యం ప్రకారం పనిచేయడానికి ప్రస్తుత రాజ్యాంగం కల్పించే అవకాశాన్ని వినియోగించుకొని హిందూ రాజ్యాన్ని తీసుకు రావటం లక్ష్యంగా సంఘపరివార్ పనిచేస్తున్నది.

**ఎన్. ప్రజాస్వామ్యం పట్ల వ్యతిరేకత**

సంఘపరివార్ మెజారిటీవాదాన్నే ప్రజాస్వామ్యంగా పరిగణిస్తుంది. నాయకుడి ప్రాతిపదికన నియంతృత్వ ప్రభుత్వం ఉండాలని అది కోరుకుంటుంది.

ప్రజాస్వామ్యం అనేది పాశ్చాత్య భావన అని, అది భారతదేశానికి తగినది కాదని ఆరెస్సెస్ విశ్వసిస్తుంది. హిందూరాజ్యం నిస్వార్థ పరులైన, ఆత్మత్యాగం చేయకలిగిన బృందంచే న్యాయబద్ధంగా పరిపాలింపబడాలని గోల్వా ల్కర్ రాశాడు. (శ్రీగురుజీ సమగ్ర వాల్యూమ్ 5, పేజీలు 89-90) ఇది ఫాసిస్టు దృక్పథాన్ని తలపించడమే కాదు, పురాతన కాలంనాటి వర్ణాశ్రమ (చాతుర్వర్ణ) ధర్మాన్ని కూడ ముందుకు తెస్తుంది. క్షత్రియులను, వైశ్యులను, మొత్తం శ్రామిక ప్రజానీకాన్ని పాలించేది బ్రాహ్మణులు అని చెబుతుంది.

**ఓ. ప్రజాతంత్ర హక్కులపై ఫాసిస్టు తరహా దాడి**

ఫాసిస్టు తరహా పద్ధతుల్లో ప్రజాతంత్ర హక్కులను, భిన్నాభిప్రాయాన్ని అణగదొక్కే హిందూత్వ మతోన్మాద శక్తులు నియంతృత్వానికి ప్రధాన మూలంగా ఆవిర్భవించాయి. బిజెపి విధానాలను ఏమాత్రం విమర్శించినా వారిని జాతి వ్యతిరేకులుగాను, పాక్ అనుకూలురుగాను ముద్రవేస్తున్నారు. భిన్నాభిప్రాయాన్ని వ్యక్తం చేసే వారిపై రాజద్రోహ నేరాన్ని మోపడం సర్వసాధారణం అయిపోయింది. బిజెపి పాలిత రాష్ట్రాలలోను, ఢిల్లీలోను విశ్వవిద్యాలయ విద్యార్థులపైన, సిఏఏ కు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేసినవారిపైన అణచివేత చర్యలు బిజెపి నిరంకుశ, ప్రజాతంత్ర వ్యతిరేక స్వభావాన్ని బట్టబయలు చేస్తున్నాయి. ఒక్క రాజకీయ రంగంలోనే కాకుండా సామాజిక, సాంస్కృతిక రంగాలలో కూడ నియంతృత్వానికి రంగం సిద్ధం చేయబడుతున్నది. పశుమాంస భక్షణపై నిషేధం, నైతిక పోలీసింగ్, కళాకారులను, సాంస్కృతిక ఉత్పత్తులను హిందూ వ్యతిరేకమైనవని తెగనా డటం, ఉన్నత విద్యాసంస్థలపై దాడులు చేయడం, హిందూత్వ విలువలకు కట్టుబడి ఉండాలని డిమాండ్ చేయడం, కళలను సెన్సార్ షిప్‌కు గురిచేయడం, కళాకారులను బెదిరించ డం- ఇవన్నీ కూడ నియంతృత్వ దాడులకు ఉదాహరణలుగా ఉన్నాయి.

రామజన్మభూమి, ఆవు లాంటి చిహ్నాలను మతపరమైన సమీకరణ కోసం సంఘపరివార్ వినియోగించుకుంటున్నది. ప్రజలను, ప్రత్యేకించి సమాజంలోని పేద ప్రజానీకాన్ని మతతత్వపూరితం చేయడానికి మత ఘర్షణలను ప్రధాన సాధనంగా వినియోగించుకుంటున్నది. 370 వ అధికరణం, ఉమ్మడి పౌరస్మృతి, హిందువులు, ముస్లిములకు మధ్య జనాభా పెరుగుదల రేటులో తేడాలు, విదేశీయుల అక్రమ వలసలు మొదలైన వాటిని మతోన్మాద భావాలను రెచ్చగొట్టడానికి వినియో గించుకుంటున్నది.

❋

రాజకీయం

# మునుగోడు ఉప ఎన్నిక ఎందుకొచ్చింది?



రచయిత సిపిఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

**ఎస్. వీరయ్య**

తెలంగాణలో మునుగోడు ఉప ఎన్నిక అనివార్యమా?

బీజేపీకి కాళ్ళు తెచ్చిందెవరు?

టీఆర్ఎస్ నికరంగా నిలబడుతుందా?

టీఆర్ఎస్‌కు ముద్దొచ్చినపుడల్లా వామపక్షాలు చంకనెక్కాలా?

ఎర్రజెండా వైఖరి ఏమిటి?

తెలంగాణ రాజకీయం వేడెక్కుతున్న సమయమిది. ఇవన్నీ చర్చకు వస్తున్న సందర్భం కూడా. బీజేపీ, టీఆర్ఎస్‌లు కుమ్మక్కై ఘర్షణ పడుతున్నట్టు నటిస్తున్నాయని కాంగ్రెస్ రోజూ ఆరోపిస్తున్నది. టీఆర్ఎస్‌ను ఓడించటమే తన లక్ష్యంగా ప్రకటిస్తున్నది. మరోవైపు టీఆర్ఎస్, కాంగ్రెస్‌లు అవగాహనతోనే నడుచుకుంటున్నాయనీ, ఎప్పుడైనా కలిసిపోతారనీ బీజేపీ నాయకత్వం అంటున్నది. ఇంతకూ తెలంగాణలో ఏం జరుగుతున్నట్టు? ఈ మూడు పార్టీలలో ఏ రెండు పార్టీలైనా ప్రస్తుత పరిస్థితుల్లో మిత్రపక్షాలుగా మారే అవకాశం ఉన్నదా? ఈ చర్చోపచర్చలన్నీ మునుగోడు అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల నేపథ్యంలో జరుగుతున్నాయి. కానీ రానున్న శాసనసభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే అందరూ పావులు కదుపుతున్నారు.

మునుగోడు ఉప ఎన్నికను బీజేపీ రుద్దింది. తన రాజకీయ ప్రయోజనాలకు పావులు కదుపుతున్నది. ఇందులో పావుగా మారిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఇదే అదనుగా 'స్వామికార్యం' 'స్వకార్యం' పూర్తి చేసుకునే ప్రయత్నంలో ఉన్నారు. ఆయన మీద మొదట కేంద్రం ఈడీ దాడులు చేయించింది. తర్వాత తమ దారికి తెచ్చుకున్నది. నియోజకవర్గం అభివృద్ధి కోసమే శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేసినట్టు రాజగోపాల్‌రెడ్డి ప్రకటించుకున్నారు. బీజేపీ అభ్యర్థిగా రంగంలోకి దిగుతున్నారు. నియోజకవర్గం అభివృద్ధి కోసమే అయితే బీజేపీ తన మూడు స్థానాలలోనూ రాజీనామా చేయాలి. కానీ అసలు విషయం అదికాదు. మునుగోడులో బీజేపీ గెలవాలనీ, తద్వారా రానున్న శాసనసభ ఎన్నికల్లో టీఆర్ఎస్‌కు తానే ప్రత్యామ్నాయమన్న వాతావరణం సృష్టించాలని వారి ప్రయత్నం. కానీ కేంద్రంలో విఫలమైన వీరికి తెలంగాణలో అధికారంలోకి వచ్చి ఏదో చేస్తామని చెప్పుకునే కనీస అర్హతలు ఉన్నాయా? తెలంగాణకు కూడా వీరు చేసిందేమిటి? విభజన చట్టం అమలుకు సహకరించలేదు. బయ్యారం ఉక్కు కర్మాగారం, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన విశ్వవిద్యాలయం ఊసు లేదు. బాయిల్డ్ రైస్ కొనుగోలు చేసేదిలేదని కొన్ని రోజులు, మిల్లర్ల మీద చర్య తీసుకోలేదన్న నెపంతో కొన్ని రోజులు ధాన్యం కొనుగోలు చేయకుండా రైతులను వేధించారు.

మోడీ మాటల ప్రకారం దేశంలో రైతుల ఆదాయం ఇప్పటికే రెట్టింపు కావాలి. కానీ అది ఏమాత్రం జరగలేదు. అదానీ ఆదాయం మూడింతలయ్యింది. అంబానీ ఆదాయం రెట్టింపయ్యింది. రైతుల బతుకు మాత్రం అక్కడే ఉన్నది. రైతు, రైతుగా మనుగడ కోసమే ఏడాదికి పైగా జరిగిన పోరాటంలో 750 మందికి పైగా అన్నదాతలు బలికావాల్సి వచ్చింది. ప్రతిష్టాత్మక సంస్థల ప్రైవేటీకరణకు కేంద్రం దుందుడుకుగా ముందుకు సాగుతున్నది. ఆర్టీసీ వంటి పబ్లిక్ ట్రాన్స్‌పోర్టును బలహీనపరిచేందుకు ట్రాన్స్‌పోర్టు సవరణ చట్టం చేసింది. కార్మిక చట్టాలు రద్దు చేసింది. ప్రభుత్వరంగ బ్యాంకులకు రు.13 లక్షల కోట్లు ఎగవేసిన బడాబాబులకే రాయితీలు ఇస్తున్నది. అటవీ (సంరక్షణ) నియమాలు-2022 పేరుతో అడవులు, అటవీ సంపదను కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తున్నది. ఒక్క గిరిజన బిడ్డను రాష్ట్రపతిగా చూపించి లక్షలాది గిరిజనులను అడవుల నుంచి గెంటివేస్తున్నది. స్వాతంత్ర్య వజ్రోత్సవ వేడుకల వేళ అవినీతి, బంధుప్రీతి, నారీశక్తి గురించి నీతులు చెప్పారు ప్రధాని. కానీ అవినీతిని చట్టబద్ధం చేసింది మోడీ ప్రభుత్వమే! ఆటగాడు కాకపోయినా క్రికెట్ సారధిగా వెలుగుతున్నది అమిత్‌షా కొడుకే! పార్లమెంటులో పూర్తి మెజారిటీ ఉన్నప్పటికీ చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఊసెత్తనిది బీజేపీ ప్రభుత్వమే! పైగా గుజరాత్‌లో వీరి ప్రభుత్వమే కుటుంబ సభ్యులందరినీ కిరాతకంగా హత్యచేసి, నిండు గర్భిణి మీద సామూహిక లైంగికదాడి చేసిన 11 మంది నేరస్తులను వారి 'సత్ప్రవర్తన'కు మెచ్చి విడుదల చేసింది. పైగా వీరంతా బ్రాహ్మణులనీ, సంస్కారవంతులనీ, అందుకే విడుదల చేసామని బీజేపీ శాసనసభ్యుడు సమర్థించుకున్నాడు. వీరికి క్షమాభిక్ష పెట్టాలని సిఫారసు చేసిన కమిటీలో ఆయన సభ్యుడు కూడా. వరుసగా 16వ నెల కూడా ద్రవ్యోల్బణం రెండంకెల స్థాయిలో (జులైలో 13.9 శాతం) ఉన్నది మోడీ పాలనలోనే. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు బ్యారెల్ ధర 137 డాలర్లున్నప్పుడు కూడా దేశంలో పెట్రోలు లీటరు ధర రు.75 దాటలేదు. కానీ అంతర్జాతీయ మార్కెట్‌లో 95 డాలర్లే ఉన్నప్పటికీ పెట్రోలు లీటరు ధర రు.100 దాటింది మోడీ పాలనలోనే. విద్యుత్తు సవరణ బిల్లు పేరుతో ప్రజల మీద భారాలు మోపి, అదానీ, అంబానీలను మేపాలని చూస్తున్నదీ బీజేపీ ప్రభుత్వమే. 'ఉచితాలు' రద్దు చేయాలన్న పేరుతో పేదల సబ్సిడీలు రద్దు చేయాలని ప్రయత్నిస్తున్నదీ, సుప్రీంకోర్టులో కేసు వేసిందీ బీజేపీ నాయకులే. ఇలాంటి చరిత్ర మూటగట్టుకున్న బీజేపీ నేతలే తెలంగాణలో కూడా అధికారానికి వస్తామనీ, ఉద్ధరిస్తామనీ

నమ్మబలుకుతున్నారు.

ఢిల్లీ ఉపముఖ్యమంత్రి సిసోడియా మీద ఈడీ దాడులు చేసింది. కేసులు పెట్టి బ్లాక్‌మెయిల్ ప్రారంభించింది. బీజేపీతో చేతులు కలిపితే ముఖ్యమంత్రిని చేస్తామని ఆశలు చూపుతున్నదనీ, మధ్యవర్తుల ద్వారా బేరాలు ప్రారంభించిందనీ ఆయన బహిరంగంగానే ప్రకటించారు. కేసీఆర్ ఢిల్లీ, పంజాబ్ పర్యటనలూ, ఆప్ నేతలతో చర్చలూ మద్యం కుంభకోణం కోసమేనని ఆరోపిస్తున్నారు. కేంద్రంలో బీజేపీకి వ్యతిరేకంగా ఫ్రంటు ఏర్పాటు పేరుతో ఈ పని చేస్తున్నారని ప్రచారం మొదలుపెట్టారు. ఇంతటితో ఆగలేదు. బీజేపీ కార్యకర్తలు కవిత ఇంటిమీద దాడికి ప్రయత్నించారు. మద్యం కుంభకోణంతో కవితకు సంబంధం ఉన్నట్టుగానీ, ఈడీ దాడులు చేయనున్నట్టుగానీ అధికారులు ప్రకటించలేదు. కానీ బీజేపీ నేతలు కేంద్రంలో ప్రకటించారు. రాష్ట్రంలో వారి కార్యకర్తలు దాడికి పూనుకున్నారు.

> “ఆగస్టు 20న హైద్రాబాద్‌లో జరుగనున్న మునావర్ ఫరూఖీ కామెడీ షో రద్దు చేయాలని బీజేపీ ఎంఎల్‌ఏ రాజాసింగ్ డిమాండ్ చేసారు. మునావర్ తన కామెడీ షోలో హిందువుల మీద అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తారనీ, అందుకే అడ్డుకుంటామనీ హెచ్చరించారు. కామెడీ షో జరిగింది. కానీ వివాదాస్పద వ్యాఖ్యలు చేసినట్టు వార్తలేమీ లేవు. కానీ రాజాసింగ్ మాత్రం మహమ్మద్ ప్రవక్త మీద వివాదాస్పద వ్యాఖ్యలతో వీడియో చేసి విడుదల చేసాడు.”

ఆగస్టు 20న హైద్రాబాద్‌లో జరుగనున్న మునావర్ ఫరూఖీ కామెడీ షో రద్దు చేయాలని బీజేపీ ఎంఎల్‌ఏ రాజాసింగ్ డిమాండ్ చేసారు. మునావర్ తన కామెడీ షోలో హిందువుల మీద అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తారనీ, అందుకే అడ్డుకుంటామనీ హెచ్చరించారు. కామెడీ షో జరిగింది. కానీ వివాదాస్పద వ్యాఖ్యలు చేసినట్టు వార్తలేమీ లేవు. కానీ రాజాసింగ్ మాత్రం మహమ్మద్ ప్రవక్త మీద వివాదాస్పద వ్యాఖ్యలతో వీడియో చేసి విడుదల చేసాడు. దీని మీద నిరసనలు వెల్లువెత్తాయి. గతంలో బీజేపీ నేత నుపూర్ శర్మ ఇవే వ్యాఖ్యలు చేసిన ఫలితంగా అంతర్జాతీయ సమాజానికి ప్రధాని వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. ఇప్పుడు అవే వ్యాఖ్యలు బీజేపీ ఎంఎల్‌ఏ చేయటం ద్వారా రాష్ట్రంలో మతకలహాలు రెచ్చగొట్టి, మునుగోడు ఉప ఎన్నికల్లో లాభపడాలని ఎత్తుగడ. అది బెడిసికొట్టింది. రాజాసింగ్‌ను పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్టు బీజేపీ ప్రకటించింది. కానీ ఎత్తుగడలు బెడిసికొట్టిన ఫలితంగా నష్టనివారణ కోసం ఆడుతున్న నాటకం ఇది. ఆయన మీద చర్యలు తీసుకున్నట్టు రాష్ట్ర నాయకులు ప్రకటించగా, కేంద్ర నాయకులు ఆయనను పరామర్శించారు. మరోవైపు కవిత ఇంటిమీదకు వెళ్ళిన తమ కార్యకర్తల మీద, శాసనసభ్యుడి మీద దాడి చేసారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆరోపించారు. తన పాదయాత్రను ఆపి నిరసనదీక్షకు పూనుకున్నారు. భావోద్వేగాలను రెచ్చగొట్టేందుకు పథకం ప్రకారమే పావులు కదిపారు.

తెలంగాణలో బీజేపీకి ఇంత ధైర్యం రావడానికి కారణం ఏమిటో పరిశీలించాలి. ఇందులో కాంగ్రెస్‌కూ, టీఆర్‌ఎస్‌కూ బాధ్యత ఉన్నది. కొండా విశ్వేశ్వర్ రెడ్డితో కాంగ్రెస్ నాయకత్వం సమావేశమైంది. కాంగ్రెస్ నాయకత్వం రాష్ట్రంలో బీజేపీకి వ్యతిరేకంగా కాకుండా, టీఆర్‌ఎస్ మీదనే పోరాడాలని తాను సూచించానని ఆయన బహిరంగంగానే చెప్పారు. తర్వాత మూడు మాసాల్లో ఆయన బీజేపీలో చేరారు. కాంగ్రెసు నుంచి బీజేపీలోకి దూకిన కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్ శ్రేణులకు ముడుపులు చెల్లించి ఆకర్షించే పనిలో ఉన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత మర్రి శశిధర్ రెడ్డి కూడా కాంగ్రెసు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మీద విమర్శల బాణం ఎక్కుపెట్టారు. కాంగ్రెస్‌లో ఇది మామూలేనని కొట్టి పారేయలేము. బీజేపీలో చేరిన నాయకులతో ఆయన గొంతు కలిపారు. పైగా మర్రి శశిధర్ రెడ్డి నిజాయితీకి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కితాబులిచ్చారు. ఇంత జరుగుతున్నా బీజేపీ ప్రమాదాన్ని కాంగ్రెస్ గుర్తించనిరాకరిస్తున్నది. బీజేపీ ఏ స్థాయిలో కెలుకుతున్నదో గమనించకుండా టీఆర్‌ఎస్ మీదనే దాడి ఎక్కుపెట్టింది. కరిగిపోతున్న కాంగ్రెసు పునాదిని గుర్తించే స్థితిలో లేదు. సరైన రాజకీయ విధానం లేని కాంగ్రెసు తన శ్రేణులను కాపాడుకోగల స్థితిలో లేదు. బీజేపీ ప్రమాదాన్ని గుర్తించకుండా, టీఆర్‌ఎస్ మీదనే ఎక్కుపెట్టటం ద్వారా ఆచరణలో బీజేపీకే ఉపయోగపడుతున్నది. కాంగ్రెస్ అవకాశవాదం వల్లనే హుజూరాబాద్‌లో కాంగ్రెసు కరిగిపోయి, బీజేపీ గెలిచిన విషయం మరువలేము. దుబ్బాక, జీహెచ్‌ఎంసీ ఎన్నికలలో కూడా రాజకీయంగా గాడి తప్పిన ఫలితంగానే కాంగ్రెస్ శ్రేణులు బీజేపీ పంచనజేరిన విషయం తెల్సిందే. ఒక జాతీయ పార్టీగా బీజేపీ ప్రమాదాన్ని గుర్తించటంలో కాంగ్రెస్ విఫలమైంది. రాష్ట్రంలో అవినీతిని ఎండగట్టే పేరుతో మోడీ గుప్పిట్లో ఉన్న ఈడీ, సీబీఐల మీద విశ్వాసం ప్రదర్శించింది. అసోంకు చెందిన బీజేపీ నేత ఉత్తరప్రదేశ్


## ‘మార్క్సిస్టు’ పై మీ అభిప్రాయాలు తెలపండి!

‘మార్క్సిస్టు’ సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్ధిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి**

,

**పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**

> **“ టీఆర్‌ఎస్ ప్రస్తుతం కేంద్రం మీద, బీజేపీ విధానాల మీద గట్టిగానే పోరాడుతున్నది. ఈ విధానం నిలకడగా కొనసాగించాలి. సుదీర్ఘకాలం కేంద్రంలో మోడీ సర్కారుతో తాము నెరిపిన లాలూచీ కుస్తీ, ఇక్కడ బీజేపీ బలపడడానికే తోడ్పడిందన్న విషయం గుర్తించాలి. తమకు బీజేపీ ప్రమాదం అర్థమైంది కాబట్టి, ఇక వామపక్షాల మద్దతు బ్లాంక్ చెక్ లాంటిదని భావిస్తున్నారు. తమ అప్రజాస్వామిక ధోరణుల వల్లనే బీజేపీకి కాళ్ళొచ్చాయన్న విషయం కూడా గమనించాలి. ”**

సభలో రాహుల్ గాంధీ మీద నీతిబాహ్యమైన వ్యాఖ్యలు చేస్తే... ఆయనను తెలంగాణ ప్రభుత్వం అరెస్టు చేయాలని ఆందోళన చేసింది. నోరు పారేసుకున్న బీజేపీ నేతను వదిలేసి టీఆర్ఎస్ ప్రభుత్వం మీద దాడి చేసింది. ఈ వైఖరి బీజేపీకే ఉపయోగపడుతుందని కాంగ్రెస్ నేతలకు తెలియదా? రాష్ట్రంలో కాంగ్రెస్ నేతలకు అధికారం కోసం ఆరాటం, పార్టీలో ఆధిపత్యం కోసం కుమ్ములాటలు తప్ప ప్రజల బాధలు, బీజేపీ ప్రమాదం పట్టవు. ఈ పరిస్థితులే కాంగ్రెస్ శ్రేణులు బయటకు తొంగిచూసేటట్టు చేస్తున్నాయి. బీజేపీని ఓడించగల శక్తి తానేనన్న విశ్వాసం నియోజకవర్గం ప్రజలకే కాదు, తన సొంత పార్టీ శ్రేణులకు కూడా కల్పించలేకపోతున్నది.

టీఆర్ఎస్ ప్రస్తుతం కేంద్రం మీద, బీజేపీ విధానాల మీద గట్టిగానే పోరాడుతున్నది. ఈ విధానం నిలకడగా కొనసాగించాలి. సుదీర్ఘకాలం కేంద్రంలో మోడీ సర్కారుతో తాము నెరిపిన లాలూచీ కుస్తీ, ఇక్కడ బీజేపీ బలపడడానికే తోడ్పడిందన్న విషయం గుర్తించాలి. తమకు బీజేపీ ప్రమాదం అర్థమైంది కాబట్టి, ఇక వామపక్షాల మద్దతు బ్లాంక్ చెక్ లాంటిదని భావిస్తున్నారు. తమ అప్రజాస్వామిక ధోరణుల వల్లనే బీజేపీకి కాళ్ళొచ్చాయన్న విషయం కూడా గమనించాలి. దుబ్బాక, నాగార్జునసాగర్, జీహెచ్ఎంసీ ఎన్నికల సందర్భంగా అహంభావం ప్రదర్శించారు. పోడు భూముల కోసం పోరాడుతున్న ఆదివాసీలు, పేదరైతుల మీద, ఇండ్ల స్థలాల కోసం పోరాడుతున్న పేదల మీద పోలీసులను ఉసిగొల్పారు. వీఆర్ఏల సమస్యల విషయంలో మొండిగా వ్యవహరిస్తున్నారు. కౌలు రైతులకు రుణార్హత కార్డు ఇవ్వటంలేదు. నిజానికి ఇవన్నీ తామిచ్చిన వాగ్దానాలే! పోరాడకుండానే పరిష్కరించాలి. 73 రంగాలలో కేవలం 5 రంగాల కార్మికులకు కనీసవేతనాలు సవరిస్తూ నిర్ణయాలు చేసారు. కానీ యాజమాన్యాల వత్తిడితో అవి కూడా నిలిపివేసారు. ప్రశ్నించే పత్రికల మీద కక్షసాధింపు చర్యలు చేపట్టారు. దళితబంధుకు వామపక్షాల మద్దతు కోరారు. హుజూరాబాద్ ఎన్నికల కోసమే ఈ హంగామా చేసినట్టు అందరూ భావించవల్సి వచ్చింది. ఆ ఎన్నికల తర్వాత దళితబంధు కదలలేదు. వామపక్షాల ప్రతిపాదనలవైపు కన్నెత్తి చూడలేదు. ఇవన్నీ ప్రజలు గమనించరని భావిస్తే పొరపాటు. ఇప్పటికైనా చేసిన పొరపాట్లు గుర్తించాలి. సరిదిద్దుకోవాలి. అంతేతప్ప తనకు ముద్దొచ్చినప్పుడల్లా చంకనెక్కాలని కోరుకోవటం ఉపయోగపడదు. ప్రజలపట్ల నిబద్ధత, చిత్తశుద్ధి ప్రదర్శించాలి.

గతంలో టీఆర్ఎస్ నాయకత్వం అనేకసార్లు ఊగిసలాడింది. అందువల్ల ఇప్పుడైనా నికరంగా నిలబడుతుందా అన్న ప్రశ్న ముందుకొస్తున్నది. ఆ విషయం తేల్చుకోవల్సింది ఆ పార్టీ నాయకత్వమే. వామపక్షాలకు సంబంధించినంతవరకు, టీఆర్ఎస్ వైఖరిని బట్టే నిర్ణయాలుంటాయి. బీజేపీ, సంఘపరివార్ ప్రమాదం గురించి ఈ దేశంలో అందరికన్నా ముందు గుర్తించింది వామపక్షాలే. ఇలాంటి మతోన్మాదులను ఒంటరిచేసి ఓడించేందుకు ఆర్థిక, సాంఘిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ రంగాలలో నిరంతరం పోరాడాలి. మోడీ చుట్టూ టీఆర్ఎస్ నేతలు ప్రదక్షిణలు చేసినపుడు 'లాలూచీ కుస్తీ' అన్నాం. అది తప్పుడు విధానమని చెప్పాం. ఇప్పుడు చేతులు కాల్చుకున్నారు. బహిరంగంగానే బీజేపీ విధానాలతోనూ, కేంద్రం నియంతృత్వ ధోరణులతోనూ పోరాడుతున్నారు. ఆమేరకు వామపక్షాలు కూడా కలిసి పనిచేయాలి. రాష్ట్రంలో బీజేపీ బలపడితే శ్రామికులకు తీరని నష్టం జరుగుతుంది. ప్రజాస్వామ్యం, లౌకిక విలువలు ప్రమాదంలో పడతాయి. ఆ పరిస్థితి రానీయకూడదు.

రాష్ట్రంలో బీఎస్పీ నేతలు గానీ, షర్మిల గానీ చురుకుగా పర్యటిస్తున్నారు. కానీ బీజేపీ విధానాల మీద నోరు విప్పడానికి సిద్ధంగా లేరు. ఇది రాజకీయంగా బీజేపీకే ఉపయోగపడే అవకాశం ఉంటుంది.

ఈ నేపథ్యంలోనే మునుగోడు ఎన్నికల విషయంలో నిర్దిష్టంగా వామపక్షాల విధానం కూడా చర్చనీయాంశమైంది. మునుగోడులో బీజేపీ గెలుపు తెలంగాణ రాష్ట్రానికే ప్రమాదం. అందువల్ల బీజేపీని ఓడించగల శక్తికి మద్దతునివ్వటం తక్షణ కర్తవ్యం అవుతుంది. సాపేక్షంగా వామపక్షాలు కొంత బలం కల్గిన నియోజకవర్గం. ఐదుసార్లు సీపీఐ గెలిచిన స్థానం. కానీ సీపీఐ పోటీ చేయటం ద్వారా బీజేపీని ఓడించే కర్తవ్యం నెరవేరే అవకాశం లేదు. ఓట్లు చీలే అవకాశం ఉన్నది. అందువల్ల సీపీఐ పోటీ చేయరాదని నిర్ణయించింది. అది సరైంది. సీపీఐ నాయకత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి, టీఆర్ఎస్ అధ్యక్షుడైన కెసీఆర్‌తో చర్చలు జరిపింది. 20వ తేదీ టీఆర్ఎస్ బహిరంగసభలో పాల్గొని తన మద్దతు ప్రకటించింది. ముందురోజు సీపీఐతో పాటు సీపీఐ(ఎం) నాయకత్వాన్ని కూడా సీఎంతో చర్చలకు ఆహ్వానించారు. ఇతర టీఆర్ఎస్ నాయకులు సీపీఐ(ఎం) కార్యాలయానికి రావడానికి కూడా సిద్ధమేనన్నారు. సీపీఐ(ఎం)కు సంబంధించినంతవరకు ఎవరితో చర్చిస్తున్నాం, ఎక్కడ సమావేశమవుతున్నామన్నది ముఖ్యం కాదు. బీజేపీని ఓడించటం ముఖ్యం. ఆ శక్తి టీఆర్ఎస్‌కే ఉన్నపుడు మద్దతు ఇవ్వడానికి కూడా అభ్యంతరం లేదు. కానీ వారి క్యాంపెయిన్‌లో అవసరమైనపుడు పాల్గొంటూనే సీపీఐ, సీపీఐ(ఎం) కలిసి వామపక్షాల స్వతంత్ర క్యాంపెయిన్ కూడా చేయాలి. వామపక్షాలు ప్రజలను పెద్దఎత్తున సమీకరించి, తమ వైఖరిని ప్రకటించాలి. బీజేపీని ఓడించే అవసరం ఓటర్లు గుర్తించే విధంగా వామపక్ష శ్రేణులు కదిలి ఉమ్మడి పట్టు పట్టాలి. ఈ విషయమే సీపీఐ నాయకత్వానికి కూడా తెలియజేసింది. ఏమేరకు వీలైతే ఆమేరకు వామపక్షాలు ఐక్యంగా ఈ కృషి సాగించాలి. బీజేపీని ఓడించాలి.

❃

# మౌర్య సామ్రాజ్యం : ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక పరిస్థితులు



రచయిత ప్రజాశక్తి మాజీ ఎడిటర్

**ఎం.వి.ఎస్.శర్మ**

మౌర్య సామ్రాజ్య భూభాగంలో అత్యధిక భాగం అటవీ ప్రాంతం. సామ్రాజ్యపు ఆధిపత్యం కిందకు రాకుండా ఉన్న సువిశాల ప్రాంతం మౌర్యుల ఆధిపత్యానికి సవాలుగా ఉండేది. అదే సమయంలో అటవీ సంపద రాజ్యానికి ఒక ముఖ్యమైన వనరుగా కూడా ఉండేది. బళ్ళు, రథాలు, నాగళ్ళు, తదితర పరికరాల తయారీకి గాని, గృహాల, కోటల నిర్మాణానికి గాని అవసరమైన కలప అంతా ఈ అడవులనుండే లభించేది. మెగస్తనీసు పేర్కొన్న ప్రకారం చూస్తే 14.8 కి.మీ. పొడవు, 2.8 కి.మీ. వెడల్పు తో, 64 ద్వారాలతో, 570 బురుజులతో పాటలీపుత్రం నగరానికి రక్షణగా కోట నిర్మించినట్టు ఉంది. ఇందులో కొంత అతిశయోక్తి ఉండవచ్చు కాని, ఎంత ఎక్కువ స్థాయిలో కలపను ఉపయోగించారో మనం ఊహించుకోవచ్చు. అడవులలో దొరికే వెదురు, తీగెలు బుట్టల తయారీలో, పరికరాల, ఆయుధాల తయారీలో ఉపయోగించారు. తాళ్ళు, పట్టాలు తయారు చేయడానికి అడవులలో చెట్ల బెరళ్ళు వాడేవారు. వైద్యానికి కావలసిన ఓషధులు, జంతువుల చర్మాలు కూడా ముఖ్యమైన సంపదగా ఉండేది.

ఏనుగులు అడవులలో విస్తారంగా సంచరించేవి. వాటిని పట్టి మచ్చిక చేసి సైన్యంలో గజ బలాన్ని పెంచుకునే పని ఒక ముఖ్యమైన కార్యక్రమంగా ఉండేది. దానికి తోడు ఏనుగు దంతాలు ఒక ముఖ్యమైన సంపదగా ఉపయోగపడేది.

అడవులు ముఖ్యమైన ఆదాయ వనరుగా ఉన్నప్పటికీ, మరోవైపు వ్యవసాయానికి అవసరమైన భూమి కోసం అడవులను ధ్వంసం చేయడం కూడా సాగేది. విచ్చలవిడిగా అడవులను ధ్వంసం చేయడాన్ని అశోకుడు నిషేధించినప్పటికీ, రాజ్య అవసరాలరీత్యా అడవులను నరకడానికి అనుమతించారు. రహదారుల నిర్మాణానికి ధ్వంసం అయిన అడవులను దృష్టిలో ఉంచుకుని, ఆ లోటును భర్తీ చేయడానికి బాటల వెంబడి చెట్లను పెంచడానికి పూనుకున్నారు.

### వ్యవసాయ సంబంధాలు

రాజ్య అవసరాల రీత్యా వ్యవసాయాన్ని ప్రోత్సహించారు. కొత్తగా భూములను సాగులోకి తీసుకువచ్చి వాటిలో శూద్ర కర్షకులను దింపారు. వారు ఆ వ్యవసాయంలో నిలదొక్కుకోడానికి కావలసిన పరికరాలు, పశువులు కొనుక్కోడానికి, పంట చేతికొచ్చేవరకూ జీవించడానికి రుణాలు ఇచ్చేవారు. భూమి మీద సాగు చేసే హక్కు ఆ రైతుకు సాగు చేస్తున్నంతకాలమూ ఉంటుంది. ఐతే భూమిపై అంతిమ యాజమాన్య హక్కు మాత్రం ప్రభువుకే ఉంటుంది. రైతు ఆ భూమిమీద పండిన పంటలో సగభాగం పన్ను చెల్లించాలి.

ఇదొక్కటే కాదు. దాసులు, కర్మకారులు (కూలీలు) కూడా వ్యవసాయంలో ఉన్నారు. ప్రభుత్వం విధించిన జుర్మానాలు చెల్లించడానికి స్థోమత లేనివాళ్ళను సాగుభూముల్లో పనుల్లో పెట్టి వారికి కుటుంబ పోషణ నిమిత్తం కొంత ధాన్యం, చాలా కొద్ది మొత్తంలో (నెలకు ఒకటింపావు పణాలు ఇవ్వాలని అర్థశాస్త్రంలో పేర్కొన్నారు) వేతనం చెల్లించేవారు. వారి పనిని పర్యవేక్షించేవాడు 'సీతాధ్యక్షుడు'. ('సీత' అనే పదాన్ని వ్యవసాయం అన్న అర్థంలో వాడారు) ఆ సీతాధ్యక్షులకు పంటలో నాలుగో వంతు గాని, ఐదో వంతు గాని లభించేది. ఐతే, కూలీల ఖర్చు ఆ పర్యవేక్షకులే భరించాలి.

బ్రాహ్మణులకు, కొందరు ఉన్నతాధికారులకు, చక్రవర్తి కొన్ని భూభాగాలను కానుకగా ప్రకటించేవాడు. అటువంటి భూములకు పన్ను మినహాయింపు కూడా ఇచ్చేవారు. ఆ విధమైన ప్రోత్సాహంతో భూములను పొందినవారు నిరుపయోగంగా ఉన్న భూములను సాగులోకి తెచ్చేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపేవారు.

భూ సంబంధాలలో గమనించ వలసిన ఒక ముఖ్యమైన అంశం ఏమంటే సాగులో ఉన్న వారిని అకారణంగా తొలగించే హక్కు ప్రభువుకు లేదు. తాను సాగు చేయడం, తన తదనంతరం తన వారసులు సాగు కొనసాగించడం తప్ప ఆ భూమిపై సాగు హక్కును మరొకరికి దఖలు పరిచే హక్కు గాని, అమ్ముకునే హక్కు గాని రైతుకు లేదు.

**పరికరాలు, సాధనాలు:** వ్యవసాయంలో భూములను దున్నేందుకు పశువులను వినియోగించారు. వాటికి కట్టిన కొయ్య నాగళ్ళ చివర ఇనుప కర్రులు ఉండేవి. ఇనుప కొడవళ్ళు ఉపయోగించారు. మోటబావుల ద్వారా పొలాలకు నీరందించే విధానం అమలులో ఉండేది.

బావులతో బాటు చెరువులు, చిన్న చిన్న డ్యాములు ఉండేవి. సాగునీరు అందించడానికి చెరువులను తవ్వించడం, ఆనకట్టలను నిర్మించడం ప్రభుత్వ బాధ్యతగా ఉండేది. ఆ ఆనకట్టల నుండి కాలువలద్వారా పొలాలకు నీరందించేవారు. కాలువలద్వారా సాగు చేసే రైతులనుండి నీటితీరువా వసూలు చేసేవారు.

**పంటలు:** వర్షాకాలంలో ఒక పంట, శీతాకాలంలో మరొక పంట పండించేవారు. వరి, రాగులు, అవిసె, జొన్నలు, నువ్వులు వానాకాలపు ప్రధాన పంటలు కాగా, గోధుమ, బార్లీ, పప్పుధాన్యాలు శీతాకాలపు ప్రధాన

**" వ్యవసాయం విస్తరిస్తున్నకొద్దీ కరువు, వర్షాభావం సమస్య కూడా రైతులను వెన్నాడుతూవుండేది. వర్షాలు సకాలంలో కురిసేదీ లేనిదీ జోస్యం చెప్పమని రైతులు జ్యోతిష్యులను ప్రధానంగా వేడుకునేవారు. వరుసగా రెండేళ్ళపాటు వర్షాలు కురవబోవన్న జోస్యం చెప్పిన తర్వాతనే చంద్రగుప్తుడు రాజ్యాధికారాన్ని వదులుకుని అడవులలోకి తపస్సు చేసుకోడానికి పోయాడని కొన్ని గాధలు తెలియజేస్తున్నాయి. "**





FIG. 3.3 Iron tools from Taxila: axe (no. 103); adze (no. 112); chisel (no. 118), knife (no. 122); tongs (no. 130); anvil (no. 143); nails (nos. 150a and b); hoes (nos. 183 and 184); Bhir Mound, Stratum II (except no. 112, which is from the lower Stratum III). (Reprod. J. Marshall)

**తక్షశిల లో మౌర్యుల కాలంనాటి పరికరాలు, ఆయుధ భాగాలు**

పంటలుగా ఉండేవి. దాదాపు ఇరవై రకాల పంటలను సాగు చేసినట్టు అర్థశాస్త్రం పేర్కొంది.

చెరకు పంట సాగు ఒక పెద్ద సవాలుగా ఉండేదని, ఐతే దానిద్వారా ఆదాయం కూడా బాగా ఉండేదని తెలుస్తోంది. మిరియాల సాగు కూడా మొదలుపెట్టారు.

ఇక పత్తి ఒక పంటగా సాగు చేయడం ఆనాటికి ఇంకా మొదలు కాలేదు. అడవులలో పెరిగిన పత్తి చెట్లనుండి పత్తిని సేకరించడం ఒక వ్యాపకంగా ఉండేది. కొన్ని చోట్ల ఆ పత్తి చెట్లను పెంచడం కూడా జరిగేది. విత్తులు నాటి పత్తిని ఏటేటా సాగు చేయడం అప్పటికి మొదలుకాలేదు. నీలిమందు మొక్కల పెంపకం అప్పుడే మొదలైంది. పండ్ల తోటల పెంపకం విస్తారంగా జరిగేది. ప్రధానంగా ఔషధమొక్కల తోటలను, పండ్ల తోటలను, ద్రాక్ష తోటలను చక్రవర్తికి చెందిన భూముల్లో సాగించేవారు.

వ్యవసాయం విస్తరిస్తున్నకొద్దీ కరువు, వర్షాభావం సమస్య కూడా రైతులను వెన్నాడుతూవుండేది. వర్షాలు సకాలంలో కురిసేదీ లేనిదీ జోస్యం చెప్పమని రైతులు జ్యోతిష్యులను ప్రధానంగా వేడుకునేవారు. వరుసగా రెండేళ్ళపాటు వర్షాలు కురవబోవన్న జోస్యం చెప్పిన తర్వాతనే చంద్రగుప్తుడు రాజ్యాధికారాన్ని వదులుకుని అడవులలోకి తపస్సు చేసుకోడానికి పోయాడని కొన్ని గాధలు తెలియజేస్తున్నాయి.

వ్యవసాయం తర్వాత ముఖ్యమైన వనరు పశుసంపద. పశుపోషణ, బళ్ళు, నాగళ్ళు లాగడానికి కావలసిన పశువులను సరఫరా చేయడం పశుపాలకుల వృత్తి. సైనిక వృత్తి, వ్యవసాయం తర్వాత మూడో ముఖ్యమైన వృత్తిగా పశుపోషణ ఉండేదని మెగస్తనీసు పేర్కొన్నాడు. గొర్రెల, మేకల మందలను, ఆవుల, బర్రెల మందలను పెంచడం ప్రధానంగా ఉండేది. అదనంగా పందుల పెంపకం కూడా ఉండేది. ఈ మందలను పెంచేవారు అటు అడవికి, ఇటు గ్రామానికి మధ్యలో ఉండే భూభాగంలో ఉండేవారు. పశువుల మేతకు కావలసిన విస్తారమైన పచ్చికబయళ్ళు అందుబాటులో ఉండేవి. సమీపంలోని అడవులలోని పశువులను కూడా పట్టి తెచ్చి మచ్చిక చేయడం పశుపాలకుల వ్యాపకంలో భాగంగా ఉండేది.

ప్రభువు ఆధీనంలో పెద్ద సంఖ్యలో పశువుల మందలు ఉండేవి. వీటిని సంరక్షించడానికి 'గోపాలులను' నియమించేవారు. సుమారు 100 గోవులు ఒక్కో గోపాలుడికీ బాధ్యతగా అప్పజెప్పారు. గోపాలులమీద పర్యవేక్షణ బాధ్యత 'గో అధ్యక్షుడి' ది. ప్రభువుకు చెందిన పశువులను ప్రత్యేకంగా గుర్తించడానికి వీలుగా వాటి శరీరాలపై ముద్రలు వేసేవారు.

కోళ్ళ పెంపకం అక్కడక్కడా మొదలైన దాఖలాలే తప్ప విస్తారంగా జరిగినట్టు లేదు. నెమళ్ళ, జింకల మాంసం విలాసవంతమైన భోజనంలో భాగంగా పరిగణించబడేది.

ఇతర చేతివృత్తులలో కుమ్మరులు నాణ్యమైన మట్టి పాత్రల తయారీలో నైపుణ్యాన్ని కలిగివుండేవారు. దృఢంగా ఉండి మెరుగుపెట్టిన మట్టి పాత్రలను తయారు చేయడం (నార్తరన్ బ్లాక్ పాలిష్డ్ వేర్), ఎరుపు రంగులో ఉండి వాటిపై చిత్రాలను ముద్రించిన పాత్రలను తయారు చేయడం బట్టి అప్పటికే భారత ఉపఖండంలో వివిధ ప్రాంతాలలో అభివృద్ధి చెందిన సాంకేతిక నిపుణుల పరిజ్ఞానాన్ని మౌర్యుల కాలంలో ఒకదగ్గరకు చేర్చినట్టు, తద్వారా మరింత అభివృద్ధి సాధించినట్టు తెలుస్తోంది.

వ్యవసాయంలో ఇనుప పనిముట్ల వినియోగం పెరుగుతున్న రీత్యా కమ్మరి వృత్తిదారులకు, విస్తారంగా కలప వినియోగం జరుగుతున్న కారణంగా వడ్రంగులకు, బుట్టలు, చాపలు అల్లే మేదరులకు, పీచుతో పట్టాలు అల్లేవారికి ఆదరణ ఎక్కువగా ఉండేది. పశుపాలకుల తర్వాత ప్రాధాన్యత చేతివృత్తులవారికి ఉండేది.

పత్తి ఒక వార్షిక పంటగా ఇంకా ఉనికిలోకి రానందువలన దుస్తుల తయారీకి అదొక్కటే ముడిసరుకుగా ఉండే స్థితి లేదు. పత్తితోబాటు ఉన్ని, పట్టు, నార నుండి దారాలు




FIG. 3.4 Ashokan pillar hauled by means of rope and capstan from ground on to a ten-wheel cart. Diagram in Sīrat-i Firozshāhī MS. (Courtesy: Khuda Bakhsh Oriental Public Library, Patna.) There are ten other diagrams in the same manuscript, illustrating its account of transport of the pillar from Topra to Delhi, fourteenth century.

**అశోకుడి రాతి స్తంభాన్ని తాళ్ళతో 10 చక్రాల బండి పైకి ఎక్కిస్తున్న చిత్రం**

పేని దుస్తులు తయారు చేసేవారు. దారాన్ని వడకడం ప్రధానంగా మహిళలది. ముఖ్యంగా నిరాధారులైన మహిళలు– వితంతువులు, ఒంటరి మహిళలు, వృద్ధులు, వేశ్యమాతలు వంటివారిని ఈ పనిలో నియోగించేవారు.

గాజులు, హారాలు వంటి ఆభరణాలను. రంగురాళ్ళను, గవ్వలను, శంఖాలను,


ముత్యాలను, పగడాలను ఉపయోగించి తయారు చేసేవారు. ఈ వ్యాపకం ప్రధానంగా తక్షశిల ప్రాంతంలో ఎక్కువగా సాగేది.

**ఖనిజాలు:** రాతిఉప్పును గనులనుండి వెలికి తీయడం ప్రధానంగా వాయవ్య పంజాబ్ ప్రాంతంలో సాగేది. కెంపులు, ఇతర రంగురాళ్ళు తక్షశిల, గుజరాత్ ప్రాంతాలలో తవ్వి తీసేవారు. తూత్తుకుడి తీర ప్రాంతంలో ముత్యాలు సేకరించేవారు. ఆరావళి పర్వతాల ప్రాంతాల్లోను, కర్ణాటక లోను బంగారు గనులలో తవ్వకాలు ఆ కాలంలో జరిగాయి. రాగి, సీసం, తుత్తునాగం (జింకు) ఎక్కువగా ఉండే ముడిఖనిజాలను తవ్వితీసేవారు. రాగితో చేసిన పాత్రలతో, పరికరాలతోబాటు, ఇత్తడి, కంచు వంటి మిశ్రమ లోహాల పాత్రలను, పరికరాలను తయారు చేసేవారు. అన్ని లోహాలకన్నా ఎక్కువగా వినియోగించినది మాత్రం ఇనుము. మన దేశంలోఎక్కువ ప్రాంతాలలో ఇనుప ఖనిజం భూమి ఉపరితలానికి బాగా దగ్గరగా లభించడం, అడవులనుండి బొగ్గు కావలసినంత లభించడం వలన ఎక్కువ నాణ్యత కలిగిన ఇనుము తయారీ జరిగేది. వివిధ రకాల ఆయుధాలను, పనిముట్లను ఇనుముతో తయారు చేసేవారు.

**నిర్మాణరంగం:** సింధు నాగరికత కాలంలో లభించిన ఇటుకలు – అంటే బట్టీలలో కాల్చిన ఇటుకలు– ఆ తర్వాత కాలంలో కనిపించకుండా పోయాయి. బహుశా వాటి తయారీ విధానం ఆ నాగరికతకు చెందిన ప్రజలతోపాటే అదృశ్యమైవుండాలి. మళ్ళీ ఆ తరహాలో ఇటుకలను బట్టీలలో కాల్చి తయారు చేసే పద్ధతి మౌర్యుల కాలంలో, అంటే 1500 సంవత్సరాల తర్వాత మనం చూస్తాం.

అంతే కాక పాటలీపుత్రం ప్రాంతంలో ఒక పెద్ద హాలు నిర్మించిన దాఖలాలు ఈ మధ్య (1963–65) బైటపడ్డాయి. నునుపు చేసిన ఎర్రరాయి స్తంభాలు దాదాపు 10 మీటర్ల పొడవు, 7 మీటర్ల ఎత్తు ఉన్నవి లభించాయి. వీటి సంఖ్య 84. ఇంత భారీ రాళ్ళను తవ్వి, వాటిని చెక్కి, వందల కిలో మీటర్ల దూరంలో ఉన్న ప్రాంతానికి చేర్చి నిలబెట్టడానికి ఎంత మానవ శ్రమ వెచ్చించివుండాలి? అది ఊహించుకుంటే ఆశ్చర్యం కలుగుతుంది. ఆ సాంకేతికతను మౌర్య కాలంలో పెంపొందించారు కనుకనే సువిశాల మౌర్యసామ్రాజ్యంలో నలుమూలలా అశోకుడి శిలా శాసనాలు పాతించగలిగారు.

**“ సింధు నాగరికత కాలంలో లభించిన ఇటుకలు - అంటే బట్టీలలో కాల్చిన ఇటుకలు- ఆ తర్వాత కాలంలో కనిపించకుండా పోయాయి. బహుశా వాటి తయారీ విధానం ఆ నాగరికతకు చెందిన ప్రజలతోపాటే అదృశ్యమై వుండాలి. మళ్ళీ ఆ తరహాలో ఇటుకలను బట్టీలలో కాల్చి తయారు చేసే పద్ధతి మౌర్యుల కాలంలో, అంటే 1500 సంవత్సరాల తర్వాత మనం చూస్తాం. ”**




మౌర్యుల కాలంలో ముద్రించిన నాణేలు

అవి మనకు నేడు విలువైన చారిత్రిక ఆధారాలుగా నిలిచివున్నాయి.

ఆ నాటి శిల్పుల నిర్మాణ సామర్థ్యం ఆధారంగా పాటలీపుత్రమే కాకుండా తక్షశిల, ఉజ్జయిని, కౌశాంబి, తోశాలి, సామప, సువర్ణగిరి, మధుర, శ్రావస్తి, వారణాసి, కాందహార్, అహిచ్చత్ర (యు.పి.) వంటి నగరాలు నిర్మాణం అయ్యాయి. 240 హెక్టార్ల విస్తీర్ణం ఉన్న పాటలీపుత్రం మొదలు, కనిష్టంగా 20 హెక్టార్ల విస్తీర్ణం ఉన్న కపిలవస్తు వరకు ఈ నగరాలు విస్తరించాయి. ఆ విస్తీర్ణం ఆధారంగా జనాభాను అంచనా వేస్తే పాటలీపుత్రంలో 1,40,000 జనాభా ఉంటే, కపిలవస్తులో 8000 వరకూ జనాభా ఉండివుండవచ్చు. ఈ పట్టణాలు ప్రధానంగా వ్యాపారానికి కేంద్రాలుగా ఉండేవి. వీటిచుట్టూ ఉన్న గ్రామాలు నగరాల ఆహార అవసరాలను తీర్చేవిగా ఉండేవి. వివిధ ప్రాంతాలమధ్య వ్యాపారం ప్రధానంగా రహదారుల గుండా సాగేది. అదేవిధంగా సముద్ర తీరం వెంబడి సుదూర ప్రాంతాలకు సరుకుల రవాణా జరిగేది. రేవు పట్టణాలకు, నగరాలకు మధ్య రహదారుల నిర్మాణం ఉంది.

ఇంత పరిమాణంలో వ్యాపారం జరిగింది అంటే నగదు వినియోగం అనివార్యం. దానితోబాటు బ్యాంకింగ్ వ్యవస్థ కూడా ఉండివుండాలి. నాణేల ముద్రణ మౌర్య కాలంలో జరిగిన ఆధారాలు, ఆ నాణేలను బ్యాంకర్లు ధృవీకరించిన ఆధారాలు, రుణాల లావాదేవీలు ఆ కాలంలో జరిగాయి. వడ్డీ వసూలు చేసిన ఆధారాలు ఉన్నాయి. గ్యారంటీ ఎక్కువగా ఉన్న రుణాలకు 1.25 శాతం, వ్యాపార రుణానికి 5 శాతం, అడవులలో, గనుల తవ్వకాలలో ఉన్న వారికి 10 శాతం, సముద్ర యానం ద్వారా వ్యాపారం చేసేవారికి 20 శాతం చొప్పున వడ్డీ వసూలు చేయాలని అర్థశాస్త్రం పేర్కొంది. వ్యవసాయ రుణాలకు ఇచ్చిన అప్పులో వడ్డీకింద సగం జమ కట్టుకోవచ్చునని పేర్కొంది. అంటే వడ్డీల పేరుతో ప్రజానీకాన్ని విపరీతంగా పీడించేవారని స్పష్టం ఔతోంది.

**(మౌర్య సమాజం, సంస్కృతి గురించి తరువాయి వ్యాసంలో)**

జాతీయ పరిణామాలు

# ఉచితాల పేరుతో సంక్షేమ పథకాలపై బిజెపి దాడి

ఎ.కోటిరెడ్డి



రచయిత మార్క్సిస్టు పత్రిక బాధ్యులు

దేశ, విదేశీ పెట్టుబడిదారులకు అత్యధిక లాభాలను అందించటం కోసం ప్రజల జీవితాలకు సంబంధించిన ప్రతి రంగంపై నా బిజెపి ప్రభుత్వం ఒక పథకం ప్రకారం దాడిచేస్తున్నది. ఆ పార్టీ నాయకత్వం ఇపుడు ప్రజలు పోరాడి సాధించుకున్న సంక్షేమ పథకాలపై దాడిని ప్రారంభించింది. ఉచితాలతో ఓటర్లను ఆకర్షిస్తున్న రాజకీయ పార్టీలపై క్రిమినల్ కేసులు బనాయించాలని, ఈ విషయంలో తగిన మార్గదర్శకాలను ఇవ్వాలని కోరుతూ బిజెపి నాయకుడు ఉపాధ్యాయ సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశాడు. రాజకీయ పార్టీలు ప్రకటిస్తున్న ఉచితాలు, ప్రభుత్వాలు అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు ఒకటి కాదని సుప్రీంకోర్టు ధర్మాసనానికి నాయకత్వం వహిస్తున్న ప్రధాన న్యాయమూర్తి ఎన్ వి రమణ ఈ సందర్భంగా వ్యాఖ్యానించాడు. ఈ కేసులో తమను కూడా భాగస్వాములను చేయాలని కోరుతూ డి ఎం కె దాఖలు చేసిన పిటీషన్‌లో సామాజిక సమానత్వాన్ని, ఆర్థికన్యాయాన్ని అందించటం కోసం అమలు జరుపుతున్న సంక్షేమ పథకాలను ఉచితాలని పిలువరాదని పేర్కొంది.

ప్రభుత్వరంగ సంస్థలు, బ్యాంకులు, భూములు, అడవులు, గనులు, నదులు, సముద్రాలతో పాటు సమస్తాన్ని కార్పొరేట్లకు కట్టబెడుతున్న బిజెపి ప్రభుత్వం ఇపుడు అమలు జరుపుతున్న సంక్షేమ పథకాలను రద్దుచేసి, ఆ మొత్తాన్ని కూడా వారికే అందించటానికి రంగం సిద్ధం చేస్తున్నది. కార్పొరేట్ సంస్థలు ప్రతి సంవత్సరం బ్యాంకులకు ఎగ్గొడుతున్న లక్షల కోట్ల రూపాయల రుణాలను బిజెపి ప్రభుత్వం రద్దు చేస్తుండగా, మరోవైపున ఆ పార్టీ నాయకులు సామాన్యప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలపై కత్తికట్టారు. దీని పరిణామాలు స్పష్టమే. పేదలు, సామాన్యప్రజలను మరింతగా పీక్కుతింటూ, శతకోటీశ్వరుల సంపదలను ఇబ్బడిముబ్బడిగా పెంచటమే వారి లక్ష్యం. దీనివెనుక మరొక అంశం కూడా ఉన్నది. తమ హిందుత్వ విధానాలను సమాజం మీద రుద్దాలంటే, కులవ్యవస్థను పటిష్ఠం చేసి, మనుస్మృతిలో ప్రవచించిన చాతుర్వర్ణ వ్యవస్థకు అనుగుణంగా సమాజాన్ని నడపాలంటే దిగువకులాలలోని(ఇపుడు అగ్రకులాలుగా చెప్పుకుంటున్న అన్ని శూద్రకులాలు) వారు ఆర్థికంగా స్వయం సమృద్ధితో ఉండకూడదు. దరిద్రంలో అలమటిస్తుండాలి. అపుడు హిందుత్వ విధానాలను అమలుచేయటం, బ్రాహ్మణాధిపత్యాన్ని రుద్దటం సులువౌతుంది. ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ, బ్యాంకుల విలీనం, ప్రైవేటీకరణ, రిజర్వేషన్ల రద్దు గురించి తరచుగా చర్చ లేవదీయటం తదితరాలలో పెట్టుబడిదారుల ప్రయోజనాలతో పాటు హిందు మతోన్మాదుల ప్రయోజనాలు కూడా ఉన్నాయి. అందువలననే కార్పొరేట్-హిందుత్వ శక్తులు కలిసి ప్రయాణం సాగిస్తున్నాయి. కార్మిక-కర్షక వర్గాలు ఇతర పీడిత ప్రజలతో కలిసి ఐక్య పోరాటాలు చేయటం ద్వారానే ఈ దుష్టకూటమి ఆటలు కట్టించటం సాధ్యమౌతుంది.

### లేబర్‌కోడ్‌ల అమలుకు సమావేశం

భారతదేశ కార్మికులు సంవత్సరాల తరబడి పోరాడి సాధించుకున్న కార్మికచట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిన బిజెపి ప్రభుత్వం కార్మికుల హక్కులను హరించటం తెలిసిందే. కాని బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్‌కోడ్‌ల పట్ల కార్మికవర్గంలో తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తం కావటంతో అమలుకు వెనుకాడి, తాత్కాలికంగా వాయిదా వేసింది. ఇపుడు తిరిగి వాటిని అమలుచేయించటం కోసం ప్రయత్నం చేస్తున్నది. అందులో భాగంగానే ఆగస్టు 25-26 తేదీలలో తిరుపతిలో రాష్ట్రాల కార్మికమంత్రులు, అధికారులతో సమావేశం జరిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, ఆ పార్టీ నాయకత్వం పట్టుపట్టి ఈ చట్ట సవరణలు చేయిస్తున్నప్పటికీ ఆ పార్టీ పాలిస్తున్న రాష్ట్రాలైన యుపి, ఉత్తరాఖండ్‌ల కార్మికమంత్రులు ఈ సమావేశానికి హాజరు కాలేదు. లెఫ్టినెంట్ గవర్నర్ ద్వారా పరోక్షంగా అధికారం చెలాయిస్తున్న జమ్మూ-కాశ్మీర్ కార్మికశాఖ ప్రతినిధులు కూడా హాజరు కాలేదు. అంటే కార్మికచట్టాల పట్ల కార్మికులలో ఉన్న వ్యతిరేకతతో పాటు, వాటి అమలుకు కాంగ్రెస్, ఇతర ప్రాంతీయ పార్టీల ప్రభుత్వాలతో పాటు బిజెపి కూడా ఎంత భయపడుతున్నదో ఈ ఘటన వెల్లడిస్తున్నది.

బిజెపితో పాటు ఇతర పార్టీల ప్రభుత్వాలు కూడా లేబర్‌కోడ్‌లను అమలు జరపటానికి భయపడుతుండగా బిజెపి విధానాలను అత్యంత విధేయంగా అమలు జరుపుతున్న ఆంధ్రప్రదేశ్ లోని వైసిపి ప్రభుత్వం ఈ విషయంలో కూడా ముందంజలోనే ఉన్నది. ఈ చట్టాల అమలు కోసం నిర్ణయం తీసుకోబోతున్న సమావేశానికి తిరుపతిలో ఆతిధ్యం ఇచ్చింది. సమావేశం ప్రారంభమైన 25వ తేదీన కార్మికసంఘాల ఆధ్వర్యంలో కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసనలపై ప్రభుత్వం నిర్బంధం ప్రయోగించింది. ఆ రోజు వందలాది మంది కార్మికులను అరెస్టు చేయటంతో పాటు ముందేరోజే అనేకమంది నాయకులను అరెస్టు చేశారు. మొత్తంగా చూసినపుడు లేబర్‌కోడ్‌లను అమలుచేయటం కోసం రాష్ట్ర ప్రభుత్వం వేగంగా ముందుకుపోతున్నదని స్పష్టమౌతున్నది. రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత బిజెపి నాయకుల దయకోసం పాకులాడుతూ కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక చట్టాలను అన్ని రాష్ట్రాల కన్నా ముందే రాష్ట్రంలో అమలుచేస్తున్నది. రాష్ట్ర ప్రయోజనాలను గాలికొదిలేసి, స్వప్రయోజనాల కోసం ఆ పార్టీ నాయకులు పాకులాడుతున్నారు. చట్ట ప్రకారం కేంద్రం నుండి రావటసిన నిధులు, హక్కుల కోసం దేబిరిస్తూ, ప్రజలపై భారాలు వేయటం, ఉద్యమాలపై నిర్బంధం ప్రయోగించటంలో ముందెత్తున ఉంటున్నారు. నూతన విద్యా విధానం, వ్యవసాయ మోటార్లకు విద్యుత్ మీటర్లను బిగించటంలో వలెనే లేబర్‌కోడ్‌ల అమలులో కూడా వైసిపి ప్రభుత్వం ముందుంటున్నది. ఒకవైపున పేదలను ఉద్ధరించటానికి సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నామని, తాము అమలుచేసినంత విస్తారంగా ఏ రాష్ట్రంలోనూ అమలుచేయటం లేదని గప్పాలు కొట్టుకుంటున్న వైసిపి ప్రభుత్వం మరోవైపున కార్మికులు పోరాడి

సాధించుకున్న హక్కులను హరించటంలో బిజెపిని మించిపోతున్నది. నూతన విద్యావిధానం, వ్యవసాయ విద్యుత్ మోటార్లకు మీటర్లు బిగించటం, పే రివిజన్ సందర్భంలో ఉద్యోగసంఘాలతో వ్యవహరించిన తీరు, గత సాంప్రదాయాలకు భిన్నంగా విద్యుత్ ఉద్యోగులకు వేతన సవరణ కోసం వారికి సంబంధం లేనివారితో కమిటీని నియమించటం, కమిటీకి నివేదించిన అంశాలలో వేతనాలు తగ్గించటానికి ఉన్న అవకాశాలను కూడా పరిశీలించాలని పేర్కొనటం, తమ సమస్యలపై పోరాటాలు చేస్తున్న అంగన్‌వాడి, మునిసిపల్ కార్మికులు, గ్రామ వలంటీర్లు, వివిధ రంగాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు, క్యాజువల్ కార్మికులు, ఉద్యోగుల పట్ల వ్యవహరిస్తున్న తీరు వారు పోరాడి సాధించుకున్న హక్కులను హరించి, బిచ్చగాళ్ళకు విదిలించినట్లుగా తాము ఏమిస్తే దానితో సంతృప్తి పడివుండాలని చెప్పకనే చెబుతున్నది. ధాన్యంతో పాటు ఇతర పంటలకు మద్దతుధరలు ఇచ్చి రైతాంగం నుండి కొనుగోలు చేయకపోవటం, కౌలురైతులకు రుణాలివ్వకుండా కాలం గడపటం తదితరాలన్నింటిలోనూ రైతుల ప్రయోజనాలను పక్కన పెట్టి, బడా వ్యాపారుల ప్రయోజనాలకు అనుగుణంగా వ్యవహరిస్తున్నది. మరోవైపున చెత్తపన్ను విధించటం, భూముల విలువ, విద్యుత్ ఛార్జీలు పెంచటం, కేంద్ర ప్రభుత్వం ప్రజలపై వేస్తున్న పన్నుల భారాలను మాటమాత్రంగా కూడా వ్యతిరేకించకపోవటం తదితరాలన్నీ ఈ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పోకడలను తెలుపుతున్నాయి. ఇన్నీ ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ కూడా కొందరు వైసిపి నాయకులు రానున్న 25 సంవత్సరాల పాటు రాష్ట్రంలో తామే అధికారంలో ఉంటామని ప్రగల్భాలు పలుకుతున్నారు. పొరపాటున ప్రజాస్వామ్య వ్యవస్థ ఏర్పడిన రాష్ట్రంలో దానిని సరిదిద్ది, తిరిగి "మహారాజు", పాలనను ప్రవేశపెట్టటం తమ కర్తవ్యం అని, దానిని అమలు చేయాల్సిన బాధ్యత తనదేనని ఆ పార్టి అధినాయకుడు "భ్రమ" ల్లో ఉన్నట్లుగా ఉంది. ప్రతిపక్షాలు బలహీనంగా ఉన్న పరిస్థితులు, మండల, జిల్లా పరిషత్, గ్రామ పంచాయితీలు, మునిసిపాలిటీలకు జరిగిన ఎన్నికలలో వివిధ అక్రమ పద్ధతులు అనుసరించటం ద్వారా సాధించిన విజయాల ధీమాతో కూడా ఉండి ఉండవచ్చు. వారు ఒకసారి ఆంధ్రప్రదేశ్, భారతదేశ చరిత్రలను తెలుసుకోవటం మంచిది. తమకు ఎదురులేదని విర్రవీగిన వారిని ప్రత్యామ్నాయ శక్తులను ముందుకుతెచ్చిన ప్రజలు ఏ విధంగా ఇళ్ళకు పంపారో వారికి అర్థమౌతుంది. రాష్ట్ర ప్రజలు ఆ పాఠం తమకు నేర్పకుండా ఉండాలంటే కార్మిక, ఉద్యోగ, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడి, ప్రజానుకూల విధానాలను అమలుచేయాలి. అపుడు మాత్రమే ప్రజలలో వారికి స్థానం ఉంటుంది. వైసిపి ప్రభుత్వం ఆ మాత్రం వివేకం ప్రదర్శించాలని ప్రజలు ఆశించటం అత్యాశ అవుతుందా లేదా అనేది రానున్న పరిణామాలు స్పష్టం చేస్తాయి.

> **"15 సంవత్సరాల నాడు విద్యుత్ కొని, అమ్మగా వచ్చిన నష్టాలను ఇపుడు ప్రజల నుండి వసూలు చేసుకుంటామని ప్రతిపాదించటం ఏ వ్యాపారనీతి? నియంత్రణ మండళ్ళు వాటిని విచారణకు స్వీకరించి ప్రజల అభిప్రాయాలు చెప్పమని కోరటం ఏమిటి? వ్యాపారం పేరుతో బడా పెట్టుబడిదారులకు ప్రజల ఆదాయాల తరలింపును గ్యారంటీ చేయటానికి మాత్రమే ఈ విధానం ఉద్దేశించబడింది."**

### ట్రూ అప్ ఛార్జీల నాటకం: ప్రైవేట్ విద్యుత్ సంస్థలు వ్యాపారం చేయవా?

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో విద్యుత్ పంపిణి సంస్థలు గతంలో అధికధరలకు కొనుగోలు చేసిన విద్యుత్‌ను వినియోగదారులకు తక్కువ ధరలకు సరఫరా చేయటం వలన వచ్చిన నష్టాలను పూడ్చుకోవటం కోసం ట్రూ అప్ ఛార్జీలను వసూలు చేసుకుంటామని ఆయా రాష్ట్రాల విద్యుత్ నియంత్రణ మండళ్ళను కోరాయి. ఆంధ్రప్రదేశ్‌లోని పంపిణి సంస్థలు 2014-19 మధ్యకాలంలో విద్యుత్ కొనుగోలు, అమ్మకం మధ్య వ్యత్యాసం 2900 కోట్ల రూపాయలను వసూలు చేసుకోవటానికి ఈఆర్‌సి ఇంతకు ముందే అనుమతించింది. ఇపుడు 2022 జనవరి నుండి మార్చి వరకు సరఫరా చేసిన విద్యుత్ ధరలలో వ్యత్యాసం 1049 కోట్ల రూపాయలు వసూలు చేసుకోవటానికి అనుమతించాలని ఈఆర్‌సిని కోరాయి. తెలంగాణలోని పంపిణి సంస్థలు ఏకంగా 2006-07 నుండి 2020-21 వరకు 15 సంవత్సరాల కాలానికి గానూ 4092 కోట్ల రూపాయలు వసూలు చేసుకోవటానికి అనుమతించాలని కోరాయి. ఉభయ తెలుగు రాష్ట్రాలలోని విద్యుత్ పంపిణి సంస్థలు ఈ విధంగా దశాబ్దంకు పైగా గడచవన కాలానికి ట్రూ అప్ ఛార్జీలను వసూలు చేసుకుంటామని డిమాండ్ చేస్తుంటే విద్యుత్‌రంగ ప్రైవేటీకరణ విధానాలను సమర్ధించేవారు సైతం తెల్లముఖాలు వేస్తున్నారు. ప్రపంచబ్యాంకు వత్తిడితో విద్యుత్ సంస్కరణలు ప్రారంభించిన నాడు చట్టంలో పొందుపరచిన ట్రూ అప్ ఛార్జీల భారం ఏమిటనేది ఆనాడు చాలామంది విద్యుత్ రంగ నిపుణులకు కూడా అర్ధం కాలేదు. ఇపుడు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ విద్యుత్ పంపిణి సంస్థల ప్రతిపాదనలతో వాటి ప్రమాదాన్ని ఇపుడు సామాన్య ప్రజలకు కూడా అర్ధం చేసుకుంటున్నారు.

ట్రూ అప్ ఛార్జీల వివరాలలోకి వెళ్ళేముందు ప్రపంచబ్యాంకు ప్రవచిత విద్యుత్‌రంగ సంస్కరణలు ప్రారంభించే నాడు విద్యుత్‌రంగాన్ని ప్రైవేటీకరణ, వ్యాపారీకరణ చేయటం ద్వారా పోటీ పెరిగి, ధరలు తగ్గుతాయని, ప్రజలకు తక్కువ ధరకు విద్యుత్ లభిస్తుందని చెప్పారు. మరి 15 సంవత్సరాల నాడు విద్యుత్ కొని, అమ్మగా వచ్చిన నష్టాలను ఇపుడు ప్రజల నుండి వసూలు చేసుకుంటామని ప్రతిపాదించటం ఏ వ్యాపారనీతి? నియంత్రణ మండళ్ళు వాటిని విచారణకు స్వీకరించి ప్రజల అభిప్రాయాలు చెప్పమని కోరటం ఏమిటి? 15 సంవత్సరాల నాడు వచ్చిన నష్టాలను ఇపుడు వసూలు చేసుకోవటానికి అవకాశం ఇస్తే అదెలా వ్యాపారం అవుతుంది? వ్యాపారం అన్న తర్వాత లాభనష్టాలు సహజం. చేసిన వ్యాపారంలో వచ్చిన నష్టాలను తిరిగి వసూలు చేసుకుంటామనటం, అందుకు అవకాశం ఇవ్వటం ఎటువంటి వ్యాపార సూత్రాలకూ అందనిది. వ్యాపారం పేరుతో బడా పెట్టుబడి దారులకు ప్రజల ఆదాయాల తరలింపును గ్యారంటీ చేయటానికి మాత్రమే ఈ విధానం ఉద్దేశించబడింది.

ఈ ట్రూ అప్ విధానంలో ఇంకా చాలా ప్రమాదాలు ఉన్నాయి. ఇప్పటి వరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ విద్యుత్ పంపిణి సంస్థలు కార్పొరేషన్‌లుగా మరినా ఆయా ప్రభుత్వాల యాజమాన్యంలోనే నడుస్తున్నాయి. ప్రైవేటు సంస్థల యాజమాన్యంలోకి పోలేదు. ప్రైవేటు యాజమాన్యంలోకి వెళ్ళకముందే ఈ విధంగా అదనపు ఛార్జీల వసూలు కోసం అర్రులు చాస్తున్నాయి. ఇక పంపిణి సంస్థలు ప్రైవేటు వారి చేతుల్లోకి వెళితే పరిస్థితి ఏమిటి? ప్రైవేటు వారికి విద్యుత్ కొనుగోలు-అమ్మకాలలో లాభాలు వచ్చినా నష్టాలొచ్చాయనే పేరుతో పదేపదే అదనపు ఛార్జీల వసూలుకు పూనుకుంటారు. దానితో ఈ భారం ప్రజలు భరించలేని స్థాయికి చేరుతుంది.

> **"పెగాసస్ గూఢచర్య పరికరాల ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్ష నాయకులు, న్యాయమూర్తులు, ఎన్‌జిఒలు, సామాజిక కార్యకర్తల ఫోన్లపై నిఘా వేసిందన్న ఆరోపణలపై విచారణ కోసం సుప్రీంకోర్టు నియమించిన సాంకేతిక నిపుణుల కమిటీకి కేంద్ర ప్రభుత్వం సహకరించలేదని సుప్రీంకోర్టు ప్రకటించింది. కమిటీకి సహాయ నిరాకరణతో ఈ ఆరోపణలు వాస్తవమేనని కేంద్ర ప్రభుత్వం అంగీకరించి నట్లయింది."**

ప్రస్తుతం ఇది విద్యుత్‌రంగానికి మాత్రమే పరిమితమైనప్పటికీ, కేంద్ర ప్రభుత్వం అన్ని రంగాలను ప్రైవేటీకరణ చేస్తానని ప్రకటించింది. ప్రైవేటీకరణతో పాటు ప్రతిరంగంలోనూ రెగ్యులేటరి కమిషన్‌లు కూడా ఏర్పాటవుతాయి. వాటిని ఆసరాగా చేసుకొని పెట్టుబడిదారులు, కాంట్రాక్టర్లు అధికఛార్జీలను నిర్ణయింపజేయటంతో పాటు ట్రూ అప్ ఛార్జీల విధానాన్ని కూడా అమలు చేస్తారు. అపుడు ప్రజలు నిలువుదోపిళ్ళు ఇచ్చుకోవటానికి తిరుపతికి వెళ్ళాల్సిన పని ఉండదు. తమ గ్రామాలు/పట్టణాలు, తామున్న చోటే నిలువుదోపిడీ చేయబడతారు. ఒకవేళ వెంకన్నకు మొక్కుకున్నా ఇవ్వటానికి ఏమీ మిగలదు. కాబట్టి ప్రజలు రానున్న ప్రమాదాన్ని గమనించి, ట్రూ అప్ ఛార్జీలతో పాటు విద్యుత్ చట్ట సవరణలు, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా పోరాడటం ద్వారా తమ ప్రయోజనాలను కాపాడుకోవటానికి సన్నద్ధం కావాలి.

### పెగాసస్ స్పైవేర్‌పై దర్యాప్తుకు సహకరించని కేంద్ర ప్రభుత్వం

పెగాసస్ గూఢచర్య పరికరాల ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్షనాయకులు, న్యాయమూర్తులు, ఎన్‌జిఒలు, సామాజిక కార్యకర్తల ఫోన్లపై నిఘా వేసిందన్న ఆరోపణలపై విచారణ కోసం సుప్రీంకోర్టు నియమించిన సాంకేతిక నిపుణుల కమిటీకి కేంద్ర ప్రభుత్వం సహకరించలేదని సుప్రీంకోర్టు ప్రకటించింది. కమిటీకి సహాయ నిరాకరణతో ఈ ఆరోపణలు వాస్తవమేనని కేంద్ర ప్రభుత్వం అంగీకరించినట్లయింది. పైగా సాంకేతిక నిపుణుల కమిటీకి ప్రభుత్వం అందజేసిన 29 ఫోన్లలోని ఐదుఫోన్లలో కొన్ని మాల్‌వేర్స్ కనిపించాయని కూడా సుప్రీంకోర్టు పేర్కొన్నది. నిఘా ఆరోపణలపై సుప్రీంకోర్టు నియమించిన కమిటీకి ఇచ్చిన ఫోన్లలో కూడా మాల్‌వేర్‌లను చొప్పించి ఇచ్చారంటే అది కేంద్ర ప్రభుత్వ బరితెగింపును, న్యాయవ్యవస్థపై ఏ మాత్రం గౌరవం లేకపోవటాన్ని వెల్లడిస్తున్నది. రాజకీయ పార్టీలు, ప్రజలకు రాజ్యాంగం ఇచ్చిన ప్రజాస్వామ్య హక్కులను ఉల్లంఘించి, తమ ప్రత్యర్థులపై కక్ష సాధించటం, నిరంకుశ పాలనకు మార్గం సుగమం చేసుకోవటం దీనిలో ఉన్నాయి. మోడి ప్రభుత్వం అనుసరిస్తున్న అప్రజాస్వామిక, రాజ్యాంగ, మౌలిక ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలలో ఇది ఒకటి. స్వాతంత్ర్యానంతరం దేశంలో వేళ్ళూనుకుంటున్న ప్రజాస్వామిక వ్యవస్థలను పునాదులతో సహా పెకలించటం, దాని స్థానంలో నిరంకుశ హిందుత్వ విధానాలను అమలుచేయటం ఈ ప్రభుత్వ లక్ష్యం. ఇలా జరగటం దేశానికి వినాశకరంగా పరిణమిస్తుంది. ఇదే జరిగితే స్వాతంత్ర్యానంతరం సాధించిన ప్రయోజనాలతో పాటు స్వాతంత్ర్యాన్ని కూడా కోల్పోతాం. బిజెపి, సంఘ్ పరివార్‌ల కుట్రల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి, వాటిని తిప్పికొట్టటానికి ఐక్యంగా పోరాటం చేయటం ద్వారా మాత్రమే ఈ పరిణామాలను నివారించటం సాధ్యమౌ తుంది.

### బిల్కిస్‌బానో కేసులో దోషులకు క్షమాభిక్ష

'కొండంత రాగం తీసి లిల్లాయి పాట పాడిన' చందంగా మహిళోద్ధరణ గురించి ఎర్రకోట నుండి ప్రధానమంత్రి ఉపదేశాలు చేసి కొద్దిగంటలు కూడా గడవకుండానే బిజెపి నాయకత్వంలోని గుజరాత్ ప్రభుత్వం బిల్కిస్‌బానో కేసులో దోషులుగా నిర్ధారించి, శిక్షలు అనుభవిస్తున్న 11 మందికి క్షమాభిక్షను ప్రసాదించింది. బిల్కిస్‌బాన్ కేసులో దోషులందరూ అత్యంత రాక్షసంగా వ్యవహరించినవారు. 2002 గుజరాత్ హింసాకాండలో ఐదు నెలల గర్భవతిగా ఉన్న బిల్కిస్‌బానోపై సామూహికంగా అత్యాచారం చేయటంతో పాటు ఆమె కుటుంబంలోని ఏడుగురిని హత్య చేశారు. ఏ మాత్రం జాలి, దయ లేకుండా మూడు సంవత్సరాల బాలికను బండకేసి బాది చంపారు. ఈ నేరాలపై విచారణ జరిపిన ముంబయిలోని సిబిఐ ప్రత్యేక న్యాయస్థానం దోషులకు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. బాంబే హైకోర్టు కూడా ఈ శిక్షను సమర్థించింది. 75వ స్వాతంత్ర్యదినోత్సవాన్ని 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' అంటూ ఊదరగొట్టిన కేంద్ర ప్రభుత్వం, బిజెపి లు ఈ సందర్భాన్ని పరస్కరించుకొని ఎవరికి ఆజాదీని ప్రసాదిస్తున్నాయో దోషుల విడుదల స్పష్టం చేస్తున్నది.

ఈ కేసులోని దోషులలో ఏ మాత్రం మానవత్వం లేదని, వారు మానవరూపంలో ఉన్న మృగాలని విచారణ సమయంలో రుజువు చేశారు. కోర్టు వారికి శిక్ష విధించింది. ఇపుడు గుజరాత్ ప్రభుత్వం వారికి క్షమాభిక్ష ప్రసాదించి, విడుదల చేయటం మహిళల పట్ల, వారిపై జరిగిన అవమానాల పట్ల సంఘ్ పరివార్ లెక్కలేనితనాన్ని వెల్లడిస్తున్నది. బాధితులు ముస్లింలు అన్న మత ప్రాతిపదికను పక్కన పెడితే దోషులు మహిళల పట్ల అత్యంత అమానుషంగా వ్యవహరించారు. తమ మతం మహిళలకు అత్యున్నతమైన గౌరవం ఇచ్చిందని ప్రచారం చేసుకుంటున్న వారు మహిళల పట్ల ఇంత క్రూరంగా ఎలా ప్రవర్తించారు? మహిళల ఉద్ధరణను ఆయా సమయాలలో తమ ప్రచారానికి ఉపయోగించుకోవటం మినహా వాస్తవంగా మహిళలను అణచివేయటం, వారి స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను హరించటం సంఘ్ పరివార్ విధానాలలో భాగం. ఇది హిందుయేతర మహిళలకు మాత్రమే పరిమితం కాదు. హిందు మహిళలే ఈ విధానాల ప్రధాన భారాన్ని భరించాల్సిఉంటుంది. ఇప్పటకే భరిస్తున్నారు కూడా. ముస్లింలపై వ్యతిరేకతను రెచ్చగొట్టటంలో భాగంగా ముస్లిం మహిళలపై దాడులు, మానభంగాలు, హత్యలు చేయటానికి హిందుత్వ మూకలను రెచ్చగొడుతున్నారు. వాటిని సమర్థిస్తున్నారు. కాని హిందువు అయినా, ముస్లిం అయినా మహిళ మహిళే. అరాచకమూకలు మహిళలలో ఒక మతంలోని మహిళలను అణచివేయటం ప్రారంభించిన తర్వాత మిగతా మతాలలోని మహిళల హక్కులను, వారిని అత్యాచారాల నుండి కాపాడటం సాధ్యం కాదు. సమాజంలోని అన్ని సమూహాలలో ఉన్నవారికి అన్ని సమూహాలలోని మహిళలపై చులకన భావం ఏర్పడుతుంది. అత్యాచారాలకు గురైన మహిళలకు రక్షణ కల్పించకపోవటం, నేరస్తులను శిక్షించకపోవటంతో మహిళల పరిస్థితి దారుణంగా తయారవుతుంది. ఈ పరిణామాలను ఇప్పటికే చూస్తు న్నాం. బిల్కిస్‌బానో కేసులో దోషులను విడుదల చేయటం మహిళలపై అత్యాచారాలు చేస్తున్నవారు మరింతగా బరితెగించటానికి అవకాశం ఇస్తుంది. హిందుత్వమూకల అరాచకాలు, మహిళలపై అత్యాచారాలను అరికట్టటానికి బిల్కిస్‌బానో కేసుకలో దోషుల విడుదలను వ్యతిరేకిస్తూ ప్రజాతంత్ర, లౌకికశక్తులతో పాటు మహిళలు కూడా పెద్ద ఎత్తున ఆందోళనలలో పాల్గొనాలి.

❋

# ఉక్రెయిన్ యుద్ధం : తల్లకిందులవుతున్న అమెరికా అంచనాలు



ఉక్రెయిన్ వార్తలు గత కొన్ని మాసాలుగా మన ఫ్రంట్ పేజీలో కొనసాగుతూ వస్తున్నాయి. ప్రపంచం నేడు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలకు ఉక్రెయిన్ యుద్ధాన్ని సాకుగా చూపనారంభించారు. ప్రపంచ ఆహార కొరత, చుక్కలనంటుతున్న ఆహార ధరలు, భగ్గుమంటున్న పెట్రో, గ్యాస్ ధరలు, యూరప్‌ను కుదిపేస్తున్న ఇంధన సంక్షోభం, కట్టలు తెంచుకుంటున్న ద్రవ్యోల్బణం ఇలా ప్రతిదానికి ఉక్రెయిన్ యుద్ధమే కారణమంటున్నారు. మన దేశంలో ఆర్థిక పరిస్థితి దిగజారడానికి ఉక్రెయిన్ సంక్షోభమే కారణమని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం చెబుతున్నది. ఇంతకీ ఉక్రెయిన్‌లో ఏం జరుగుతోంది? ఈ సంక్షోభానికి కారకులెవరు? అన్నది మనం తెలుసుకోవాల్సిన అవసరముంది.

ఉక్రెయిన్‌లో యుద్ధం మామూలు యుద్ధం కాదు. ఏదో రెండు ఇరుగు పొరుగు దేశాల మధ్య జరుగుతున్న యుద్ధం కాదిది. అమెరికా, నాటో ఇందులో జోక్యం చేసుకున్నాయి. సోవియట్ యూనియన్ పతనం తరువాత నాటోను తూర్పు దిశగా విస్తరించబోమని రష్యాకు ఇచ్చిన హామీని అమెరికా తుంగలో తొక్కింది. వార్సా కూటమిలో భాగస్వాములుగా వున్న తూర్పు యూరప్ దేశాలను, బాల్టిక్ దేశాలను నాటోలోకి తీసుకొచ్చింది. పూర్వ సోవియట్ యూనియన్‌లో భాగమైన ఉక్రెయిన్‌ను కూడా నాటోలో చేర్చుకోడానికి రంగం సిద్ధమైంది. అదే జరిగితే నాటో దళాలు మాస్కోకు 500 కి.మీ దూరంలోని తన సరిహద్దుల దాకా విస్తరించే ప్రమాదముందని,ఇది తన భద్రతకే ముప్పు అని రష్యా గ్రహించింది. అందుకే నాటోలో ఉక్రెయిన్‌ను  భాగం చేయరాదని, రష్యన్ సరిహద్దుల్లో ఎలాంటి యుద్ధ క్షిపణులను మోహరించబోనని  భద్రతాపరమైన కొన్ని హామీలు ఇవ్వాలని అమెరికా, నాటోలను అది డిమాండ్ చేసింది. ఆ విధమైన హామీలిచ్చేందుకు అమెరికా, నాటో తిరస్కరించింది. పైగా 2014 ఉక్రెయిన్‌లో కుట్రద్వారా ప్రభుత్వాన్ని కూల్చివేసిన తరువాతపెద్దయెత్తున ఆయుధాలను కుమ్మరించడం, పెద్ద సంఖ్యలో తన సలహాదారులను ఉక్రెయిన్‌లో పెట్టడం, అక్కడి సాయుధ దళాలతో సంయుక్తంగా డ్రిల్లు నిర్వహించడం, క్షిపణి బ్యాటరీలను నెలకొల్పడం, పోలండ్, రుమేనియాల్లో మరిన్ని అమెరికన్– నాటో బలగాలను దించడం,తూర్పు యూరప్, బాల్టిక్ దేశాలకు నాటో దళాలను పంపడం వంటి కవ్వింపు చర్యలకు పాల్పడింది. ఉక్రెయిన్‌లో ప్రస్తుత యుద్ధానికి దారితీసిన పరిస్థితుల్లో మరో ముఖ్యమైన అంశం మిన్స్క్ ఒప్పందాలను అమెరికా, యూరప్ దేశాలు తుంగలో తొక్కడం. జర్మనీ, ఫ్రాన్స్ పూచీకత్తు దారులుగా 2014, 2015 సంవత్సరాల్లో రెండు మిన్స్క్ ఒప్పందాలు కుదిరాయి. ఆ ఒప్పందాల ప్రకారం ఉక్రెయిన్‌లోని డాన్‌బాస్ ప్రాంతానికి ప్రాంతీయ /రాష్ట్ర ప్రతిపత్తికి హామీ ఇవ్వబడింది. ఈ ఒప్పందాలను అమలు చేసేలా ఉక్రెయిన్‌పై ఒత్తిడి తేవడానికి బదులు, వీటిని ఉల్లంఘించి, డాన్ బాస్‌పై దాడులు చేపట్టేలా దానిని అమెరికా, దాని మిత్ర పక్షాలైన జర్మనీ, ఫ్రాన్స్ ప్రోత్సహించాయి.  ఈ అంశాలన్నీ చర్చలు, సంప్రదింపుల ద్వారా పరిష్కరించుకోవచ్చు. అలాంటప్పుడు యుద్ధం వైపు ఎందుకు ఎగదోశాయి. ఇది యుద్ధం కాదు, ప్రత్యేక సైనిక చర్య అని రష్యా చెప్పవచ్చు గాక! ఏదేమైనా ఈ యుద్ధంలో పునర్వ్యవస్థీకరించిన ఉక్రెయిన్ దళాలతో సాగించే పోరులో రష్యా బలహీన పడుతుందని అమెరికా, దాని యూరోపియన్ నాటో భాగస్వాములు భావించాయి. అదీ కాకపోతే పశ్చిమ దేశాల ఆర్థిక ఆంక్షలు విధించడం ద్వారా ఉదా: స్విఫ్ట్ ఇంటర్ బ్యాంకింగ్ సెటిల్మెంట్ సిస్టమ్‌తో రష్యా అనుసంధానాన్ని నిలిపివేయడం, వెస్టరన్ బ్యాంకుల్లోని రష్యన్ విదేశీ మారక నిల్వలను స్వాధీనం చేసుకోవడం, రష్యాపై వివిధ వాణిజ్య ఆంక్షలు విధించడం వంటి వాటి ద్వారా రష్యాను లంగదీసుకోవచ్చని భావించాయి. అవన్నీ విఫలం కావడంతో ఇప్పుడీ యుద్ధాన్ని సుదీర్ఘంగా కొనసాగేలా చూడాలని అమెరికా, దాని మిత్ర పక్షాలు ఇప్పుడు కోరుకుంటున్నాయి. ఈ యుద్ధం వల్ల ఇప్పటికే చమురు, గ్యాస్, బగ్గుధరలు భారీగా పెరిగిపోవడంతోపాటు, ప్రపంచ ఆహార కొరత ఏర్పడింది. యుద్ధం సుదీర్ఘంగా సాగితే దాని పర్యవసానాలు ఇంకా తీవ్రంగా ఉండే అవకాశముంది.

### చారిత్రిక నేపథ్యం

సోవియట్ యూనియన్ కాలంలో ఉక్రెయిన్ ఒక తిరుగులేని ఆర్థిక శక్తిగా ఉండేది. సోవియట్

> **“ నయా-ఉదారవాద విధానాల వల్ల ఉక్రెయిన్‌లో నయా- నాజీ గ్రూపులు కొత్తగా ఊపిరిపోసుకున్నాయి. ఈ గ్రూపులను ప్రోత్స హించడంలో అమెరికా పాత్ర గురించి తెలుసుకుంటే, ఉక్రెయిన్‌లో ఏం జరుగుతుందో అర్థమైపోతుంది. 1949లో రష్యాకు వ్యతిరేకంగా పోరాడేలా నాజీ గ్రూపులను ఉసిగొల్పేందుకు, తర్ఫీదు ఇచ్చేందుకు అమెరికా తన సిఐఎ ఏజెంట్లను పంపింది. ఆ ‘ఆపరేషన్’ విఫలమైనా, ఉక్రెయిన్, ఇతర సోవియట్ రిపబ్లిక్కులలోని నియో నాజీ గ్రూపులతో సిఐఎ సంబంధాలు కొనసాగించేలా చూసుకుంది. ”**

యూనియన్ కుప్పకూలిన అనంతరం పూర్వ సోవియట్ రిపబ్లిక్‌ల ఆర్థిక వ్యవస్థల్లో, జీవన ప్రమాణాల్లో పెద్దయెత్తున కల్లోలం చోటుచేసుకుంది. దీనికి ఉక్రెయిన్ కూడా మినహాయింపేమీ కాదు. యునైటెడ్ సోవియట్ సోషలిస్టు రష్యాలో భాగంగా ఉక్రెయిన్ ఉన్నప్పుడు తలసరి ఉత్పత్తిలో జర్మనీ, ఫ్రాన్స్, బ్రిటన్ కన్నా మెరుగైన స్థితిలో ఉండేది. ముప్పయ్యేళ్ల తరువాత దాని తలసరి జిడిపి బాగా తగ్గిపోయింది. ప్రజల కొనుగోలు శక్తి 1990ల నాటితో పోల్చితే 20 శాతం దాకా తగ్గింది. సోవియట్ యూనియన్ పతనం కాగానే తూర్పు యూరప్ దేశాల్లో అమెరికా చేపట్టిన మొట్టమొదటి చర్య ఏమిటంటే వాటిని దుర్మార్గపు పెట్టుబడిదారీ దోపిడీ పంథాలోకి నెట్టడం. ఆ తరువాత కొద్ది కాలానికే ఈ దేశాల మార్కెట్లను సామ్రాజ్యవాద దేశాలకు అనుగుణంగా మార్చడం జరిగింది. ప్రభుత్వ రంగంలోని పారిశ్రామిక సంస్థలను ధ్వంసం చేసి, కొద్దిమంది కార్పొరేట్లకు అప్పగించేలా చేసింది. ఆయా దేశాల్లోని సుసంపన్నమైన సహజ వనరులను వ్యక్తిగత ఆస్తిగా మార్చి, సామ్రాజ్యవాద దోపిడీకి వీలుగా తలుపులు తెరిచారు. మరో వైపు ఆకలి, నిరుద్యోగం, పేదరికం, వేశ్యవృత్తి, దిగజారిన జీవన ప్రమాణాలతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. రాజకీయ నాయకత్వానికి సన్నిహితంగా ఉండే కొద్ది మంది కులీనులు రాత్రికి రాత్రి వందల కోట్ల ఆస్తులకు పడగలెత్తారు. ప్రభుత్వ అధీనంలోని వనరులను, ఫ్యాక్టరీలను పబ్లిగ్గా లూటీ చేయడం ద్వారా వీరు కుబేరులుగా మారారు. ఫలితంగా ఉక్రెయిన్ నుంచి 50 లక్షల మంది ఇతర దేశాలకు వలస వెళ్లారు. వీరిలో ఎక్కువ మంది యువతే కావడం గమనార్హం.

### అమెరికా పాత్ర, సిఐఎ హస్తం

నయా ఉదారవాద విధానాల వల్ల ఉక్రెయిన్‌లో నియో నాజీ గ్రూపులు కొత్తగా ఊపిరిపోసుకున్నాయి. ఈ నాజీ గ్రూపులను ప్రోత్సహించడంలో అమెరికా పాత్ర గురించి



ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలిన్‌స్కీ

తెలుసుకుంటే, ఉక్రెయిన్‌లో ఏం జరుగుతుందో అర్థమైపోతుంది. 1949లో రష్యాకు వ్యతిరేకంగా పోరాడేలా నాజీ గ్రూపులను ఉసిగొల్పేందుకు, తర్ఫీదు ఇచ్చేందుకు అమెరికా తన సిఐఎ ఏజెంట్లను పంపింది. ఆ ‘ఆపరేషన్’ విఫలమైనా, ఉక్రెయిన్, ఇతర సోవియట్ రిపబ్లిక్కులలోని నియో నాజీ గ్రూపులతో సిఐఎ సంబంధాలు కొనసాగించేలా చూసుకుంది. సోవియట్ యూనియన్ పతనం తరువాత ఈ శక్తులు ఒక్కసారిగా చెలరేగాయి. ఆ తరువాత వచ్చిన ఎల్సిన్ అమెరికా చేతిలో కీలుబొమ్మగా మారడంతో అమెరికా నేతృత్వంలోని గ్లోబల్ పెట్టుబడి తూర్పు యూరప్ దేశాలకు విస్తరించింది. అప్పటి నుంచే అమెరికా శకం, ప్రపంచంపై దాని పూర్తి ఆధిపత్యం మొదలైంది. ఎల్సిన్ నిష్క్రమణ తరువాత రష్యా తన బలాన్ని కూడదీసుకునేందుకు యత్నించడంతో దానిని దెబ్బతీసేందుకు ఉక్రెయిన్‌ను ఇయు, నాటోలో భాగస్వామిగా చేయాలని అమెరికా, యూరప్‌లోని సంపన్న దేశాలు ఎత్తు వేశాయి. 2008లో తలెత్తిన ప్రపంచ ఆర్థిక మాంద్యం నుంచి బయటపడేందుకు అమెరికా ఉక్రెయిన్‌ను, ఇతర తూర్పు యూరప్ దేశాలను మరింత మచ్చిక చేసుకునే యత్నాలు చేపట్టింది. ఈ దేశాల మార్కెట్లను బార్లా తెరిపించడం, వనరులను కొల్లగొట్టడం, ప్రజలపై ఎడాపెడా భారాలు మోపడం వంటి చర్యలు చేపట్టింది. 2009లో ఉక్రెయిన్‌తో సహా మాజీ సోవియట్ రిపబ్లిక్కులతో సంబంధాలను పటిష్టపరచుకోవడం కోసం తూర్పు భాగస్వామ్య కార్యక్రమాన్ని యూరోపియన్ యూనియన్ చేపట్టింది.

ఈ నేపథ్యంలో ఉక్రెయిన్‌లో ఆర్థిక సంక్షోభం తీవ్రతరమైంది. ఉక్రెయిన్ అవసరాలు తీరాలంటే ఐఎంఎఫ్‌ను ఆశ్రయించాల్సిందేనని అమెరికా, ఇయు సలహా ఇచ్చాయి. ఐఎంఎఫ్‌తో డీల్ పునరుద్ధరించడమంటే కొరివితో తల గోక్కోవడమే. ఇంధనంపై ప్రభుత్వ సబ్సిడీల్లో పెద్దయెత్తున కోత, భూమితో సహా సహజ వనరుల ప్రైవేటీకరణ వంటి షరతులు రాజకీయంగా చిక్కుల్లో పడేస్తాయి. బాధాకరమైన పొదుపు చర్యలు, వ్యవస్థాగత మార్పులు చేపట్టేందుకు కట్టుబడి ఉన్నట్లు ఉక్రెయిన్ హామీ ఇస్తే తప్ప ఆ దేశానికి రుణం అందించేది లేదని ఐఎంఎఫ్ కరాఖండితంగా చెప్పింది. ఆ విధంగా అమెరికా, యూరప్ దేశాలు ఉక్రెయిన్ ప్రభుత్వంతో ఐఎంఎఫ్ షరతులను బలవంతంగా అంగీకరింపజేశాయి. ఈ సంస్కరణలను వేగవంతం చేసిన ప్రభుత్వం ఘోరంగా అప్రతిష్ట పాలైంది. సామాజిక రంగంపై ముఖ్యంగా ఆరోగ్యం, గృహనిర్మాణం, ఇతర సామాజిక సేవలపై ప్రభుత్వ వ్యయాన్ని బాగా తగ్గించేసింది. సామాన్యులపై మోయలేని భారాలు వేస్తూ, సంపన్నులకు భారీగా రాయితీలు కల్పించే పన్నుల విధానం , ప్రభుత్వ అధికారులను లంచాలతో మేపి, ఇబ్బడి ముబ్బడిగా కార్పొరేట్లు లాభాలు పోగేసుకోవడం వంటి ధోరణులు పెరిగిపోయాయి.

### నియో నాజీ శక్తుల పెరుగుదల


వీటన్నిటి ఫలితంగా ఉక్రెయిన్ అటు రాజకీయంగా, ఇటు ఆర్థికంగా పశ్చిమ దేశాల కూటమికి అంతకంతకూ దగ్గరవుతూ వచ్చింది. పశ్చిమ దేశాల అనుకూల విధానాలు ఉక్రెయిన్ ప్రభుత్వం చేపట్టడం వల్ల ప్రజల్లో అశాంతి రేగింది. ఈ సంక్షోభం నుంచి బయటపడేందుకు అటు యూరోపియన్ యూనియన్‌తోను, ఇటు రష్యాతోను అది సంప్రదింపులు జరిపింది. తీవ్రమైన పొదుపు చర్యలు అమలు చేయాలని యూరోపియన్ యూనియన్ చేసిన డిమాండ్‌ను అధ్యక్షుడు యనుకోవిచ్ తిరస్కరించారు. చివరి నిమిషంలో యూరప్‌తో డీల్‌ను ఉపసంహరించుకుని రష్యా సాయం కోరారు. ప్రభుత్వ నిర్ణయాన్ని రష్యాకు లంగుబాటుగా చిత్రిస్తూ మితవాద, నియో నాజీ పార్టీలు ఉన్మాదపూరితంగా వ్యవహరించాయి. కమ్యూనిజం,

సోషలిజానికి వ్యతిరేకంగా జాతీయ ఉన్మాదాన్ని రెచ్చగొట్టాయి. చరిత్రను వక్రీకరిస్తూ, సోవియట్ శకంలో రష్యా ఉక్రెయిన్‌ను బలవంతంగా ఆక్రమించిందని ప్రచారం చేశాయి.

2014లో యనుకోవిచ్‌కు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు చేపట్టిన నిరసనల్లో ఉక్రెయిన్‌లోని అమెరికా రాయబారి విక్టోరియా నులాండ్ చురుగ్గా పాల్గంటూ నిర్లజ్జగా ఉన్మాదుల పక్షం వహించారు. ఆ నిరసనలు యనుకోవిచ్ ప్రభుత్వాన్ని పడగొట్టాయి. ఎన్నికైన అధ్యక్షుడి స్థానే నియో నాజీ గ్రూపులు మద్దతు తెలిపిన పొరొషెంకో పగ్గాలు చేపట్టాడు. ఉక్రెయిన్‌లో ఆ విధమైన 'కలర్ రివల్యూషన్' (రంగు విప్లవం)ను బలవంతంగా రుద్దడంలో అమెరికా సఫలమైంది. వారు అధికారం చేపట్టిన మరు క్షణం నుంచే ఉక్రెయిన్ లోపల నివసించే రష్యన్లను లక్ష్యంగా చేసుకుని నియో నాజీ మూకలు ఎడాపెడా దాడులు చేయనారంభించాయి. రష్యన్లు అధికంగా ఉన్న డాన్‌బాస్ ప్రాంతాన్ని ప్రత్యేక టార్గెట్‌గా పెట్టుకున్నాయి. 2014 తిరుగుబాటులో అమెరికా పాత్ర ఉందనేది జగమెరిగిన సత్యం. అధికారం హస్తగతం చేసుకున్న నాజీ గ్రూపులు రాజ్య విభాగాలన్నిటిని తమ గుప్పెట్లో పెట్టుకుని ఇష్టానుసారంగా చెలరేగాయి. ఉక్రెయిన్ తూర్పు ప్రాంతాల్లోని రష్యన్లపైన దాడులకు దిగాయి. వీరికి ఉక్రెయిన్ ప్రభుత్వమే నేరుగా నిధులు సమకూర్చేది. కమ్యూనిస్టులపై దాడులు, లెనిన్ విగ్రహాల ధ్వంసం వంటి చర్యలకు తెగబడింది ఈ నియో నాజీ మూకలే. కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యాలయంపై దాడులు, ఉక్రెయిన్ కమ్యూనిస్టు పార్టీ (కెపియు) ప్రధాన కార్యదర్శి పెట్రో సిమోనెంకోపై దాడి చేసి, అరెస్టు చేశారు. ఒక పథకం ప్రకారం కమ్యూనిస్టుల పైన, ప్రగతిశీల శక్తులపైన దాడులు చేస్తున్నారు. ఈ నియో నాజీ మూకలు ప్రభుత్వాన్ని శాసిస్తున్నాయి.

ఉక్రెయిన్‌లో జాతీయవాదం, జాత్యహంకారం ప్రస్తుతం బాహాటంగానే బుసలుకొడుతున్నాయి. ఉక్రెయిన్, రష్యా ఘర్షణ సందర్భంగా వేలాది మంది భారత విద్యార్థులు, ఇతర దేశాల విద్యార్థులతో కలసి ఉక్రెయిన్‌ను వీడి వెళ్లేందుకు యత్నించగా, వీరిలో భారత్, ఆఫ్రికన్ విద్యార్థులను రైలు ఎక్కడానికి వీల్లేదంటూ రైల్వే స్టేషన్లలో అడ్డుకున్నారు. జాతి, వర్ణాన్ని లక్ష్యంగా చేసుకుని దాడులు జరిగాయి. ఉక్రెయిన్ సమాజం నుంచి రాజ్య యంత్రాంగంలోకి నియో నాజీ శక్తులు చొరబడ్డాయి. నల్ల జాతీయులకు ప్రవేశం లేదంటూ ఉక్రెయిన్ సరిహద్దుల్లో బోర్డులు పెట్టి మరీ అడ్డుకున్నారు.

"ఉక్రెయిన్‌లో జాతీయవాదం, జాత్యహంకారం ప్రస్తుతం బాహాటంగానే బుసలుకొడు తున్నాయి. ఉక్రెయిన్, రష్యా ఘర్షణ సందర్భంగా వేలాది మంది భారత విద్యార్థులు, ఇతర దేశాల విద్యార్థులతో కలసి ఉక్రెయిన్‌ను వీడి వెళ్లేందుకు యత్నించగా, వీరిలో భారత్, ఆఫ్రికన్ విద్యార్థులను రైలు ఎక్కడానికి వీల్లేదంటూ రైల్వే స్టేషన్లలో అడ్డుకున్నారు. జాతి, వర్ణాన్ని లక్ష్యంగా చేసుకుని దాడులు జరిగాయి. ఉక్రెయిన్ సమాజం నుంచి రాజ్య యంత్రాంగంలోకి నియో నాజీ శక్తులు చొరబడ్డాయి."


రష్యా అధ్యక్షుడు వ్లదిమీర్ పుతిన్

50 లక్షల మంది ఉక్రెయిన్ శరణార్థులు దేశం వీడి వలసపోయారు. శరణార్థులను తమ దేశాల్లో ప్రవేశించకుండా గట్టిగా వ్యతిరేకించే అమెరికా, బ్రిటన్ ప్రభుత్వాలు ఉక్రెయినియన్ శరణార్థుల విషయంలో తద్భిన్నంగా వ్యవహరించాయి. బ్రిటన్ ప్రభుత్వం వీరి కోసం మార్చి 14న ఒక ప్రత్యేక పథకాన్ని తీసుకొచ్చింది. మొదటి రోజే లక్ష మంది దాకా వ్యక్తులు, సంస్థలు ఈ స్కీమ్‌లో చేరేందుకు అంగీకరిస్తూ సంతకాలు చేశాయి. అద్దె లేకుండా ఇంట్లో కొంత స్పేస్‌ను శరణార్థులకు కేటాయించాలని ప్రభుత్వం కోరింది. ఒక్కొక్క కుటుంబం ఒక్కో శరణార్థికి ఆశ్రయం ఇవ్వాలని సూచించింది. అలా ఆశ్రయం ఇచ్చిన కుటుంబాలకు నెలకు 350 పౌను చొప్పున 12 మాసాలపాటు చెల్లిస్తామని ప్రభుత్వం పేర్కొంది. యుకె రిటైల్ దిగ్గజాలైన శాన్స్‌బరీ, మార్క్స్ అండ్ స్పెన్సర్, మోరిసన్స్ శరణార్థులకు తమ సంస్థల్లో ఉద్యోగాలిస్తామని ప్రకటించాయి.

అమెరికా, దాని మిత్ర పక్షాలు చెప్పే నిబంధనల ఆధారిత ప్రపంచ క్రమానికి అర్థాలే వేరు. అవి చెప్పే అంతర్జాతీయ క్రమం ఐక్యరాజ్య సమితి, అంతర్జాతీయ న్యాయం, చట్టాల ఆలంబనగా నడిచేది కాదు. వాటిని తోసిరాజని తాను నిర్దేశించిన నియమ నిబంధనల ఆధారంగా నడిచేదన్న మాట. సోవియట్ యూనియన్ పతనం, సోషలిస్టు బ్లాక్ విచ్ఛిన్నమైన తరువాత తమ ఆధిపత్యాన్ని ఏ దేశమూ సవాల్ చేయగలిగే స్థితి లేదని అమెరికా, దాని మిత్ర దేశాలు భావించాయి. సైనిక పరంగా గత 30 సంవత్సరాల్లో ప్రపంచంలో తిరుగులేని శక్తిగా అధికారం చలాయించింది. తద్వారా ప్రపంచ ఆర్థిక వ్యవస్థలపై తన ఆధిపత్యాన్ని పటిష్టపరచుకోజూసింది. రష్యాపై ఆంక్షల అస్త్రాన్ని ప్రయోగించి ఇరాన్, వెనిజులా మాదిరి రష్యన్ ఆర్థిక వ్యవస్థను దెబ్బ తీయొచ్చు అని పశ్చిమ దేశాలు కలలుగన్నాయి. రష్యా ఆర్థిక వ్యవస్థ పెట్రోలు, గ్యాస్ ఎగుమతులపైనే ఎక్కువగా ఆధారపడి ఉన్నది కాబట్టి దాని చెల్లింపుల మెకానిజాన్ని స్తంభింపజేయడం, దాని విదేశీమారక ద్రవ్య నిల్వలను స్తంభింపజేస్తే రష్యా అన్ని రకాల కొరతలను ఎదుర్కొంటుంది. అప్పుడు ప్రజల్లో పెద్దయెత్తున అసంతృప్తి రగిలి, తాము ఆశించినట్లు ప్రభుత్వ మార్పు సాధ్యమవుతుందని అమెరికా, దాని మిత్ర దేశాలు భావించాయి. రష్యా ప్రధానంగా చమురు, గ్యాస్ స్టేషన్లపై ఆధారపడిన దేశమని, పశ్చిమ దేశాలు ప్రచారం చేసుకున్నాయి. అవి అనుకున్నట్టు రష్యా కేవలం ఆయిల్, గ్యాస్, బొగ్గు ఉత్పత్తిదారు మాత్రమే కాదు, వ్యవసాయ ఉత్పతులు, ఎరువులు, ప్రపంచ పారిశ్రామికాభివృద్ధికి కీలకమైన స్టీల్, ఇతర ఖనిజాల ఎగుమతి దారు కూడా. రెండో అంశం పశ్చిమ దేశాల నుంచి అది ఇప్పటికే అనేక ఆంక్షలు ఎదుర్కొంటున్నప్పటికీ ప్రపంచంలో మరే దేశం కన్నా స్వావలంబన కలిగిన దేశంగా కొనసాగుతున్నది. మూడవ అంశం మిలిటరీతో సహా దాని పారిశ్రామిక రంగం ఇతర అభివృద్ధి చెందిన దేశాల్లా కాకుండా మొత్తం మీద స్వయం సమృద్ధమైనది.

### పశ్చిమ దేశాల ఆంక్షలు విఫలం

రష్యాపై పశ్చిమ దేశాల ఆంక్షలు రెండు భాగాలు. ఒకటి తమ సెంట్రల్ బ్యాంక్‌తో సహ

**❝ రష్యా రూబుల్ మట్టి కరవక తప్పదని అమెరికా అధ్యక్షుడు బైడెన్ చేసిన ప్రకటన తప్పు అని తేలడానికి ఎంతో సమయం పట్టలేదు. తన గ్యాస్, చమురు వనరుల దన్నుతో రూబుల్ బలం పుంజుకుంది. ఈ ఆంక్షల వల్ల ఎక్కువగా నష్టపోతున్నది యూరోపియన్ యూనియన్ దేశాలే. అమెరికాలా కాకుండా అవి రష్యా, చమురు సరఫరాలపైనే ఎక్కువగా ఆధారపడుతుంటాయి. ❞**

పలు రష్యన్ బ్యాంకులు స్విఫ్ట్ సిస్టమ్‌ను ఉపయోగించుకోనీయకుండా నిషేధం విధించడం. రష్యా నుంచి కానీ, రష్యాతో కానీ మరే ఇతర దేశంతో వాణిజ్య లావాదేవీలు జరిపినా దానికి చెల్లింపులు, లేదా వసూళ్ల స్విఫ్ట్ సిస్టమ్ ద్వారా జరపడానికి వీల్లేదని చెప్పడం. రెండోది, వెస్టర్న్ బ్యాంకుల్లోని రష్యాకు చెందిన డబ్బును స్తంభింపజేయడం ప్రస్తుత అంతర్జాతీయ చట్ట నియమనిబంధనల ప్రకారం పూర్తిగా అక్రమం. వారు సీజ్ చేసిన డబ్బు రష్యా ఇప్పటికే సప్లయి చేసిన సరుకులకు చెల్లించాల్సిన డబ్బు అది. దానిని బ్యాంకుల్లో అలాగే అట్టిపెట్టి ఉంచుకుంటూ, ఇంకో వైపు తమకు చమురు, గ్యాస్ ఎప్పటిలానే సప్లయి కొనసాగించాలని ఇ.యు, జపాన్ డిమాండ్ చేస్తున్నాయి. దానికి చెల్లించాల్సిన డబ్బు మాత్రం వెస్టరన్ బ్యాంకులోనే డిపాజిట్ చేస్తామంటు న్నాయి. అలా చేయడమంటే ఆ డబ్బును మళ్లీ సీజ్ చేసేందుకు వాటికి అనుమతించడమే అవుతుంది.

పశ్చిమ దేశాలు విధించిన ఆర్థిక, ద్రవ్యపరమైన ఆంక్షలు మొదట్లో కొంత ప్రభావం చూపించినట్లు అనిపించింది. రష్యా రూబుల్ మునిగి, వ్యాపార లావాదేవీలను తన బ్యాంకుల ద్వారా జరపడం కనాకష్టంగా ఉండేది. డబ్బు బదలాయింపు, తీసుకోవడం వంటి కార్యకలాపాలు నిర్వహించగలిగే స్థితిలో రష్యన్ బ్యాంకులు లేవు. అయితే, అనతి కాలంలోనే దాని నుంచి రష్యా కోలుకుని గ్యాస్, చమురు అమ్మకాలు రూబుల్ కరెన్సీ లోనే చెల్లించాలని పట్టుబట్టింది. భారత్‌తో రూపాయిల్లోను, చైనాతో యువాన్లలోను చెల్లింపులు జరిపేలా ఒప్పందం కుదుర్చుకుని చమురు, గ్యాస్ అమ్మకాలు కొనసాగించింది. ఇతర దేశాలకు కూడా అమ్మకాలు సాగించింది. రష్యా రూబుల్ మట్టి కరవక తప్పదని అమెరికా అధ్యక్షుడు బైడెన్ చేసిన ప్రకటన తప్పు అని తేలడానికి ఎంతో సమయం పట్టలేదు. తన గ్యాస్, చమురు వనరుల దన్నుతో రూబుల్ బలం పుంజుకుంది.

ఈ ఆంక్షల వల్ల ఎక్కువగా నష్టపోతున్నది యూరోపియన్ యూనియన్ దేశాలే. అమెరికాలా కాకుండా అవి రష్యా, చమురు సరఫరాలపైనే ఎక్కువగా ఆధారపడుతుంటాయి. రూబుల్స్‌లో తాము చెల్లించబోమని మొదట అవి కొంత బెట్టు చూపాయి. సంవత్సరం నాటికి తన చమురు, గ్యాస్ దిగుమతులు మరింతగా తగ్గించుకుంటా మని బీరాలు పోయాయి. వాటి రష్యన్ గ్యాస్ ఆస్తులు చాలావరకు రష్యాలోనే ఉన్నాయి. ఇంకోవైపు రష్యన్ మనీ యూరోపియన్ బ్యాంకుల్లో సీజ్ చేయబడ్డాయి. దీంతో రష్యన్ ఆయిల్, గ్యాస్ ఎగుమతులు 10-15 శాతం తగ్గాయి. అయితే, వీటన్నిటిని అధిగమించి రష్యా ఈ కాలంలో లాభాలు సాధించింది. చమురు, గ్యాస్ ధరలు గణనీయంగా పెరగడంతో గడచిన అయిదు మాసాల్లోనే అది దాదాపు పది వేల కోట్ల డాలర్ల అదాయాన్ని అదనంగా ఆర్జించింది.

రష్యాపై ఆంక్షలు విఫలానికి రెండో కారణం, అమెరికా, యూరోపియన్ యూనియన్, జపాన్, కెనడా, ఆస్ట్రేలియా మినహా మరే దేశమూ రష్యాపై ఆంక్షలు విధించలేదు. రష్యాపై గల బ్యాంకింగ్ ఆంక్షలను తొలగించాలని, తద్వారా రష్యా నుండి తాము ఆహారం, ఎరువులు కొనుగోలు చేసేందుకు వెసులుబాటు కల్పించాలంటూ రష్యా ఆహారం, ఎరువుల ఎగుమతులపై ఆధారపడే ఆఫ్రికన్ దేశాలు కోరుతున్నాయి. ఈ ఆంక్షలను తొలగించడానికి నిరాకరించిన తర్వాత, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులపై అంకారాలో ఐక్యరాజ్య సమితి మధ్యవర్తిత్వంతో ఒప్పందం కుదిరిన తర్వాత, ఆహార దిగుమతులు లేదా తమ అవసరాల కోసం రష్యన్ బ్యాంకులను ఉపయోగించి చెల్లింపులు జరపవచ్చంటూ ఇ.యు, అమెరికా ఇప్పుడు "వివరణలు" జారీ చేశాయి.

నాటో ఆయుధాలు, మందుగుండు సామాగ్రితో ఉక్రెయిన్ ఈ యుద్ధాన్ని చేస్తుండడం ఈ యుద్ధంలో మరో కోణం. భౌగోళిక, ఉపగ్రహ చిత్రాలను ఉపయోగించి యుద్ధానికి సంబంధించి రియల్‌టైమ్ తోడ్పాటును అందిస్తున్నామని, ఇంటెలిజెన్స్ సమాచారాన్ని కూడా అందచేస్తూ ఉక్రెయిన్‌కు సహకరిస్తున్నామని పశ్చిమ దేశాల సంస్థలు ఇప్పటికే వెల్లడించాయి. నాటో సరఫరా చేసే ఆయుధాలు, క్షిపణుల బ్యాటరీలను ఉపయోగించడంలో నాటో "మిలటరీ సలహాదారులు" చురుకుగా ఉక్రెయిన్ బలగాలకు సాయపడుతున్నారు. ఉక్రెయిన్ వద్ద వున్న సోవియట్ కాలం నాటి ఆయుధాలు, ట్యాంక్‌లు, విమానాలు, ఇతర మందుగుండు సామాగ్రి అంతా కూడా ఖాళీ అయిపోయింది. ఈ నేపథ్యంలో, ఇక ఉక్రెయిన్‌కు సైనిక సరఫరాలు, ఆయుధాలు, మందుగుండు సామాగ్రిని అందించే వనరులుగా పశ్చిమ దేశాలు వున్నాయి.


అన్నింటికంటే పశ్చిమ దేశాలను దిగ్భ్రాంతి పరిచిన అంశమేమంటే, రష్యా తన సైనికులకు ఆయుధాలను, మందుగుండును, క్షిపణులను అందచేయగలిగే పారిశ్రామిక సామర్థ్యాన్ని కలిగివున్నట్లు కనిపించడమే. మరోపక్క పశ్చిమ దేశాల వద్ద ఆయుధాలు, మందుగుండు నిల్వలు చాలా వేగంగా తరిగిపోతున్నాయి. అంతకంటే అధ్వాన్నమైన అంశమేమంటే, వేగంగా ఆయుధాలను, మందుగుండును ఉత్పత్తి చేసుకునే సామర్థ్యం కూడా పశ్చిమ దేశాలకు లేకపోవడం. ఆ దేశాల పరిశ్రమలు ఎక్కువగా విదేశాల్లోనే వున్నాయి. ఇక పారిశ్రామిక స్థాయిలో యుద్ధాన్ని చేసే సామర్థ్యం అమెరికా దాని మిత్రపక్షాలకు లేదని అలెక్స్ వెర్షినిన్ ఈ ఏడాది జూన్ 17 నాటి బ్రిటన్ పత్రిక అయిన రాయల్ యునైటెడ్ సర్వీసెస్ ఇన్‌స్టిట్యూట్ (ఆర్‌యుఎస్‌ఐ)లో రాసిన వ్యాసం "రిటర్న్ ఆఫ్ ఇండస్ట్రియల్ వార్‌ఫేర్"లో పేర్కొన్నారు. ఉదాహరణకు, యూరప్‌లో రష్యాతో జరిపే ఇటువంటి యుద్ధంలో "అమెరికా వార్షిక శతఘ్నుల ఉత్పత్తి ఉక్రెయిన్‌లో కేవలం పది రోజుల నుండి రెండు వారాల వరకు జరిగే యుద్ధానికి మాత్రమే సరిపోతుంది." పైగా, ట్యాంక్ విధ్వంసక జావెలిన్‌లు, వైమానిక రక్షణకు ఉపయోగించే స్టింగర్ల పరిస్థితి కూడా అలాగే వుంది. అమెరికా ఇప్పటివరకు ఉక్రెయిన్‌కు 7 వేల జావెలిన్ క్షిపణులను పంపింది. అంటే తన దగ్గర వున్న నిల్వల్లో దాదాపు మూడో వంతు అన్నమాట. ఇంకా వీటిని తీసుకువస్తున్న మరిన్ని నౌకలు రావాల్సి వుంది. లాక్‌హీడ్ మార్టిన్ సంస్థ ఏడాదికి దాదాపుగా 2100 క్షిపణులను తయారు

చేస్తుంది. మరో మాటలో చెప్పాలంటే, ప్రస్తుతం ఇరాక్ వంటి దేశాలపై లేదా ఆఫ్ఘనిస్తాన్‌లో తాలిబన్ వంటి శక్తులపై యుద్ధం చేయడానికి అమెరికా సమాయత్తంగా వుంది కానీ రష్యా లేదా చైనా వంటి తోటి సైనిక పోటీదారుతో యుద్ధం చేయడానికి సిద్ధంగా లేదు.

ఉక్రెయిన్‌లో నాటో విధానాలను మనం ఎలా చూడవచ్చు? ఉక్రెయిన్ ప్రజలను ఉపయోగించుకుని రష్యాతో అమెరికా, నాటో మిత్రపక్షాలు యుద్ధం చేస్తున్నాయి. పదే పదే చెబుతున్నట్లుగా, ఈ యుద్ధంలో రష్యాను రక్తమోడించడానికి ఉక్రెయిన్‌ను ఉపయోగించుకోవడమే విధానంగా వుంది. ఆ రకంగా ఇటువంటి యుద్ధంలో ఉక్రెయిన్ చాలా పెద్ద మూల్యమే చెల్లించాల్సి వుంటుంది. కానీ, ఇది అమెరికాకు చాలా స్వల్పంగానే వుంటుంది. ఆస్తుల విధ్వంసం, ప్రాణ నష్టం, పెద్ద సంఖ్యలో నిర్వాసితులు కావడం వంటి సమస్యల వల్ల మతోన్మాదం, తీవ్రవాద శక్తులు పెచ్చరిల్లడానికి దారి తీస్తుంది.

నెలల తరబడి, ఉక్రెయిన్ లోని ఫాసిస్టులు యుద్ధ రంగం నుండి పౌరులను ఖాళీ చేయించడానికి జరిగే అన్ని ప్రయత్నాలను దెబ్బతీస్తున్నారు. వారిని ఆయా నగరాల్లోనే వుంచేందుకే వారు ప్రాధాన్యమిస్తున్నారు. పైగా వారిని బందీలుగా, మానవ కవచాలుగా ఉపయోగించుకునేలా చూస్తున్నారు. ఈ యుద్ధంలో ఉక్రెయిన్ ప్రజలు పెద్ద ఎత్తున ఇబ్బందులు పడడానికి ఇదొక కారణంగా వుంది. ఆ ఇబ్బందులను పశ్చిమ దేశాల మీడియా బాగా ప్రచారం చేస్తోంది. ఉక్రెయిన్ నగర వీధుల్లో చెల్లాచెదురుగా పడివున్న పౌరుల మృత దేహాల బీభత్సమైన దృశ్యాలను చూపిస్తున్న వీడియోను ఈ ఫాసిస్టులు పదే పదే ప్రసారం చేశారు. రష్యన్ బలగాలను హింసాత్మక చర్యలకు పాల్పడే ముఠాగా, క్రూరమైన మానసిక రోగులుగా చిత్రీకరించే ప్రయత్నాలు చేశారు. ఈ కథనాల్లో కొన్నింటిని ఐక్యరాజ్య సమితి మాజీ ఆయుధ ఇన్‌స్పెక్టర్ స్కాట్ రిట్టర్ తోసిపుచ్చారు. దాదాపు 31 కోట్ల మంది శ్రోతలను కలిగిన బిబిసి, ఉక్రెయిన్‌లో ఫాసిజాన్ని తిరస్కరించే ప్రయత్నాలను పెంచడానికి ఏ విధంగానూ సహాయపడలేదు. ఫాసిస్టులను ఖండించడానికి బదులుగా, "హుర్రే ఫర్ ది బ్లాక్ షర్ట్స్" అనే కార్యక్రమాన్ని ప్రసారం చేసింది. ఉక్రెయిన్‌లో యుద్ధం ఏ విధంగా ప్రారంభమైందో తెలిపే విశ్లేషాత్మక కథనాలను, చర్చలను బిబిసి తోసిపుచ్చింది. యుద్ధం ఎలా ప్రారంభమైందో నీకు తెలియకపోతే, దాన్ని అంతమొందించడానికి ఏం చేయాలనే ఆశ, ఆలోచన కూడా వుండదు.

"నెలల తరబడి, ఉక్రెయిన్ లోని ఫాసిస్టులు యుద్ధ రంగం నుండి పౌరులను ఖాళీ చేయించడానికి జరిగే అన్ని ప్రయత్నాలను దెబ్బతీస్తున్నారు. వారిని ఆయా నగరాల్లోనే వుంచేందుకే వారు ప్రాధాన్యమిస్తున్నారు. పైగా వారిని బందీలుగా, మానవ కవచాలుగా ఉపయోగించుకునేలా చూస్తున్నారు. ఈ యుద్ధంలో ఉక్రెయిన్ ప్రజలు పెద్ద ఎత్తున ఇబ్బందులు పడడానికి ఇదొక కారణంగా వుంది."



అమెరికా అధ్యక్షుడు జోయ్ బైడెన్

గతంలో వియత్నాం, ఇరాక్, లిబియా, ఆఫ్ఘనిస్తాన్‌లలో చేసినట్లుగా ఉక్రెయిన్ నుండి కూడా అమెరికా దూరంగా వెళ్ళిపోవచ్చు. అందుకే, "అమెరికా శత్రువుగా వుండడం ప్రమాదకరమే, కానీ అమెరికా మిత్రుడుగా వుండడం మరింత ప్రాణాంతకం." అంటూ కిస్సింగర్ వ్యాఖ్యానించారు.

**యుద్ధం కాదు, శాంతిని నెలకొల్పడం అవశ్యం**

ఉక్రెయిన్‌లో రష్యా సైనిక బలగాలు ప్రవేశించడం ఈ సమస్యను పరిష్కరించడానికి గల ఏకైక పరిష్కార మార్గమా? ఈ యుద్ధం వల్ల వేలాది విలువైన ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. పెద్ద మొత్తంలో ఆస్తుల ధ్వంసం జరిగింది. ఇరు దేశాల్లోని సామాన్య ప్రజలు ఈ యుద్ధ ప్రభావాలను తీవ్రంగా ఎదుర్కొంటు న్నారు. ఈ యుద్ధం వల్ల తలెత్తిన విపత్కర పరిస్థితులను, ఇబ్బందులను ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల ప్రజలు అనుభవిస్తున్నారు. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా ముఖ్యంగా యూరప్ దేశాల్లో ఇంధన ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఆహార ధరలు కూడా పెరుగుతున్నాయి. దీంతో లక్షలాదిమంది నిరుపేదలు ఆహారం దొరక్క కరువు వంటి పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ఉక్రెయిన్‌లో ఇటువంటి సంక్షోభాన్ని సృష్టించడానికి సామ్రాజ్యవాద శక్తులు, అవి అమలు చేసే నీచమైన గుత్తాధిపత్యంతో కూడిన ఎత్తుగడలే బాధ్యత వహించాలి. సైనిక ఘర్షణల వల్ల సైనిక పారిశ్రామిక సముదాయాలు, బడా బహుళజాతి కంపెనీలు లాభపడతాయి. అటువంటి కంపెనీలకు అమెరికా వంటి దేశాలు నాయకులుగా వుంటాయి.

దురదృష్టవశాత్తూ, ఈనాడు శాంతిశక్తులు బలహీనపడినట్లు కనిపిస్తోంది. కొరియా యుద్ధంలో, అలాగే వియత్నాం యుద్ధంలో అంతర్జాతీయంగా శాంతి ఉద్యమం తలెత్తింది. శాంతి పరిరక్షణలో, ఇటువంటి సామ్రాజ్యవాద యుద్ధాలకు వ్యతిరేకంగా అలీనోద్యమం కీలక పాత్ర పోషించింది. ఇప్పుడు కూడా మనం సామ్రాజ్యవాద వ్యతిరేక ధోరణులతో అంతర్జాతీయ శాంతి ఉద్యమాన్ని పునర్నిర్మించాల్సిన అవసరం వుంది. అప్పుడు శాంతి కోసం మన ఆక్రందన సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రదర్శించే ఆవేదన కూడా అవుతుంది. మన ఐక్యతను విభజించే మితవాద శక్తుల పెరుగుదలకు వ్యతిరేకంగా మనం చూపించే ఆగ్రహం ఇది. మనం ఐక్యంగా వున్నపుడే శాంతి, ప్రగతులకు హామీ కల్పించబడుతుంది. వాటి గురించి కల కనవచ్చు, కానీ వాటిని సాకారం చేయడం కూడా మన బాధ్యతే. ఇక ఎంతో సమయం లేదు. అణ్వాయుధాలతో, అంతర్జాతీయంగా వాతావరణ మార్పుల వినాశనంతో నిండిన ఈ ప్రపంచంలో, అంతర్జాతీయ శాంతి ఉద్యమాన్ని పునర్నిర్మించాల్సిన అవసరం ఎంతైనా వుంది. ఇదే అందుకు సరైన తరుణం. యుద్ధాన్ని తక్షణమే ఆపాల్సి వుంది.

(ఇండియా న్యూస్ నెట్‌వర్క్
–ఐఎన్ఎన్)

**75 ఏళ్ల స్వాతంత్ర్యం ప్రత్యేక వ్యాసం**

# స్వాతంత్ర్యోద్యమం కమ్యూనిస్టులు



రచయిత సిపిఐ(ఎం) తెలంగాణా రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

**పోతినేని సుదర్శన రావు**

సంపూర్ణ స్వాతంత్ర్యం నినాదం ఇవ్వాలని 1921 అహ్మదాబాద్ కాంగ్రెస్ మహాసభలో ఒక మహమ్మద్ తీర్మానాన్ని ప్రతిపాదించారు. దానిని ఒక స్వామి బలపరచారు. వారి పూర్తిపేర్లు మహమ్మద్ హస్రత్ మెహానీ. స్వామి కుమారానంద. వీరిద్దరూ కమ్యూనిస్టులు. పార్టీ నిర్ణయం మేరకే వారా తీర్మానాన్ని ప్రతిపాదించారు. ఆశ్చర్యకరంగా స్వామి-మహ్మద్‌లు ప్రతిపాదించిన తీర్మానాన్ని కాంగ్రెస్ నాయకత్వం అంగీకరించలేదు. మహాత్మాగాంధీ దానిని బాధ్యతలేని తీర్మానంగా అభివర్ణించారు. అప్పటికి కాంగ్రెస్ సంస్థపుట్టి 37 సం॥లు అవుతున్నది. ఈ కాలంలో అది స్వాతంత్ర్యాన్ని గురించి అంత భాద్యతాయుతంగా చేసిన ప్రతిపాదన ఏదీ లేదు. దరఖాస్తులు ఇచ్చి దేబిరించేదిగానే ఉంది. కమ్యూనిస్టు పార్టీ శాఖ ఏర్పాటయ్యి ఆ నాటికి ఒక్క సంవత్సరమే. కానీ స్వాతంత్ర్యానికి సంబంధించిన పరిపూర్ణ అవగాహనతో ఈ తీర్మానాన్ని ప్రతిపాదించారు. ఒకసారి ప్రతిపాదిస్తే వీగిపోయింది కాబట్టి ఊరుకోలేదు. 1922లో గయలో జరిగిన కాంగ్రెస్ సభలో మళ్ళీ ప్రతిపాదించారు. ఆ ప్రతిపాదన చేసింది సింగారవేలు చెట్టియార్. ఆయనా కమ్యూనిస్టే. (మీరట్, కాన్పూర్ కుట్ర కేసులలో ముద్దాయి కూడా) దానినీ కాంగ్రెస్ నాయకత్వం తిరస్కరించింది. అయినా వదిలి పెట్టలేదు. ఈ డిమాండ్‌ను ఆమోదించాలని 1929 దాకా ప్రతి సభలో కమ్యూనిస్టులు పోరాడారు. చివరికి 1929లో లాహోర్‌లో జరిగిన సభలో కాంగ్రెస్ సంపూర్ణ స్వాతంత్ర్యం డిమాండ్ చేయాలని నిర్ణయించింది.

కమ్యూనిస్టులు సంపూర్ణ స్వాతంత్ర్యం అనటమే కాదు. అదంటే ఏమిటో నిర్వచించారు. దాని ప్రకారం బ్రిటీష్‌వాడు బేషరుతుగా ఈ దేశాన్ని వదలిపెట్టి వెళ్ళిపోవాలి. వాడెళ్ళటమే కాదు. ఇక్కడ ఈ దేశంలో బ్రిటీష్ రాక పూర్వం నుండి కొనసాగుతున్న సంస్థానాలు, రాచరికాలు కూడా రద్దు కావాలన్నారు. సంస్థానాధీశులు, వారి తైనాతీలైన జమిందార్లు అక్రమంగా స్వాధీనం చేసుకొన్న వేలు, లక్షల ఎకరాల భూమిని కూడా జాతీయం చేయాలన్నారు. ఆ భూమిని పేదలకు పంచాలన్నారు. అలాగే కుల నిర్మూలన జరగాలన్నారు. అస్పృశ్యత, అంటరానితనం, వివక్షలకు వ్యతిరేకంగా పోరాడాలని, కార్మికులకు 8గం॥ల పనిదినం ఉండాలని, వారికి కనీస జీవన వేతనం గ్యారంటీ చేయాలన్నారు. కార్మికులకు, రైతులకు సంఘాలు పెట్టుకొనే స్వేచ్ఛ, సమ్మె చేసే హక్కు ఉండాలన్నారు. మత స్వేచ్ఛ, ఇష్టదేవతా పూజా స్వేచ్ఛ ఉండాలి. ఇవన్నీ జరిగితేనే బహుముఖంగా బందీ అయి ఉన్న భారతీయులు విముక్తి అయినట్లు. లేకపోతే ఆ స్వాతంత్ర్యానికి అర్ధం ఉండదన్నారు.

అలా అని నినదించి, నిర్వచించి ఊరుకోలేదు. దాని అమలు కోసం తీవ్రమయిన కృషి చేశారు. 1928లో బొంబాయిలో గిర్నీ కాంగార్ యూనియన్ (రెడ్ ఫ్లాగ్) ఆధ్వర్యంలో జరిగిన బట్టల మిల్లు కార్మికుల సమ్మె భారత కార్మికోద్యమ చరిత్రలోనే ఒక ఉజ్వలమైన పోరాటం. రేషన్‌లైజేషన్‌కు, జీతాలలో 7.5 శాతం కోతకూ వ్యతిరేకంగా ప్రారంభమై, తీవ్రమయిన నిర్బంధాన్నీ, ఆకలినీ, కరువునూ ఎదుర్కొంటూ సాగిందా పోరాటం. 1,50,000 మంది శ్రామికులతో ఉన్న ఈ రంగం మొత్తం 6 నెలల పాటు స్థంభించిపోయింది. కార్మికులు దాదాపు రెండుకోట్ల పనిదినాలు నష్టపొయ్యి ఈ పోరాటం కొనసాగించారు.

అంతేకాదు అక్కడి యాజమాన్యం వివక్ష, విభజించే ఆలోచనతో దళిత కార్మికులకు, ఇతర కార్మికులకు వేరు వేరుగా ఏర్పాటు చేసిన నీళ్ళపంపులు తొలగించాలనీ, అన్నీ అందరికీ సమాన హక్కుగా ఉండాలని పోరాడి సాధించారు. 1924 నుండి 29 వరకు కమ్యూనిస్టులు దేశవ్యాపితంగా నాయకత్వం వహించి నడిపిన సమ్మెలు, లాకౌట్లు సంఖ్య 868. ఇందులో పాల్గొన్న కార్మికుల సంఖ్య 21 లక్షలు. ఈ 6సం॥లో జరిగిన పోరాటాలలో కార్మికులు దాదాపు ఐదు కోట్ల పనిదినాలు కోల్పోయి తమ డిమాండ్లు సాధించుకొన్నారు.

30వ దశకంలో అనేక ప్రాంతాలలో జమిందార్లు, జాగీర్దార్లు, దేశ్‌ముఖ్‌లు, దేశ్‌పాండేలు చేస్తున్న దోపిడీకి, అణచివేతకు వ్యతిరేకంగా పోరాటాలు ప్రారంభించారు. మొట్టమొదటిసారి వర్గప్రాతిపదికపై గ్రామీణ ప్రాంతాలలో సంఘాలు ఏర్పాటు చేశారు. రైతు సంఘం, వ్యవసాయ కార్మికసంఘం, కూలి రక్షణ సమితి, కౌలుదార్ల రక్షణ సమితి మొదలగు సంఘాలు- సమితులు ఏర్పాటు చేశారు. వీటిద్వారా వెట్టికి వ్యతిరేకంగా, జమిందార్లు కాజేసిన భూముల సాధన కోసం పోరాటాలు మొదలయ్యాయి. దేశంలోని వివిధ ప్రాంతాలతో పాటు, తెలంగాణాలోని మునగాల, ఆంధ్రాప్రాంతంలోని చల్లపల్లి, కాళీపట్నం, మందస తదితర ఎస్టేట్‌లలోనూ, మొఖాసాలలోనూ రైతులు పోరాటం సాగించారు. 1937లో ఇచ్ఛాపురం నుండి మద్రాసు వరకు వేలాది మందితో చారిత్రాత్మకమైన రైతు యాత్ర నిర్వహించారు.

దీనితోపాటు అస్పృశ్యత, అంటరానితనం, వివక్షలకు వ్యతిరేకంగా ఉధృతమైన పోరాటాలు సాగించారు. తీవ్రమయిన నిర్బంధాన్ని ఎదుర్కొని కేరళలోని ప్రసిద్ధ పుణ్య క్షేత్రం గురువాయూర్ దేవాలయంలోకి దళితులను తీసుకు వెళ్ళారు. ఆ సమయంలో ఎ కె గోపాలన్, కేలప్పన్‌లపై అగ్రకుల దురహంకారులు దాడి చేశారు. వారు చనిపోతారని నిర్ధారణకు వచ్చి మరణవాంగ్మూలం కూడా తీసుకొన్నారు. అదృష్టవశాత్తూ వారు కోలుకున్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌తో కలిసి మహద్ చెరువు వద్ద జరిగిన వివక్ష వ్యతిరేక పోరాటంలో పాల్గొన్నారు. దళితులు, ఇతర అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం ఉద్యమం నడిపిన రామస్వామి పెరియార్‌తో కలిసి నడిచారు. సుందరయ్య స్వగ్రామంలో సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు.

ఊరుమ్మడి బావులు, చెరువులపై దళితులకు హక్కు కల్పించారు. పేదలకు చదువు చెప్పటానికి రాత్రిబడులు నడిపారు. గ్రంథాలయోధ్యమాన్ని విస్తృతంగా నిర్వహించారు.

ఒకవైపు పైన పేర్కొన్న కృషిని కొనసాగిస్తూనే రెండోవైపు కాంగ్రెస్ పిలుపిచ్చిన సహాయ నిరాకరణోద్యమం, శాసనోల్లంఘనోద్యమం, సైమన్ కమిషన్ బహిష్కరణ, ఉప్పు సత్యాగ్రహం, సత్యాగ్రహోద్యమం మొదలగు అన్ని పోరాటాలలో కమ్యూనిస్టులు కీలకమైన పాత్ర నిర్వహించారు. కమ్యూనిస్టులుగా, పెజెంట్స్ అండ్ వర్కర్స్ పార్టీ నాయకులుగా, కాంగ్రెస్ నాయకులుగా, కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ నాయకులుగా, ప్రజా రంగాల నాయకులుగా, ఇలా బహుపాత్రధారులై దేశం కోసం, సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం పని చేశారు. **సిపిఐ(యం) తొలి పోలిట్ బ్యూరో సభ్యులు తొమ్మిది మంది. వీరందరూ జాతీయోద్యమంలో క్రియాశీలురుగా పనిచేశారు. అందుకుగాను ఈ తొమ్మిదిమందీ సంవత్సరాల కొద్దీ జైలు జీవితం అనుభవించారు. ఈ తొమ్మిది మంది జైలు జీవితం కలిపి కూడితే 65 సం॥లు. సంస్థానాలకు వ్యతిరేకంగానూ, భూ సమస్యను పరిష్కరించాలనీ జరిగిన పోరాటాల్లో కూడా వీరందరూ ప్రత్యక్ష నాయకత్వం వహించి పోరాడారు. అందుకే వారిని నవరత్నాలు అంటాము.**

40వ దశకంలో మహత్తరమైన వీరతెలంగాణా రైతాంగ సాయుధపోరాటం, బెంగాల్లో తెభాగా పోరాటం, మహారాష్ట్రలో వర్లీ ఆదివాసుల పోరాటం, కేరళలో పున్నప్ర వాయలార్ పోరాటం, ఈశాన్య ప్రాంతంలో సుర్మాలోయ రైతాంగ పోరాటం, అస్సాంలో తేయాకు పోరాటం, బొంబాయిలో నావికుల తిరుగుబాటు పోరాటం నడిపించారు. ఇలా పోరాటాలతో బ్రిటీష్ ప్రభుత్వాన్నీ, సంస్థానాధీశులనూ దిగ్బంధించారు. ప్రపంచానికి ఫాసిజం తీవ్రమయిన ప్రమాదంగా దాపురించిన వేళ, అంతర్జాతీయ కర్తవ్య నిర్వహణలో భాగంగా తాత్కాలికంగా క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొనకపోయినా, ఆ ఉద్యమంలో పాల్గొన్న జాతీయోద్యమ నాయకులను విడుదల చేయాలని, అక్రమ కేసులు ఎత్తి వేయాలని, కాంగ్రెస్‌పై నిషేధం రద్దు చేయాలని మరెవరికంటే గట్టిగా పోరాడింది కమ్యూనిస్టులే.

అందుకే క్విట్ ఇండియా స్వర్ణోత్సవాల సందర్భంగా 1992 ఆగస్టు 9 అర్ధరాత్రి నిర్వహించిన పార్లమెంటు సమావేశాల్లో ఆనాటి భారత రాష్ట్రపతి శంకర్ దయాళ్ శర్మ క్విట్ ఇండియా ఉద్యమంలో కమ్యూనిస్టులది కీలకమైన పాత్ర అని పేర్కొన్నారు. ఆ సభలో ఆయన మాట్లాడుతూ "1942 సెప్టెంబర్ 5న ఢిల్లీ నుండి లండన్‌లో ఉన్న సెక్రటరీ ఆఫ్ స్టేట్‌కు ఒక లేఖ వెళ్ళింది. అందులో కమ్యూనిస్టుల ప్రవర్తన బ్రిటీష్ వ్యతిరేక విప్లవ స్వభావంతో నిండి ఉన్నది. అది రోజు రోజుకు పెరుగుతున్నది." అంటూ క్విట్ ఇండియా ఉద్యమంలో కమ్యూనిస్టులు నిర్వహించిన పాత్ర గురించి వివరంగా పేర్కొన్నారు. అందుకే క్విట్ ఇండియా ఉద్యమాన్నుండి కూడా కమ్యూనిస్టులను విడదీసి చూడలేము అని శర్మ పేర్కొన్నారు.

> **"పర్యావరణానికి హాని కలిగించకుండా పెట్టుబడిదారీ వ్యవస్థ నడవగలదని కొందరు వాదిస్తున్నారు. ఇది కేవలం భ్రమ మాత్రమే. పెట్టుబడిదారీ వ్యవస్థలో ఇటువంటి చర్యలు తాత్కాలికమే. పెట్టుబడిదారీ వ్యవస్థలో పెట్టుబడి సంచయనం మందగించగానే, ఆర్థిక అభివృద్ధి చల్లబడగానే, నిరుద్యోగం పెరగగానే, పెట్టుబడి నిరుపయోగంగా ఉండడం మొదలవగానే ఈ సూత్రాలు గాలిలో కలిసిపోతాయి."**

ఈ మొత్తం కృషి చేస్తున్న సమయంలో కమ్యూనిస్టులు ఘోరమైన నిర్బంధాన్ని ఎదుర్కొన్నారు. 1922లో అంటే పుట్టిన రెండేళ్లకే పెషావర్ 1వ కుట్ర కేసుతో మొదలై, 1927లో పెట్టిన 5వ కుట్ర కేసువరకు, పెషావర్‌వే 5కుట్ర కేసులు ఎదుర్కొన్నారు. మధ్యలోనే కాన్పూరు కుట్రకేసు, ఆ తరువాత మీరట్ కుట్ర కేసు ఎదుర్కొన్నారు. పెషావర్ కుట్ర కేసులను కాంగ్రెస్ కనీసం ఖండించను కూడా లేదు. కాన్పూర్, మీరట్ కుట్ర కేసులకు వచ్చేపాటికి ప్రజావత్తిడికి తలొగ్గి, కేసులను ఖండించి, నాయకత్వాన్ని విడుదల చేయాలని డిమాండ్ చేయక తప్పలేదు.

కమ్యూనిస్టులపై మోపబడిన మీరట్ కుట్రకేసు విచారణ ఆనాడు దేశవ్యాపితంగా పెద్ద చర్చనీయాంశం అయింది. ఆ కేసులో ఉన్న ముద్దాయిలు న్యాయవాది లేకుండా తమ వాదనలు తామే వినిపించారు. ఆ వాదనలలో బ్రిటీష్‌వాడు మా దేశం వదలి వెళ్ళిపోవాల్సిందే అని వాదించారు. 200 సం॥ల నుండి జలగలు రక్తాన్ని పీల్చినట్లు మా దేశాన్ని వాళ్ళు పీల్చి పిప్పి చేశారు. ఇంక ఒక్క క్షణం కూడా వాళ్ళకు ఇక్కడ ఉండే అర్హత లేదు అని నినదించారు. మేము బ్రిటీష్ వాణ్ణి ఈ దేశం నుండి వెళ్ళగొట్టడానికి చేయవల్సిన కార్యాచరణ గురించి మీరట్‌లో మాట్లాడుకొన్నది నిజమే అన్నారు. కానీ అది కుట్ర కాదన్నారు. మా దేశాన్ని విముక్తి చేసుకోవడానికి మేము, మా భూభాగమైన మీరట్‌లో కూర్చొని మాట్లాడుకొన్నామని అంగీకరించారు. అది కుట్ర ఎలా అవుతుంది అని నిలదీశారు. బ్రిటీష్ ప్రభుత్వమే కుట్ర పూరితంగా తమపై కేసు పెట్టి నేరం చేసిందన్నారు. వాళ్ళే నేరస్థులు, వాళ్ళే చొరబాటుదారులు, వాళ్ళే దొంగలు, అందుకనే శిక్షించాల్సింది వాళ్ళను తప్ప తమను కాదన్నారు.

ఈ వాదనలు దేశవ్యాపితంగా ప్రాచుర్యం పొందాయి. పత్రికలు ప్రధాన శీర్షికగా ఈ వాదనలు జరిగినన్ని రోజులూ వార్తలు ప్రచురించాయి. అంతకు ముందే ఈ కేసులోని నిందితుల రక్షణ కోసం ప్రధాన జాతీయోద్యమ నాయకత్వం ఒక కమిటీని కూడా వేసి ఉండటం కూడా ఈ ప్రచారానికి తోడ్పడింది.

ఒకవైపు కుట్ర కేసులు, మరోవైపు తీవ్రమయిన అణచివేత, నిర్బంధం, నాలుగు పర్యాయాలు నిషేధాలు కూడా ఎదుర్కొన్నది. ఇలా సుదీర్ఘ పోరాటాలతో, త్యాగాలతో దారిపొడవునా రక్తతర్పణ చేస్తూ కమ్యూనిస్టు పార్టీ జాతీయ ఉద్యమంలో తనవంతు పాత్రను నిర్వహించింది. ఇంకోవైపు అంతర్జాతీయ పరిస్థితులలో మార్పులొచ్చాయి. సోవియట్ యూనియన్ ఎర్రసైన్యాలు ఫాసిజాన్ని మట్టిగరిపించాయి. 1945 ఏప్రిల్ 28న ముస్సోలినీ, 30న హిట్లర్ ఆత్మహత్య చేసుకొని చనిపోయ్యారు. మే1న జర్మన్ పార్లమెంట్ భవనం రీచ్‌స్టాగ్‌పై ఎర్రజండా ఎగిరింది. ఈ ప్రభావం ప్రపంచంలోని వలసదేశాలన్నిటి మీదా పడింది. దేశంలో ఉధృతంగా ఎగిసిపడుతున్న ప్రజా పోరాటాలు, ఉవ్వెత్తున సాగుతున్న జాతీయోద్యమం, మారిన అంతర్జాతీయ పరిస్థితి వలన బ్రిటీష్‌వాడికి స్వాతంత్ర్యం ఇవ్వక తప్పలేదు. 1947 ఆగస్టు 15న అలా మనం స్వాతంత్ర్యం పొందాము.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 2022 ఆగస్టు 15కు 75 వసంతాలు పూర్తవుతాయి.

**(మిగతా 36వ పేజీలో)**

# పార్లమెంటరీ తత్వంపై పోరాటం

(2వ పేజీ తరువాయి)

వ్యతిరేకంగా జరగాల్సిన పోరాటాన్ని నిర్లక్ష్యం చేస్తుంది. ఎన్నికల్లో ఆధిపత్య వర్గాల నుండి సహకారం రాదనే భయంతో ఈ కృషిని నిర్లక్ష్యం చేస్తున్న సందర్భాలు ఉన్నాయని మన పార్టీ నివేదిక పేర్కొన్నది. ప్రజాపునాది పెరగడానికి ఆటంకంగా ఉన్న ధోరణుల్లో పార్లమెంటరీ తత్వం ముఖ్య ధోరణిగా 23వ మహాసభ గుర్తించింది. కానీ ఈ ధోరణిని అధిగమించ డానికి ఈ కాలంలో జరిగిన కృషి స్వల్పమేనని, రానున్న కాలంలో దీనికి ప్రాధాన్యత ఇవ్వాలని 23వ మహాసభ నివేదికల్లో నొక్కి చెప్పింది. పార్లమెంటరీ ధోరణులను ఎదుర్కోవడానికి వర్గ ప్రాతిపదిక మీద వామపక్ష ప్రజాతంత్ర ఉద్యమానికి, ఆ శక్తులను కూడగట్టడానికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని కోరింది.

### ప్రత్యామ్నాయం - వామపక్ష ప్రజాతంత్ర సంఘటన

23వ పార్టీ మహాసభ వామపక్ష ప్రజాతంత్ర సంఘటన (ఎల్‌డిఎఫ్) నిర్మాణానికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని కోరింది. ఒక బూర్జువా పార్టీకి, మరో బూర్జువా పార్టీకి మధ్య పోటీలు జరుగుతున్న నేపథ్యంలో కార్మిక వర్గ ప్రయోజనాలు, రైతాంగ ప్రయోజనాలు కాపాడే సోషలిస్టు భావజాలం ప్రచారంలోకి తేవడమే కాదు, ఆచరణలో దానికోసం కృషి చేయడం ద్వారానే వామపక్ష ప్రజాతంత్ర సంఘటన నిర్మాణం సాధ్యమవుతుందని మహాసభ పేర్కొన్నది. మౌలికమైన ప్రత్యామ్నాయం ప్రాధాన్యత గురించి 10వ పార్టీ మహాసభ ఈ విధంగా చెప్పింది. "వర్గ బలాబలాల్లో మార్పు తేవాలన్నట్లయితే రెండు బూర్జువా పార్టీల మధ్య ప్రజలు ఈ వ్యవస్థలోనే బంధింపబడకుండా ఉండాలన్నట్లయితే వామపక్ష ప్రజాతంత్ర సంఘటన ఆశించే శక్తులన్నింటినీ సమీకరించాలి".

"వామపక్ష ప్రజాతంత్ర సంఘటన అంటే ఇది ఎన్నికల కోసం ఉద్దేశించింది కాదు. లేదా మంత్రివర్గాలు ఏర్పాటు కోసం పెట్టేదికాదు. ఇది పోరాడే శక్తుల అలయెన్స్‌గా ఉంటుంది. తక్షణ విజయాల కోసం, ఆర్థిక, రాజకీయ లక్ష్యాలకోసం ఏర్పాటు అయ్యేది అని గుర్తించాలి. అలాగే ప్రజావ్యతిరేక వర్గ శక్తులను ప్రజల నుండి వేరు చేయడానికి ఉద్దేశించిన అలయెన్స్‌గా గుర్తించాలి" అని 10వ పార్టీ మహాసభ పేర్కొన్నది.

మధురై పార్టీ మహాసభ ఈ వామపక్ష ప్రజాతంత్ర శక్తుల సమీకరణ కోసం జరిగే కృషి ఊగిసలాట లేకుండా సాగాలని కోరింది. మనతో కలిసి వచ్చేవాళ్లలో ఈ ఊగిసలాటలు ఉన్నా వాటిని అధిగమించడానికి కృషి చేయాలన్నది. వామపక్ష ప్రజాతంత్ర శక్తులు, వాటి పాత్ర వివిధ దశల్లో ఎలా ఉండాలన్నది కూడా పేర్కొన్నది. నియంతృత్వం, నిర్బంధకాండ లాంటి సమస్యలు వచ్చినప్పుడు విస్తృత ప్రాతిపదికన అనేక శక్తులను కలుపుకుని పోరాడడంలో ముందుండాలని నివేదిక పేర్కొన్నది. "సెక్యులర్ భావజాలాన్ని దెబ్బతీసేవాళ్ళను ఎదుర్కోవడంలో వామపక్ష ప్రజాతంత్ర శక్తులు ముందుంటాయి. మతతత్వ భావజాలాన్ని ఎదుర్కొంటాయి" అని పార్టీ నివేదిక పేర్కొన్నది. ఒక బూర్జువా పార్టీకి, మరో బూర్జువా పార్టీకి మధ్య పోటీ ఉన్న తరుణంలో వామపక్ష ప్రజాతంత్ర ప్రత్యామ్నాయం ముందుకు తేగలిగితే పార్టీ స్వతంత్ర బలం పెరగడానికి ప్రాతిపదిక ఏర్పడుతుందని చెప్పింది.

### పార్టీ స్వతంత్ర బలం పెరగడం కీలకం

గడచిన 20 సంవత్సరాల నుండి మన పార్టీ స్వతంత్ర బలం తరిగిపోతోందని, స్వంత బలం పెరగాలని ఎన్నో సార్లు తీర్మానాల్లో పేర్కొన్నా అమల్లోకి రాలేదు. ఫలితంగా ప్రజాపునాది ఒక్క కేరళలో తప్ప అన్ని రాష్ట్రాల్లో, ప్రాంతాల్లో తగ్గిపోతోందని ఆందోళన వ్యక్తం చేసింది. 17వ మహాసభలోను, 21వ మహాసభలోను, కలకత్తా ప్లీనంలోను స్వంత బలం పెంచుకోవడానికి అవసరమైన చర్యల గురించి పేర్కొనబడింది. ''హిందూత్వ మతోన్మాదాన్ని బలంగా ఎదుర్కోవాలంటే అది బహుముఖంగా సాగించే మత ఉన్మాద కార్యకలాపాలను నిరంతరాయంగా ఎదుర్కోవాలి. రాజకీయ, సైద్ధాంతిక, సాంస్కృతిక, సామాజిక రంగాలన్నింటిలోను నిర్దిష్టంగా చర్యలు ఉండాలని" 23వ పార్టీ మహాసభ నివేదిక పేర్కొన్నది.

"రాజకీయ విధానం మన స్వతంత్ర బలాన్ని పెంచుకునేదిగా ఉండడం ముఖ్యమైన అంశమే అయినా అందుకు తగిన నిర్మాణ పద్ధతులు కూడా ముఖ్యమని" 23వ పార్టీ మహాసభ పేర్కొన్నది. సరళీకరణ ఆర్థిక విధానాల అమలు నేపథ్యంలో స్వేచ్ఛా మార్కెట్ విధానాలు ప్రజల ఐక్యతమీద బలమైన ప్రభావం చూపుతున్నాయి. ఇది మనం సాగించే పోరాటాల మీద కూడా పెద్ద ప్రభావాన్ని కలిగిస్తున్నది. స్వేచ్ఛా మార్కెట్ విధానాలు భారీ స్థాయిలో ప్రజలమధ్య విభజనలు, చీలికలు సృష్టించాయి. పరిమిత అవకాశాల్లో విపరీతమైన పోటీని ప్రజల్లో సృష్టించాయి. భవిష్యత్తుపై అభద్రతా భావంతోపాటు ఒంటరితనం, నిస్సహాయ స్థితి లాంటి వాటిని పెంచాయి. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రజల్లో పెరుగుతున్న వైవిధ్యం పరిణామాలు రానురాను అనైక్యతకు దారితీస్తున్నాయి. ఇంటర్నెట్, మీడియా నెట్‌వర్క్, ఎంటర్‌టైన్‌మెంట్ రంగం ఇలాంటివన్నీ సరళీకరణ ఆర్థిక విధానాలకు అనుకూలమైన భావజాలాన్ని గుప్పిస్తున్నాయి. కన్స్యూమరిజం తోపాటు వ్యక్తిత్వవాదం లాంటి వాటిని బహుళ ప్రచారంలో పెట్టాయి. ఇది ఈనాటి సమాజంలో వ్యక్తికి సామాజిక స్పృహ లేకుండా చేస్తోంది. అంతేకాదు సరళీకరణ ఆర్థిక విధానాలు వల్ల సమాజంలో మతోన్మాదం, అస్థిత్వవాదంలాంటి సిద్ధాంత ధోరణులు పెరగడానికి అవకాశమిస్తోంది. ఈ పరిస్థితుల్లో మతోన్మాద వ్యతిరేక పోరాటం ఎన్నికల ఎత్తుగడల వరకే పరిమితం కాకుండా, బహుముఖంగాను, ప్రజల అన్ని జీవన రంగాల్లోను సాగిస్తేనే ఎదుర్కోగలం. అలా కానియెడల మన సంబంధాలు బూర్జువా పార్టీల సంబంధాల వరకే పరిమితం అవుతాయి. లౌకిక భావజాలాన్ని ప్రజల్లో చొప్పించలేము.

22వ పార్టీ మహాసభ కూడా ఎన్నికల సమీక్ష సందర్భంగా పార్టీ స్వతంత్ర బలాన్ని పెంచుకోవలసిన ప్రాధాన్యత గురించి పేర్కొన్నది. 23వ మహాసభ స్వతంత్ర బలానికి స్థిరమైన వర్గ పోరాటాలను అభివృద్ధి చేయడం ముఖ్యమని పిలుపునిచ్చింది. ప్రజా సమస్యలను చేపట్టి క్షేత్ర స్థాయిలో పోరాటాలను ముమ్మరం చేయాలని పేర్కొన్నది. ఈ పోరాటాలు మొక్కుబడిగా కాక ప్రత్యక్షంగా విజయాలు సాధించేవరకూ కొనసాగించాలని పేర్కొన్నది. మారిన పరిస్థితుల్లో గ్రామాల్లో కౌలు రైతులు గణనీయంగా పెరిగారని, వ్యవసాయేతర కార్మికుల సంఖ్యా గణనీయంగా ఏర్పడిందని ఆయా తరగతుల మీద కేంద్రీకరించి పని చేయాలని పేర్కొన్నది. కార్మికులలో విభజనలు, అసంఘటిత రంగం విస్తారంగా పెరిగిన నేపథ్యంలో వలస కూలీలు, అసంఘటిత రంగం సమస్యల మీద తగినంత శ్రద్ధ పెట్టి పోరాడాలన్నది.

మన రోజువారీ రాజకీయ ఎత్తుగడలు, పార్టీ స్వతంత్ర బలం పెంచే కృషికి ఆటంకం కారాదు. స్వంత బలం పెంచుకోవడానికి వామపక్ష ప్రజాతంత్ర ప్రత్యామ్నాయం కృషి ప్రథమ ప్రాధాన్యత రావాలి. ఇదే 23వ మహాసభ యొక్క ప్రత్యేకత.

### స్థానిక సమస్యలపై పోరాటాలు

సరళీకరణ ఆర్థిక విధానాలు తెచ్చిన మార్పులు ప్రజల ఆర్థిక సామాజిక జీవనంలో ప్రబల మార్పులకు కారణమయ్యాయి. ఐక్యం

అయ్యేదానికి అనేక ఆటంకాలు సృష్టించాయి. గతంలోలాగా ప్రభుత్వ రంగ కార్మికులు ఏకోన్ముఖంగా పోరాడడం వీలు కావడం లేదు. పర్మినెంట్ కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు, అవుట్‌సోర్సింగ్ కార్మికులు, క్యాజువల్ లేబర్, ఇలా అనేక విభజనలు కార్మికుల్లో ఏర్పడ్డాయి. అలాగే గ్రామాల్లో పెట్టుబడిదారీ విధానం ప్రవేశంతో భూస్వాములు, కాంట్రాక్టర్లు, పెద్ద పెద్ద వ్యాపారస్తులు కూటమిగా ఏర్పడి గ్రామాల్ని శాసిస్తున్నారు. గ్రామాల్లో కౌలు రైతులు పెద్ద సంఖ్యలో ఆవిర్భవించారు. గ్రామీణ వ్యవసాయేతర కార్మికులు గణనీయంగా ఏర్పడ్డారు. భూపోరాటాలు, కూలీ పోరాటాలు ఇంతకుముందులాగా సాగించడానికి వీలుకావడం లేదు. ఈ నేపథ్యంలో మన ప్రజాసంఘాల పనివిధానంలో మారిన పరిస్థితులకు అనుగుణంగా మార్పులు రావాలి. ప్రాధాన్యతలూ మారాలి. స్థానిక సమస్యలపై కృషి అంటే పరిస్థితుల్లో ఏర్పడ్డ వైవిధ్యాన్ని గుర్తించి ప్రజలెదుర్కునే సమస్యలపైన ఆందోళనలు పోరాటాలుగా మార్చాలి. పార్టీ పెరగాలంటే స్థానిక పోరాటాలు నిరంతరాయంగా జరిగే పోరాటాలుగా మారాలి. అంతేకాదు, విస్తారమైన ప్రాంతాల్లోకి అవి విస్తరించాలి. ఓట్లు ఆకర్షించడానికి పాలకవర్గాలు ప్రకటించే పథకాలు, ఇన్సూరెన్సు స్కీములు, సబ్సిడీల స్థానంలో రంగంలోకి వచ్చాయి. మౌలికమైన డిమాండ్‌ల నుండి ప్రజల దృష్టి మళ్లించడానికి ఈ విధానాలు అమల్లోకి వచ్చాయి. ఇవి రైతాంగ ఐక్యతను, కార్మికవర్గ యూనియన్ల ఐక్యతను బలహీనపర్చాయి. పెరిగిన నిరుద్యోగం, లేబర్ మార్కెట్ వలసలు కార్మికుల ఐక్యతకు ఆటంకంగా తయారయ్యాయి. ఈ అననుకూల తలను ఎదిరించడానికి స్థానిక పోరాటాలు కీలకమవుతాయి. సరళీకరణ ఆర్థిక విధానాలను ఎదిరించి పోరాడ్డానికి మన నిర్మాణ పద్ధతులూ మారాలి. నాణ్యమైన పార్టీ సభ్యులు, నాణ్యమైన పూర్తికాలం కార్యకర్తలు, స్థానిక పోరాటాలు ముమ్మరంగా సాగించడానికి అవసరం.

### పార్లమెంటరీయేతర కార్యకలాపాల ప్రాధాన్యత

1967లో నూతన పరిస్థితులు – నూతన కర్తవ్యాలు అన్నీ పార్టీ తీర్మానం ఈ అంశాన్ని విశదీకరించింది. పార్లమెంటరీ, పార్లమెంటరీ యేతర రంగాల్లో కృషి సందర్భంగా పార్లమెంటరీ యేతర సమస్యలు ముందుకు వచ్చినప్పుడు వాటికే ప్రాధాన్యత ఇవ్వాలని కోరింది. కేరళ, బెంగాల్, త్రిపుర రాష్ట్రాల్లో అధికారానికి వచ్చిన తొలి దినాల్లో పార్లమెంటరీయేతర ఉద్యమాలను పార్టీ బాగా బలంగా సంధించింది. అప్పుడు పార్టీ బలం పెరిగింది. అలాగే స్వాతంత్రోద్యమ కాలంలో రైతుల అప్పులు మాఫీ కావాలని, అన్యాక్రాంతమైన భూములు రైతుపరం కావాలని సాగిన పోరాటాల్ని బ్రిటీషు వ్యతిరేక పోరాటంతో మేళవించింది. తెలంగాణ సాయుధ పోరాటం, పున్నప్రా వాయిలార్ పోరాటం లాంటివి ఉధృతంగా సాగడమేగాదు కడలూరు, సేలం జైళ్లలో సైతం కమ్యూనిస్టులు ఇందుకోసమే ప్రాణాలు బలిచ్చారు. కమ్యూనిస్టు ఉద్యమానికి పోరాటాలు అత్యంత కీలకమని కమ్యూనిస్టులు సాగించిన జాతీయోద్యమ రోజుల్లో పోరాటాలు రుజువు చేశాయి. పార్టీ బలపడింది. 1990 తరువాత పార్లమెంటరీ యేతర కార్యకలాపాలను పార్లమెంటరీ కార్యకలాపాలతో మేళవించి సాగించడం తగిన స్థాయిలో చేయలేకపోవడం ముఖ్యమైన బలహీనత. 2011 బెంగాల్ ఎన్నికల సమీక్షలో పార్టీ ఈ విషయాన్ని పేర్కొన్నది. ఈ రీత్యానే మారిన పరిస్థితులకనుగుణంగా ఉద్యమాలు, పోరాటాలు చేయడానికి పార్లమెంటరీయేతర రంగాన్ని తగిన స్థాయిలో అమలు చేయలేకపోయామన్న బలహీనతను గుర్తెరిగి పోరాడాలని 23వ మహాసభ పిలుపునిచ్చింది.

### సాంస్కృతిక రంగంలో కృషి

నేటి యుగం వైజ్ఞానిక, ఆధునిక యుగం. కానీ ఈ కాలంలోనే మతం, మతతత్వం సమాజంలో విజృంభిస్తున్నాయి. సెక్యులర్ రాజ్యంలో మతానికీ, రాజకీయానికీ ముడి పెడుతున్నారు. అవసరాన్ని బట్టి కులాన్ని రెచ్చగొడుతున్నారు. రాజకీయ ప్రయోజనాలకు వినియోగిస్తున్నారు. స్వాములు, బాబాలు వారి మహిమలు రకరకాల అవతారాలు ముందుకొస్తున్నాయి. మాధ్యమాల్లో ఇవి విపరీతమైన ప్రచారాన్ని పొందుతున్నాయి. యూనివర్సిటీల్లో మేధావులు, శాస్త్రజ్ఞులు కూడా వీటిని ప్రోత్సహిస్తున్నారు. విద్యార్థినీ, విద్యార్థులకు విద్య, విజ్ఞాన బుద్ధులు బోధించవలసిన వారు శాస్త్రీయ ఆలోచనల స్థానంలో మూఢనమ్మకాలవైపు మళ్ళించే ప్రయత్నాలు చేస్తున్నారు. అటు మూఢనమ్మకాలను, ఇటు అంధవిశ్వాసాలను ప్రోత్సహించడం నేడు వికృతరూపం దాలుస్తోంది.

మహిళలపై అత్యాచారాలు, దౌర్జన్యాలు ఎక్కువవుతున్నాయి. సరళీకరణ విధానాల అమలు, హింస, ఉత్కంఠ, బూతు ఇలాంటి కలగలిపిన కథలను మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. మత్తు పదార్థాల వ్యాపారమూ ఎక్కువైంది. క్లబ్బులు, పబ్‌లు ఫ్యాషనైంది. స్త్రీ, పురుషులకు సమాన హక్కులు ఉండాలన్న డిమాండ్ గానీ, పరిపాలనా స్థానాల్లో మహిళలకు రిజర్వేషన్లు కావాలనిగానీ పాలకవర్గాలకు పట్టడంలేదు. దేశాధినేతలు, రాజకీయ నాయకులు బాబాల పాదాల్ని ఆశ్రయించడం, అందుకు ప్రభుత్వ పదవులను వినియోగించడం వికృత స్థాయికి చేరింది. ఈ నేపథ్యంలోనే సాంస్కృతిక రంగంలో కృషికి ప్రాధాన్యత పెరిగింది. లౌకిక రాజ్యాన్ని, రాజ్యాంగాన్ని హిందూ మత రాజ్యాంగంగా మార్చే ప్రయత్నం ముమ్మరంగా సాగుతున్న ఈ రోజుల్లో, మతోన్మాదాన్ని ఎదుర్కోవడం కేవలం ఎన్నికలు, ప్రభుత్వాల ఏర్పాటు తదితర సందర్భాల్లో మాత్రమే అయితే ఓడించడం కష్టం. ప్రజల అన్ని జీవన రంగాల్లో మతోన్మాదాన్ని ఎదుర్కోవాలి. అందుకు బహుముఖమైన కార్యకలాపాలు సాగాలి. 30 సంవత్సరాలుగా దేశంలో సరళీకరణ విధానాల అమలు మతోన్మాద ధోరణులు పెరగడానికి అవకాశ మిచ్చాయి. అస్థిత్వ రాజకీయాలు (కులం) పెరగడానికీ అవకాశమిచ్చాయి. అందువల్ల సాంస్కృతిక రంగంలో కృషికి తగినంత ప్రాధాన్యత ఇచ్చి కుల, మత ధోరణులను బలహీనపర్చాలి. లౌకిక తత్వం, సామాజిక న్యాయాన్ని బలోపేతం చేయాలి.

మార్పు కోసం జరిగే ఉద్యమాల ఉధృతి ఒకే స్థాయిలో ఉండదని, ఒక్కో సందర్భంలో ప్రతీఘాత శక్తులు బలం పుంజుకున్నా విప్లవ శక్తులు, పురోగమన ఉద్యమాలు, పోరాట వెల్లువలు వెనుకపట్టు పట్టినా మళ్ళీ ముందంజ వేస్తాయని విశ్వసిస్తారు కమ్యూనిస్టులు. ఈ విశ్వాసమే భవిష్యత్తు పోరాటాలకు సోపానం కాగలదు.

కమ్యూనిస్టు ఉద్యమం సంక్లిష్టమైన సమస్యలను ఎదుర్కొంటున్న తరుణంలో మల్లు స్వరాజ్యం గారు మరణించారు. మారిన పరిస్థితులకనుగుణంగా ఉద్యమాలు, పోరాటాలకు ఉపక్రమించడమే కామ్రేడ్ మల్లు స్వరాజ్యం గారికి నిజమైన నివాళి అవుతుంది. నేడు వామపక్ష విధానాలతో, కమ్యూనిస్టులతో పోటీ పడే రాజకీయ శక్తి ఏదీ లేదు. కమ్యూనిస్టులకు విధానాల పరంగా ప్రజల పక్షాన నిలబడే విధానాలున్నాయి. డబ్బుకు, ఆస్తులకు లొంగరనే ప్రగాఢమైన భావం ప్రజల్లో ఉన్నది. నైతికంగా ప్రజాజీవితంలో సామాజిక న్యాయానికి, విలువలకు పెట్టింది పేరు కమ్యూనిస్టులు. పార్లమెంటులో ఉన్నా, ప్రజాసంఘాల్లో ఉన్నా ఆర్థిక క్రమశిక్షణ కమ్యూనిస్టుల సొంతం. కావున 23వ మహాసభ ఇచ్చిన పిలుపుకు పునరంకితం కావడమే నిజమైన నివాళి. ❋

Date of Publication : 30th of every month. Date of Posting : 5th & 7th of every month.
Postal Regd. No. D/VJ/172/2021-23, Marxistu Monthly Magazine, Volume 18, issue : 4 Vijayawada
RNI Reg. No. APTEL/2006/17554 - Rs. 15/- Total Pages : 36

## ఆటోమేషన్ ప్రభావాన్ని 'రోబో పన్ను' భర్తీ చేయగలదా?

(13వ పేజీ తరువాయి)

చాలక పన్నును ప్రవేశ పెట్టింది. ఆటోమేషన్‌కి మారిన పరిశ్రమలకు పన్ను సబ్సిడీలను తొలగించింది. పనులను ఔట్‌సోర్స్ చేసిన సంస్థలపై పన్నులు వేసింది. ఆటోమేషన్ వలన ఖర్చులు పెరిగి, పేద దేశాల నుండి తక్కువ ఖర్చుకు తెచ్చుకున్న జీతగాళ్ల వేతన బిల్లులలో తరుగుదల ఈ బేధాన్ని సరిచేసింది.

రెండో పద్ధతి, ధనవంతులపై సంపద పన్నువేసి ఆ మొత్తంతో సార్వజనీన మూల వేతనం నిరుద్యోగులందరికి ఇవ్వాలి. పై తరగతులకు వేసే 'ఎక్కువ పన్ను రేట్లు' లేదా సాధారణంగా వేసే సంపద పన్ను వాస్తవానికి పెరుగుతున్న అసమానతలను తొలగించే సమస్యకు సరైన పరిష్కారం చూపగలవని థామస్ పికెట్టి, ఇమ్మాన్యుయేల్ సెజ్ భావిస్తున్నారు. ఈ పన్ను ఎంత ఉండాలన్నది, సంపద గలవారు ఈ పన్నులను కడతారా లేదా అన్నది వేరే చర్చించవలసిన అంశం.

పశ్చిమ దేశాలలో లాగా కాకుండా భారతదేశం ఇప్పుడిప్పుడే స్వయం చాలకత దిశగా అడుగులు వేస్తున్నది. అందువలన ఈ వ్యవస్థ తయారు చేసిన నిరుద్యోగాన్ని నిలువరించటానికి బడా పారిశ్రామిక వేత్తల నుండే వసూలు చేయాల్సి ఉంటుంది. ఈ విషయాన్ని విధాన నిర్ణయకర్తలు ఆలోచించాలి. పెరుగుతున్న అసమానతలకు ఎలా అడ్డుకట్ట వేయాలో తెలుసుకోవాలి. నిరుద్యోగాన్ని తొలగించి, వ్యవస్థీకృతమైన నిరుద్యోగాన్ని ఎలా సమర్థవంతంగా ఎదుర్కోవాలో, తద్వారా సమాజంలో అసమానతలు ఎలా తొలగించుకోవాలో తెలుసు కోవాలి. ఎక్కువ కష్టపడకుండా కార్మికులు ఇతర వృత్తులలోకి మారేందుకు అవసరమైన నైపుణ్యాలను సమకూర్చుకునే అవకాశాన్ని కల్పించాలి. నిరుద్యోగులుగా ఉన్న కాలం నుండి తిరిగి ఉద్యోగాలు పొందే మధ్య కాలంలో ప్రభుత్వాలు తగిన మద్దత్తు నివ్వాలి.

**(అనువాదం: కె ఉషారాణి)**

## స్వాతంత్ర్యోద్యమం కమ్యూనిస్టులు

(33వ పేజీ తరువాయి)

దురదృష్ట వశాత్తూ స్వాతంత్ర్యోద్యమంతో ఏ మాత్రం సంబంధం లేనివారు ఈరోజు పార్లమెంటులో బలమైన శక్తిగా తయారై, అధికారంలో ఉన్నారు. జాతిపితగా గౌరవించే మహాత్మాగాంధీ హంతకుల మూలాలతో వారు బలమైన సంబంధాలు కలిగి ఉన్నారు. ఆనాడు దేశ విభజనకు, లక్షలాది మంది ఊచకోతకు కారణమయిన వారూ వీరే. అప్పటినుండి ఇప్పటిదాకా అదే తమ విధానంగా కొనసాగిస్తున్నారు. అజాదీకా అమృత్ మహోత్సవ్ పేరుతో ఈ ఉత్సవాలను నిర్వహించాలని వారి (బిజెపి) నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అంబానీలకు, అదానీలకు వారితో పాటు కొద్దిమంది కార్పొరేట్లకు ఈ ప్రభుత్వం అమృతాన్నందిస్తున్నది. మిగిలిన వారినందరినీ గంజితాగి బతుకమంటున్నది. రైతు చట్టాలను తీసుకొచ్చి వ్యవసాయ రంగాన్ని కూడా కార్పొరేట్లకు, కాంట్రాక్టర్లకు అప్పచెప్పాలని ప్రయత్నం చేసింది. జాతీయోద్యమ కాలం నుండి ఎన్నో పోరాటాలు చేసి సాధించుకొన్న 44 కార్మిక చట్టాలను రద్దుచేసి, దుర్మార్గమైన నాలుగు కోడ్‌లను తీసుకు వచ్చింది. ఈ సం॥ము జులై నుండే వాటిని అమలు చేయడానికి పూనుకొంటున్నది. 1980 అటవీచట్టంకు రూల్స్ పేరుతో సవరణ చేసి గిరిజనులను అడవుల నుండి పంపి, పసిడి కాంతులీనే ఆ పచ్చని భూమాతనూ కార్పొరేట్ కత్తులకు బలివ్వ పూనుకొన్నది. ఉక్కు పరిశ్రమలు, బొగ్గుబావులు, పోర్టులు, ఎయిర్ పోర్టులు, రైళ్లు, రైల్వే స్టేషన్లు, బ్యాంకులు, ఇన్సూరెన్స్ సంస్థలు అన్నీ వారికే కట్టబెడుతున్నది. అందుకే వారు ప్రపంచంలోనే సంపద కూడబెట్టిన వాళ్ళల్లో మొదటి ఐదుగురిలో ఉండటానికి పోటీపడుతున్నారు.

ఇంకోవైపు దేశ ప్రజలను మతం పేరుతో విడదీయాలని చూస్తున్నది. వీటిని ప్రశ్నించేవారిపై దేశద్రోహ చట్టాల క్రింద కేసులు పెట్టి సం॥ల కొద్దీ జైళ్ళల్లో నిర్భంధిస్తున్నది. లౌకిక తత్వాన్నీ, రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తున్నది. రాజ్యాంగ సంస్థలను ఇష్టం వచ్చినట్లు దుర్వినియోగం చేస్తున్నది. ఆనాడు బ్రిటీష్ వాడు దేశ సంపదను తనదేశానికి తరలించాడు. ఈనాడు బిజెపి కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నది. వాటికి వ్యతిరేకంగా ఉధృతమైన పోరాటాలు సాగిస్తేనే స్వాతంత్ర్యఫలాలు మనకు దక్కుతాయి. అందుకే మరో స్వాతంత్ర్య పోరాటానికి సిద్ధమవుదాం.

❊

**చిరునామా**
**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి, పిన్: 522501, గుంటూరు జిల్లా. సెల్: 94900 99422**

**చందా వివరాలు**
విడిపత్రిక: **రూ. 15**, సంవత్సర చందా:**రూ. 150**, పోస్టు ద్వారా **రూ. 180**
పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చందాదారుని చిరునామా**

**పోస్టు స్టాంపు**

ఇంటి నెంబరు..........................................
వీధి......................................................
గ్రామం..................................................
మండలం లేదా పట్టణం.............................
జిల్లా......................................................

email: marxistap@gmail.com
venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 94900 99422.
Editor : S. Venkatarao,